


సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 167

బుధవారం 7-9-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారత్ కథ ముగిసె!
శ్రీలంక చేతిలోనూ ఓటమితో ఆసియా కప్ ఫైనల్ ఆశలు ఆవిరి -12లో



స్వల్ప నష్టాలతో ముగింపు
592 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్.. నిఫ్టీ 10 పాయింట్ల నష్టం -13లో

న్యూస్‌రీల్

విచ్ఛిన్నకర శక్తులపై ఉమ్మడి పోరు



ఉగ్రవాద, ఛాందసవాద శక్తులను కలిసికట్టుగా ఎదుర్కోవాలని భారత్, బంగ్లాదేశ్ నిర్ణయించాయి. భారత్ పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో ప్రధాని మోదీ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నదీ జలాల పంపిణీ సహా 7 ఒప్పందాలు చేసుకున్నారు.
వివరాలు 6లో ▸

ముక్కు ద్వారా కోవిడ్ వ్యాక్సిన్



ముక్కు ద్వారా చుక్కల రూపంలో తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్‌కు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా అనుమతి లభించింది. భారత్ బయోటెక్ తయారు చేసిన ఇంట్రానాసల్ కోవిడ్ వ్యాక్సిన్‌ను 18 ఏళ్లు పైబడిన వారికిచ్చేందుకు అనుమతిచ్చినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి తెలిపారు.
వివరాలు 6లో ▸

ప్రధాని పదవిపై ఆసక్తి లేదు



బిహార్ సీఎం, జేడీ (యూ) నేత నితీశ్ కుమార్ మంగళవారం ఢిల్లీలో ఆప్, సీపీఐ, సీపీఎం, సమాజ్‌వాదీ, ఐఎన్ఎల్‌డీ పార్టీల నాయకులు కేజ్రీవాల్, రాజా, ఏచూరి, అఖిలేశ్‌యాదవ్, చౌతాలాతో భేటీ అయ్యారు. ప్రధాని పదవిపై తనకు ఆసక్తి లేదని నితీశ్‌కుమార్ అన్నారు.
వివరాలు 6లో ▸



బ్యారేజీల ప్రారంభోత్సవ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

> దేవుడి దయ వల్ల వరుసగా నాలుగో ఏడాది కూడా రాష్ట్రంలో మంచి వర్షాలు కురుస్తున్నాయి. రైతన్నల మొహంలో చిరునవ్వు కనిపిస్తోంది. గత మూడేళ్లలో రాష్ట్రంలో ఏ ఒక్క మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాల్సిన అవసరం రాలేదు. అంతటా ఒక మంచి వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీని జాతికి అంకితం చేస్తున్నాం.
>
> ఈ రోజు ఈ రెండు ప్రాజెక్టులు మాత్రమే కాదు.. దేవుడి దయతో ప్రతి సాగునీటి ప్రాజెక్టునూ పూర్తి చేయడానికి అడుగులు ముందుకు వేస్తున్నాం. శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు 26 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో తీసుకున్నాం. ప్రతి ప్రాజెక్టును కూడా ఉరుకులు పరుగులు పెట్టిస్తామని హామీ ఇస్తున్నాను. మీ అందరి చల్లని దీవెనలతో దేవుడు మరింతగా మంచి చేసే అవకాశం ఇవ్వాలని.. తద్వారా రైతన్నలకు ఇంకా మంచి జరగాలని మనసారా కోరుకుంటున్నాను.
>
> \- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





నెల్లూరు బ్యారేజీ, మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

ప్రాజెక్టులన్నీ చకచకా

మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీల ప్రారంభోత్సవంలో సీఎం జగన్

26 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో నిర్మిస్తాం

- సాగునీటి ప్రాజెక్టుల పట్ల వైఎస్సార్ స్ఫూర్తిని కొనసాగిస్తున్నాం
- ప్రతికూల పరిస్థితుల్లోనూ ఈ బ్యారేజీల నిర్మాణం పూర్తి చేశాం
- నాన్నగారి మరణం తర్వాత ఈ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు
- చంద్రబాబు హయాంలో జరిగింది కమీషన్లు దండుకోవడం మాత్రమే..
- మన ప్రభుత్వం వచ్చాక సంగం బ్యారేజీ కోసం రూ.200 కోట్లు ఖర్చు చేశాం
- దేవుడి దయతో నాలుగేళ్లల్లో ఒక్క కరువు మండలం కూడా లేదు
- ఈ ప్రాంతంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.85 కోట్లు కేటాయింపు
- మహానేత వైఎస్సార్, గౌతమ్‌రెడ్డిల కాంస్య విగ్రహాల ఆవిష్కరణ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సంగం, నెల్లూరు బ్యారేజీలు మాత్రమే కాకుండా, దేవుడి దయతో ప్రతి సాగునీటి ప్రాజెక్టునూ ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పట్ల నాన్నగారు ప్రదర్శించిన చిత్తశుద్ధిని అదే స్ఫూర్తితో కొనసాగిస్తూ.. 26 ప్రాజెక్టులనూ నిర్మిస్తామని చెప్పారు. మంగళవారం ఆయన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీలను జాతికి అంకితం చేశారు. సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సంగం బ్యారేజీ వద్ద దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిల కాంస్య విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంగం బ్యారేజీ వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మనందరి ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.320 కోట్లు ఖర్చు చేసి.. సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీలను పూర్తి చేశామని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా దాదాపు 5 లక్షల ఎకరాలకు సాగు నీటిని స్థిరీకరించామని.. తద్వారా ఆత్మకూరు, నెల్లూరు రూరల్..

మిగతా 3వ పేజీలో ▶

సీట్ల కేటాయింపు 6 రౌండ్లకు పరిమితం

- ఐఐటీ, ఎన్ఐటీలు, తదితరాల్లో ప్రవేశాలపై జోసా నిర్ణయం
- జేఈఈ పరీక్షల ఆలస్యంతో కౌన్సెలింగ్‌పై ప్రభావం
- గతంలో ఏడు రౌండ్లతో పాటు స్పెషల్ రౌండ్ నిర్వహణ
- 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, 26 ఐఐఐటీలు, 36 ఇతర సంస్థల్లో 52 వేలకు పైగా సీట్లు
- 12 నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

14లో

షి'కారు' వెనుక డీలర్లతో డీల్!

- ఎస్సీలకు ఉపాధి పేరుతో గత టీడీపీ సర్కారు నిర్వాకాలు
- ఎస్సీ కార్పొరేషన్ నిధులు పరాయి పాలు.. ముందుగానే రూ.365.67 కోట్ల చెల్లింపులు
- ఆ మేరకు వాహనాలు లేవు.. డబ్బులూ తిరిగివ్వరు
- నాలుగేళ్లుగా రూ.67.67 కోట్లు డీలర్ల వద్దే.. తిరిగి వసూలుకు అధికార యంత్రాంగం సన్నద్ధం

10లో

బెంగళూరులో వరద విలయం



బెంగళూరు వరద నీటి కష్టాల్లో చిక్కుకుంది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షపు నీరు మంగళవారానికి కూడా వదలక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ నీట మునగడంతో రవాణాకు ట్రాక్టర్లే దిక్కయ్యాయి.

6లో

సిద్ధార్థ విద్యాసంస్థలు

(అటానమస్), పుత్తూరు, తిరుపతి జిల్లా.

ACCREDITED WITH GRADE A+ NAAC

NBA NATIONAL BOARD OF ACCREDITATION



SIDDHARTH INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY (AUTONOMOUS)	SIDDARTHA INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY (AUTONOMOUS)
COUNSELLING CODE **SDTN**	COUNSELLING CODE **SIST**

SIDDHARTH INSTITUTIONS PUTTUR ESTD: 2001

MAX MIN

40 LAKHS HIGHEST PACKAGE

"Your Pathway to SUCCESS"

JOB OFFERS

1140	1522	1714
2020 BATCH	2021 BATCH	2022 BATCH



CENTER OF EXCELLENCES

virtusa · Skill AP APSSDC · intel · IBM · DASSAULT SYSTEMES The 3DEXPERIENCE LAB

CMSEC
CM'S SKILL EXCELLENCE CENTER
Artificial Intelligence Machine Learning and Deep Learning Zonal Center, Civil & Mechanical Design Software Labs

SIEMENS TDS
1. DESIGN COMPUTER BASED TESTING LAB
2. HOME ELECTRONICS LAB
3. OFFICE ELECTRONICS LAB
4. HOME ELECTRICAL LAB
5. REFRIGERATION & AIR-CONDITIONING LAB
6. AUTOMOBILE TWO WHEELER LAB
7. AUTOMOBILE FOUR WHEELER LAB

COLLABORATION WITH IIT - TIRUPATI
TIRUPATI

Siddharth Institutions are under active consideration of IIT Tirupati for mentoring of its academic system of advanced learning and research.

SIDDHARTH INTERNATIONAL INCUBATION CENTER

nurtures the innovative ideas of the students and accommodates student STARTUP Companies with financial support from Rs.25 Lakhs to 1 Crore through Seed Support System.

KALYANI ADS

COURSES OFFERED

B.TECH.

- CIVIL ENGINEERING (CIVIL)
- ELECTRICAL AND ELECTRONICS ENGINEERING (EEE)
- MECHANICAL ENGINEERING (MECH)
- ELECTRONICS AND COMMUNICATION ENGINEERING (ECE)
- AGRICULTURAL ENGINEERING (AE)
- COMPUTER SCIENCE AND ENGINEERING (CSE)
- COMPUTER SCIENCE AND INFORMATION TECHNOLOGY (CSIT)
- CSE- (ARTIFICIAL INTELLIGENCE AND MACHINE LEARNING)
- CSE- (INTERNET OF THINGS AND CYBER SECURITY INCLUDING BLOCK CHAIN TECHNOLOGY)
- CSE- (ARTIFICIAL INTELLIGENCE AND DATA SCIENCE)
- CSE- WITH SPECIALISATION IN CLOUD COMPUTING
- CSE- (WITH SPL IN IoT & AUTOMATION)
- CSE- (ARTIFICIAL INTELLIGENCE)

M.TECH.

- STRUCTURAL ENGG.
- POWER ELECTRONICS
- DECS
- VLSI
- CSE
- THERMAL ENGINEERING
- SOFTWARE ENGINEERING

MBA & MCA

B.Ed., D.El.Ed.,

DIPLOMA

- CIVIL ENGG.
- ELECTRICIAL & ELECTRONICS ENGG.
- ELECTRONICS AND COMMUNICATION ENGG.
- MECHANICAL ENGG.
- AGRICULTURAL DIPLOMA

WHY YOUR EDUCATION SHOULD BE AT SIDDHARTH

- Awarded "A" Grade by Govt. of A.P.
- Internships by Reputed MNC's
- Industry Academia Partnership
- Training Delivered by Software Professionals
- STATE-OF-THE-ART LABS
- Advanced Robotic Lab
- Dubbing Studio & Preview Theater
- 4000 Seating Capacity A/c Auditorium
- Research Centers
- A/c Computer Laboratories with 2000 High Configured systems on a single floor
- Digital & Virtual Class Rooms
- Free WiFi Campus
- Separate Hostel Facility for Boys & Girls
- Full - Scale Sports Facilities & Gym

ఇంజనీరింగ్ విద్యలో చేరే విద్యార్థులకు ఆత్మీయ సూచనలు :



Dr. K. Ashok Raju
Chairman

Contact for Admissions : 9396904599 / 9704668399

'పిల్'లు దుర్వినియోగం

- వాటి వెనుక రాజకీయ నేతలు, పారిశ్రామిక వేత్తలు
- డబ్బులిచ్చి దాఖలు.. మధ్యవర్తులూ ఉంటున్నారు
- కఠినంగా ఉంటాం.. భారీగా ఖర్చులు విధిస్తాం
- స్పష్టం చేసిన హైకోర్టు సీజే ధర్మాసనం

సాక్షి, అమరావతి: ప్రజా ప్రయోజన వ్యాజ్యాల (పిల్) పేరుతో కొందరు కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని, ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని హైకోర్టు హెచ్చరించింది. రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు కొందరి వెనుక ఉంటూ డబ్బులిచ్చి హైకోర్టులో వీటిని దాఖలు చేయిస్తున్నారని పేర్కొంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా అన్ని రాష్ట్రాల్లో జరుగుతోందని, ఇలాంటి వ్యాజ్యాల పట్ల కఠినంగా వ్యవహరించాల్సి ఉందని తేల్చి చెప్పింది. హైకోర్టులో కొందరి తరఫున పిల్‌లు దాఖలు చేయించేందుకు మధ్యవర్తులు కూడా ఉన్నారని తెలిపింది. తప్పుడు పిల్‌లు దాఖలు చేసే వారికి భారీగా ఖర్చులు విధించి తద్వారా గట్టి సందేశం పంపాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. తూర్పు గోదావరి జిల్లాలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటుపై దాఖలైన వ్యాజ్యంలో సింగిల్ జడ్జి ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో అదే అంశంపై తిరిగి ధర్మాసనం ఎదుట పిల్ దాఖలు చేసిన వ్యక్తులకు ఖర్చులను కచ్చితంగా విధిస్తామని హైకోర్టు తేల్చి చెప్పింది. అందుకు ఇది అన్ని రకాలుగా అర్హమైన కేసు అని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇదీ నేపథ్యం..

తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం మర్రిపూడి పరిధిలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటును సవాలు చేస్తూ జి.సుధాకర్‌రెడ్డి మరో ఇద్దరు పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గత విచారణ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) తరఫు న్యాయవాది సురేందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఇదే అంశంపై సింగిల్ జడ్జి ఎదుట ఓ వ్యక్తి పిటిషన్ వేశారని, అందులో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని తెలిపారు. ఆ విషయం తెలిసి కూడా పిటిషనర్లు పిల్ దాఖలు చేయడం కోర్టును తప్పుదోవ పట్టించడమే అవుతుందన్నారు.

అత్యధిక శాతం దుర్వినియోగం చేసేవే..

తాజాగా ఈ పిల్ విచారణకు రావడంతో ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్లకు ఎంత మేర ఖర్చులు విధించాలో చెప్పాలని పేర్కొంది. ఈ రోజుల్లో నిజమైన పిల్‌లు చాలా స్వల్ప సంఖ్యలో దాఖలవుతున్నాయని, అత్యధిక శాతం కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేసేవేనని తెలిపింది.

ఎవరో వేస్తారు.. ఎవరికో డబ్బు అందుతుంది

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు నిరక్షరాస్యులని నివేదించారు. కోర్టును తప్పుదోవ పట్టించాలన్న ఉద్దేశం వారికి ఎంత మాత్రం లేదన్నారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇవ్వలేదన్న విషయం వారికి తెలియదన్నారు. కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ పిల్‌లు దాఖలు చేసే వారికి భారీ మొత్తంలో ఖర్చులను విధించాల్సిందేనని, అయితే పిటిషనర్లు ఆ కోవలోకి రారని విన్నవించారు. అయితే నిరర్థక వ్యాజ్యాలపై కఠినంగా వ్యవహరించాల్సిందేనని ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాంటి వ్యాజ్యాల కోసం తాము చాలా కాలంగా ఎదురు చూస్తున్నామని, ఇన్ని రోజులకు అలాంటి వ్యాజ్యం ఎదురైందని, రూ.25 లక్షలను ఖర్చుల కింద విధించాలన్న నిర్ణయానికి ఇప్పటికే వచ్చామని, ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులను సైతం సిద్ధం చేశామని తెలిపింది. ఎవరో పిల్ వేస్తారని, ఎవరికో డబ్బులు చెల్లిస్తారని, ఇలాంటి వ్యాజ్యాలను విచారించడం తమ పని కాదని తేల్చి చెప్పింది. ఈ వ్యాజ్యంలో ఖచ్చితంగా ఖర్చులు విధిస్తామని, అయితే అది ఎంతనేది తరువాత నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది.

పోలవరం తొలిదశతో 2.98 లక్షల ఎకరాలకు సాగునీరు

- తొలి దశ పనుల పూర్తికి రూ.10,911 కోట్లు అవసరం
- విశాఖ పారిశ్రామిక, తాగునీటి అవసరాలకు నీటి సరఫరా
- రెండో దశలో 4.02 లక్షల ఎకరాలకు సాగునీరు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో 8 లక్షల ఎకరాలకు నీరు
- నివేదిక ఇవ్వాలని పీపీఏను ఆదేశించిన సీడబ్ల్యూసీ సభ్యుడు వోహ్రా



సాక్షి, అమరావతి: పోలవరం తొలి దశ పూర్తైతే కుడి కాలువ కింద 1.57 లక్షల ఎకరాలు(తాడిపూడి ఎత్తిపోతల ఆయకట్టు), ఎడమ కాలువ కింద 1.14 లక్షల (పుష్కర ఎత్తిపోతల) ఎకరాలతో కలిపి మొత్తం 2.98 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చని సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) వాటర్ ప్లానింగ్, పాజెక్టుల విభాగం సభ్యుడు కె.వోహ్రాకు ప్రాజెక్టు సీఈ సుధాకర్‌బాబు వివరించారు. గోదావరి డెల్టాలో 10.13 లక్షలు, కృష్ణా డెల్టాలో 13.08 లక్షలు వెరసి రూ.23.21 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చన్నారు. విశాఖపట్నం పారిశ్రామిక, తాగునీటి అవసరాలతోపాటు కృష్ణా, గోదావరి డెల్టాల పరిధిలో తాగునీటి అవసరాలు తీర్చవచ్చన్నారు. తొలి దశ పనులు పూర్తి చేయడానికి రూ.10,911 కోట్లు అవసరమని తెలిపారు. దీంతో ఏకీభవించిన వోహ్రా.. తొలి దశ పనుల పూర్తికి అవసరమైన నిధుల మంజూరుకు నివేదిక ఇవ్వాలని పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) సభ్య కార్యదర్శి ఎం.రఘురాంను ఆదేశించారు. పోలవరం సవరించిన అంచనా వ్యయం రూ.55,587.87 కోట్లను ఆమోదించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు రూ.పది వేల కోట్లను అడ్‌హక్‌గా ఇవ్వాలని ఇటీవల ప్రధాని మోదీని సీఎం వైఎస్ జగన్ కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాని ఆదేశాల మేరకు పోలవరంతోపాటు సీఎం జగన్ ప్రస్తావించిన ఇతర అంశాల పరిష్కారంపై పీఎంవో నియమించిన కేంద్ర కమిటీ గత నెల 25న ఢిల్లీలో రాష్ట్ర అధికారుల కమిటీతో సమావేశమైంది. ఈ సమావేశంలో పోలవరానికి అడ్‌హక్‌గా రూ.పది వేల కోట్లను మంజూరు చేయడానికి సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్ర కమిటీ రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో సమావేశమై నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ సభ్యుడు కె.వోహ్రా మంగళవారం వర్చువల్ విధానంలో పీపీఏ సభ్య కార్యదర్శి రఘురాం, పోలవరం సీఈ సుధాకర్‌బాబు, సహాయ పునరావాస విభాగం కమిషనర్ సీహెచ్ శ్రీధర్ తదితరులతో సమావేశమయ్యారు.

రెండో దశలో...

పోలవరం రెండో దశ పూర్తైతే ఆయకట్టులో మిగిలిన 4.02 లక్షల ఎకరాలతోపాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కింద ఎనిమిది లక్షల ఎకరాలకు నీళ్లందిస్తామని, ఇందుకు మరో రూ.21 వేల కోట్లకుపైగా అవసరమని పోలవరం సీఈ సుధాకర్ బాబు తెలిపారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం, చింతలపూడి ఎత్తిపోతల పథకాల ప్రభావం పోలవరం తొలిదశపై ఏమాత్రం ఉండదని వోహ్రాకు వివరించారు. పోలవరం పూర్తయితే పుష్కర, తాడిపూడి ఎత్తిపోతలతోపాటు పట్టిసీమ, పురుషోత్తపట్నం పథకాలను మూసేస్తామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల వరద జలాలపై ఆధారపడి చేపట్టామని చెప్పారు. వెంకటనగరం పంపింగ్ స్కీం ఆయకట్టుపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. దీంతో పోలవరం తొలి దశ పూర్తికి నిధులపై నివేదిక పంపాలని పీపీఏ సభ్య కార్యదర్శిని వోహ్రా ఆదేశించారు. పీపీఏ నివేదిక ఆధారంగా కేంద్ర జల్ శక్తి శాఖకు నిధులు మంజూరు చేయాలని సిఫార్సు చేస్తామని చెప్పారు.

నాలుగు రాష్ట్రాలతో చర్చించండి

పోలవరం, గోదావరి జల వివాదాలపై కేంద్రానికి సుప్రీం సూచన

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం, గోదావరి జలాల వివాదాల పరిష్కారానికి భాగస్వామ్య పక్షాలైన ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలవరం ముంపు సమస్యల పరిష్కారానికి నాలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో తొలుత చర్చించి అవసరమైతే ఆయా రాష్ట్రాల సీఎంలతోనూ సంప్రదింపులు జరపాలని కేంద్రానికి సూచించింది. పోలవరం వల్ల తమ రాష్ట్రాల్లో ముంపు సమస్యలు తలెత్తుతున్నట్లు ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను కలిపి జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పోలవరం పర్యావరణ అనుమతులపై పునఃసమీక్ష చేయాలని తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సుప్రీంకోర్టును కోరాయి.

పునఃసమీక్షించాలన్న ఒడిశా

ఒడిశా తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణ్యం వాదనలు వినిపిస్తూ ఏపీ ట్రిబ్యునల్ సిఫారసులను ఉల్లంఘిస్తోందని, పోలవరం వల్ల ఒడిశాలో కొంత ప్రాంతం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. గతంలో ఇచ్చిన అనుమతులను పునఃసమీక్షించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాకే కొత్తగా పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కోరారు.

కేంద్రమే పరిష్కరించాలి..

అనంతరం ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వెంకటరమణి వాదనలు వినిపిస్తూ పోలవరం పూర్తిగా కేంద్రం నిర్మిస్తున్న జాతీయ ప్రాజెక్టు అని తెలిపారు. కేంద్రమే నిర్మిస్తున్నందున సమస్యల పరిష్కారానికి రాష్ట్రాలమధ్య ఏకాభిప్రాయం కోసం ప్రయత్నం చేస్తే బాగుంటుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇప్పటికే రూ.30 వేల కోట్లు ఖర్చు చేశారని, సీఎస్‌లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను కేంద్రం పరిష్కరించాలని కోరారు. తెలంగాణ తరఫు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ వరద ప్రవాహం 50 లక్షల క్యూసెక్కులని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. అయితే ప్రవాహం ఊహించిన దానికంటే అధికమైందన్నారు. దీంతో ఇటీవల వరదల్లో భద్రాచలం పూర్తిగా మునిగిపోయిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఆపాలని కోరడం లేదని, కానీ మొత్తం నదీ ప్రవాహమంతా రక్షణ గోడ కట్టాలని కోరారు.

చొరవ తీసుకోవాలి..

ధర్మాసనం జోక్యం చేసుకుంటూ 'ప్రాజెక్టు నిర్మాణంకోసం ఖర్చు చేస్తూనే ఉన్నారు. భాగస్వామ్య రాష్ట్రాలు వివిధ అంశాలపై తమ వాదనలను ప్రస్తావిస్తున్నాయి. ఆయా రాష్ట్రాల సీఎస్‌లతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కేంద్ర జలశక్తి, పర్యావరణ శాఖలు చొరవ తీసుకోవాలి. అవసరం అనుకుంటే సీఎంలతోనూ సమావేశం ఏర్పాటు చేయొచ్చు. నెలలోగా వీటిని నిర్వహించి నివేదికను సుప్రీంకోర్టులో దాఖలు చేయాలి' అని పేర్కొంది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను జనవరికి వాయిదా వేస్తామని పేర్కొనగా ఒడిశా సహా ఇతర రాష్ట్రాలు అభ్యంతరం తెలిపాయి. దీంతో తదుపరి విచారణను ధర్మాసనం డిసెంబర్ 7కి వాయిదా వేసింది.

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు కేబినెట్ భేటీ జరగనుంది. సచివాలయం మొదటి బ్లాక్‌లోని మంత్రివర్గ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుంది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేబినెట్ ఆమోదించనుంది. అలాగే పలు కీలక అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం.

రవాణా శాఖకు కొత్తగా 95 పోస్టులు మంజూరు

సాక్షి, అమరావతి: ఇప్పటికే ఉన్న పోస్టులతో పాటు అదనపు పోస్టులను మంజూరు చేయాలన్న రవాణా శాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్తగా 95 పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులకు అదనంగా ఈ కొత్త పోస్టులను మంజూరు చేసింది. గత 30 ఏళ్లలో రవాణా శాఖకు ఇన్ని పోస్టులను కేటాయించడం ఇదే తొలిసారి. వాటిలో అధికారుల స్థాయి పోస్టులు 24 కాగా క్లరికల్ పోస్టులు 71 ఉన్నాయి. అధికారుల స్థాయి పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. వాటిలో జాయింట్ కమిషనర్ పోస్టులు 4, ఉప రవాణా కమిషనర్ పోస్టులు 2, ఆర్‌టీవో పోస్టులు 15, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 3 ఉన్నాయి. ఇక మిగిలిన 71 క్లరికల్ కేడర్ పోస్టులను కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. పదోన్నతుల ద్వారా పోస్టుల భర్తీ ప్రక్రియకు రవాణా శాఖ కసరత్తు చేస్తోంది. క్లరికల్ పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ నిర్వహిస్తుంది.

నెల్లూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు పచ్చజెండా



సాక్షి, అమరావతి : నెల్లూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ ప్రణాళికకు దక్షిణ మధ్య రైల్వే ఆమోదం తెలిపింది. ఈ మేరకు టెండర్లను ఖరారు చేసింది. దేశంలో ప్రధాన రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా మన రాష్ట్రంలోని తిరుపతి, విజయవాడ, నెల్లూరు రైల్వే స్టేషన్లను ఎంపిక చేశారు. ఇప్పటికే తిరుపతి రైల్వే స్టేషన్‌లో రూ.360 కోట్లతో అభివృద్ధి ప్రణాళికను ఆమోదించారు. తాజాగా రూ.102కోట్లతో నెల్లూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి ప్రణాళికను దక్షిణ మధ్య రైల్వే చేపట్టింది. ప్రస్తుతం నెల్లూరు రైల్వే స్టేషన్‌కు రోజూ సగటున 30వేల మంది ప్రయాణికులు వచ్చి, వెళుతుంటారు. భవిష్యత్‌లో ప్రయాణికుల రద్దీ మరింతగా పెరుగుతుందని భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా స్టేషన్‌లో వసతులను మెరుగుపరిచేందుకు రూ.102కోట్లతో ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా నెల్లూరు రైల్వే స్టేషన్‌కు పశ్చిమ వైపు కొత్తగా జీ+2 భవనం నిర్మిస్తారు. తూర్పు వైపు రైల్వే స్టేషన్ భవనాన్ని జీ+1గా విస్తరిస్తారు. ప్లాట్‌ఫారాలు 1, 2, 3, 4లను అభివృద్ధి చేసి, కొత్తగా ఫ్లోరింగ్, పైకప్పులు నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న సబ్ వేను రైల్వేస్టేషన్ తూర్పు, పశ్చిమ దిశల నుంచి ప్లాట్‌ఫాం–4తో అనుసంధానిస్తారు. రక్షిత మంచినీటి వ్యవస్థను, వాటర్ ట్రీట్‌మెంట్, సివరేజ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ పనులను 21 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రయాణికులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో నెల్లూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ ప్రణాళికను రూపొందించామని దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ చెప్పారు.

సర్టిఫికెట్లు సమర్పించకపోతే గుర్తింపు రద్దు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు గుర్తింపు పునరుద్ధరణ కోసం ప్రభుత్వం నిర్దేశించిన ధ్రువీకరణపత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువీకరణపత్రాలు సమర్పించని కాలేజీల గుర్తింపు రద్దు చేస్తామని స్పష్టంచేశారు. కళాశాల భవనానికి సంబంధించిన ఆర్ఎస్‌డీ, ఆర్ఎల్‌డీ పత్రాలు, బిల్డింగ్ ప్లాన్, ఎఫ్‌డీఆర్, అగ్నిమాపక శాఖ, స్థానిక సంస్థలు, ట్రాఫిక్ పోలీసుల నుంచి నిరభ్యంతర పత్రాలు, భవన దృఢ ధ్రువీకరణపత్రం, శానిటరీ సర్టిఫికెట్, క్రీడా మైదానం వివరాలతో కూడిన సర్టిఫికెట్లను విధిగా ఇంటర్మీడియెట్ బోర్డుకు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తులు, సర్టిఫికెట్లను కూలంకషంగా పరిశీలించిన తర్వాతే 2022–23 విద్యా సంవత్సరానికి గుర్తింపును రెన్యువల్ చేస్తామని పేర్కొన్నారు. మిగిలిన ఆరు ధ్రువీకరణపత్రాలను సమర్పించడానికి ఆయా కళాశాలల యాజమాన్యాలకు వారి సొంత బాధ్యతపై ప్రభుత్వం మూడు నెలలు గడువు ఇచ్చిందని తెలిపారు. ఈ గడువులోపు సర్టిఫికెట్లు సమర్పించని కళాశాలల గుర్తింపు రద్దు అవుతుందని పేర్కొన్నారు.

మహా పాదయాత్ర పూర్తి వివరాలు కోర్టు ముందుంచండి

సాక్షి, అమరావతి : అమరావతి నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు అమరావతి రైతులు చేపట్టిన మహా పాదయాత్రకు అనుమతినిచ్చే విషయంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు మంగళవారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలను ఆదేశించింది. అలాగే, వీరితోపాటు ఆయా జిల్లాల ఎస్పీలకు సైతం నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీచేశారు. తాము తలపెట్టిన మహా పాదయాత్రకు అనుమతినిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ అమరావతి పరిరక్షణ సమితి కార్యదర్శి గద్దె తిరుపతిరావు, మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జస్టిస్ రాయ్ విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. 'అమరావతి నుంచి అరసవెల్లి' పేరుతో ఈ నెల 12 నుంచి నవంబర్ 11 వరకు తాము తలపెట్టిన మహా పాదయాత్రకు అనుమతినివ్వాలని కోరుతూ వినతిపత్రం, రూట్‌మ్యాప్ ఇచ్చామని.. అయితే, ఇప్పటివరకు దానిపై ఎలాంటి నిర్ణయం వెలువరించలేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 8కి వాయిదా వేశారు.

ప్రాజెక్టులన్నీ చకచకా

▶ మొదటి పేజీ తరువాయి

సర్వేపల్లి, కోవూరు, కావలి నియోజకవర్గాలకు మంచి చేసే కార్యక్రమానికి ఈరోజు శ్రీకారం చుట్టామన్నారు. 2019లో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.85 లక్షల ఎకరాలకు వరప్రదాయిని అయిన సంగం బ్యారేజీని ప్రాధాన్యతా ప్రాజెక్టుగా చేపట్టి, నిర్మాణంలో వేగం పెంచి పూర్తి చేశామని చెప్పారు. 'మనం అధికారంలోకి వచ్చాక 9 నెలలు తిరక్క ముందే కోవిడ్ సమస్య వచ్చింది. మరోవైపు పెన్నా నదిలో వరుసగా రెండేళ్ల పాటు వరదలు వచ్చాయి. అయినా అన్ని ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి ఈ ప్రాజెక్టు పనుల మీద దృష్టి పెట్టి పూర్తి చేశాం' అని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

దివంగత సీఎం వైఎస్సార్ వల్లే మోక్షం

- దాదాపు 140 ఏళ్ల క్రితం బ్రిటీష్ వారి హయాంలో సంగం వద్ద కట్టిన ఆనకట్ట కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. అయినా గత పాలకులెవరూ దీనిని పట్టించుకోలేదు. ఈ ప్రాజెక్టు చేపట్టి, నెల్లూరు జిల్లాకు మంచి చేయాలని ఆలోచించలేదు.
- దివంగత ముఖ్యమంత్రి, ప్రియతమ నాయకుడు రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మాత్రమే ఈ జిల్లాకు మోక్షం వచ్చింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తయ్యేందుకు అడుగులు ముందుకు పడ్డాయి. 2006లో సంగం బ్యారేజీ పనులు, ఆ తర్వాత నెల్లూరు బ్యారేజీ పనులు ప్రారంభమయ్యాయి.
- 2009లో నాన్నగారు మన మధ్య నుంచి దూరమయ్యారు. ఆ తర్వాత ఈ రెండు ప్రాజెక్టులను కూడా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ రోజు ఆ పెద్దాయనకు కొడుకుగా, ముఖ్యమంత్రిగా ఆయన ప్రారంభించిన ప్రాజెక్టు పనులను పూర్తి చేయగలిగానని చెప్పడానికి గర్వపడుతున్నాను. ఇంత గొప్ప అవకాశం ఇచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

టీడీపీ హయాంలో ముహూర్తాలు తప్ప పనుల్లేవు

- 2014లో రాష్ట్రం విడిపోయాక టీడీపీ ప్రభుత్వ హయాంలో.. సంగం బ్యారేజీ కోసం కేవలం రూ.30.85 కోట్లు మాత్రమే ఖర్చు చేసి చేతులు దులుపుకున్నారు. 2017 నాటికి పూర్తి చేస్తామని ఒకసారి.. 2018 నాటికి పూర్తి చేస్తామని మరోసారి.. 2019 నాటికి పూర్తి చేస్తామని ఇంకోసారి చెప్పారు. ఇలా ముహూర్తాల మీద ముహూర్తాలు మార్చుకుంటూ పోయారే తప్ప.. ప్రాజెక్టును పూర్తి చేయాలని ఏరోజూ ఆలోచన చేయలేదు.
- వారు చేసిందల్లా ప్రాజెక్టుల్లో రేట్లు పెంచేయడం, ఎస్కలేషన్ ఇచ్చేయడం.. ఆ తర్వాత కమీషన్లు దండుకోవడమే. చంద్రబాబు హయాం అంతటా ఇదే తీరున అడుగులు పడటం చూశాం.

గౌతమ్ జ్ఞాపకార్థం ఈ ప్రాజెక్టుకు ఆయన పేరు..

- మనందరి ప్రభుత్వం వచ్చాక ఒకవైపు కోవిడ్ సమస్యలు, మరోవైపు వరదల వంటి ప్రతికూల పరిస్థితులు. అయినా మూడేళ్లలోనే రూ.200 కోట్లకు పైగా ఖర్చు చేసి సంగం ప్రాజెక్టును పూర్తి చేశాం. నాకు మిత్రుడు, మంచివాడు, ఆత్మీయుడు అయిన మేకపాటి గౌతమ్‌రెడ్డి నిజానికి ఈరోజు ఇక్కడ మనందరి మధ్య ఈ ప్రాజెక్టును ప్రారంభించే ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాల్సింది.
- గౌతమ్ హఠాన్మరణంతో మనందరికీ దూరమయ్యాడు. ఆ రోజు గౌతమ్ సంస్మరణ సభలో చెప్పిన మాటను ఈ రోజు నిలుపుకున్నాం. అతని జ్ఞాపకార్థం సంగం బ్యారేజీకి మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ అని పేరు పెడుతున్నాం. తద్వారా గౌతమ్ చిరస్థాయిగా ఎప్పుడూ మన మనస్సులోనే ఉంటాడు. ఈ బ్యారేజీ వల్ల ఇప్పుడు పెన్నా డెల్టా కనిగిరి కాలువ కింది 2.47 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద మరో 63 వేల ఎకరాలు, కావలి కాలువ కింద మరో 75 వేల ఎకరాలు వెరసి.. 3.85 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

నెల్లూరు బ్యారేజీకి వైఎస్సార్ శ్రీకారం

- 150 సంవత్సరాల క్రితం నిర్మించిన నెల్లూరు ఆనకట్ట శిథిలావస్థకు చేరితే, పట్టించుకునే నాథుడు లేక దాదాపు లక్ష ఎకరాలకు నీరందించలేని స్థితికి చేరింది. అప్పట్లో ఆ దివంగత నేత రాజశేఖరరెడ్డి చొరవ చూపడం వల్ల మాత్రమే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అడుగులు ముందుకు పడ్డాయి.
- ఆనాడు ప్రాజెక్టు వ్యయం రూ.147 కోట్లుగా అంచనా వేస్తే.. రూ.86 కోట్లు ఖర్చు చేసి, ప్రియతమ నేత ప్రాజెక్టును పరుగులు తీయించగలిగారు. నాన్నగారు చనిపోయాక ఈ ప్రాజెక్టు మళ్లీ నిర్లక్ష్యానికి గురైంది. మనందరి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టునూ పూర్తి చేసి.. జాతికి అంకితం చేస్తున్నాం.

రూ.85 కోట్ల విలువైన పనులకు పచ్చజెండా

- సోదరుడు, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి నియోజకవర్గానికి సంబంధించి.. కొన్ని సమస్యలు చెప్పారు. జాతీయ రహదారి నుంచి సంగం బ్యారేజ్‌కు నేరుగా రహదారి నిర్మాణానికి రూ.15 కోట్లు అవుతుందన్నారు. అది మంజూరు చేస్తున్నాను.
- ఆత్మకూరు నియోజకవర్గంలో 12 ఇరిగేషన్ పనులకు సంబంధించి రూ.40 కోట్లు మంజూరు చేస్తున్నా. నియోజకవర్గంలో 25 ఊళ్లకు రహదారి నిర్మాణానికి రూ.14 కోట్లు, ఆత్మకూరు మున్సిపాలిటీకి స్పెషల్ గ్రాంట్ కింద రూ.12 కోట్లు, సంగం ప్రాజెక్టు నుంచి సంగం పంచాయతీకి నీటి సదుపాయం కోసం రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నాం. మొత్తమ్మీద దాదాపు రూ.85 కోట్ల విలువైన ఈ పనులన్నింటికీ అనుమతులు మంజూరు చేస్తున్నాను.
- ఈ కార్యక్రమంలో దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మంత్రులు అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసులరెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



నెల్లూరు బ్యారేజీ వద్ద



సంగం బ్యారేజీ వద్ద

దివంగత సీఎం వైఎస్సార్, దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం జగన్. చిత్రంలో మేకపాటి కుటుంబ సభ్యులు

వరుణుడి ఆశీర్వాదం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంగం బ్యారేజీని ప్రారంభించి, నెల్లూరు బ్యారేజీని జాతికి అంకితం చేసేందుకు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటి వరకూ ఎండ వేడిమితో ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా మేఘావృతమై చిరుజల్లులు మొదలయ్యాయి. నెల్లూరు పరిసర ప్రాంతాల్లో జోరున వర్షం ప్రారంభమైంది. సీఎం పర్యటన ముగిసే వరకు నెల్లూరులో వర్షం కురుస్తూనే ఉంది. బ్రిడ్జి కమ్ బ్యారేజీ ప్రారంభించి, సీఎం తిరుగు ప్రయాణం కాగానే అక్కడా వర్షం ఆరంభమైంది. సంగంలో సైతం బహిరంగ సభ తర్వాత వాన జల్లులు పడ్డాయి. ఇదంతా కళ్లారా చూసిన వారు.. ముఖ్యమంత్రికి దేవుడి చల్లని దీవెనలు ఉన్నాయని, వరుణ దేవుడూ ఆశీర్వదించారని చర్చించుకున్నారు.

ఇదో అద్భుత సన్నివేశం

సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను సీఎం జగన్ ఒకేసారి ప్రారంభించడం అద్భుతమైన సన్నివేశం. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఈ రెండిటికీ శంకుస్థాపన చేశారు. తండ్రి సంకల్పించిన ఈ రెండు ప్రాజెక్టులను తనయుడు సాకారం చేయడం చరిత్రలో అరుదుగా జరిగే విషయం. స్వాతంత్ర్యానంతరం వృథాగా సముద్రంలో కలిసిపోతున్న నీటిని వినియోగించుకోవడానికి ఎవరూ పెద్దగా దృష్టి పెట్టలేదు. వైఎస్సార్ వచ్చాకే జలయజ్ఞం పేరుతో ఆ దిశగా అడుగులు పడ్డాయి. ఆ మహానేత మనందరి మధ్య నుంచి వెళ్లిపోయాక ఆయన తనయుడు, సీఎం జగన్.. ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు.

– అంబటి రాంబాబు, జల వనరుల శాఖ మంత్రి



నెల్లూరు బ్యారేజీ వద్ద పెన్నా నదికి పూజలు చేస్తున్న సీఎం జగన్





సంగం, నెల్లూరు బ్యారేజీలకు సంబంధించిన పైలాన్లను ఆవిష్కరించిన సీఎం జగన్



నీలో కోపం ఉన్నంత మాత్రాన నువ్వు శిక్షకు గురికావు;
నీ కోపం వల్ల నువ్వు శిక్షకు గురవుతావు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, సెప్టెంబర్, 7

ఇది ముళ్ళకిరీటమే!

బ్రిటన్‌లో తొలి మహిళా లార్డ్ ఛాన్సలర్ ఆమే. రెండో మహిళా విదేశాంగ మంత్రీ ఆవిడే. ఇప్పుడు థాచర్, థెరెసా మే తర్వాత ఆ దేశానికి ముచ్చటగా మూడో మహిళా ప్రధానీ ఆమే. అధికార కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వ మార్పులో భాగంగా బోరిస్ జాన్సన్‌కు వారసురాలిగా సోమవారం ఎన్నికైన 47 ఏళ్ళ లిజ్ ట్రస్‌కు ఇలాంటి ఘనతలు చాలానే ఉన్నాయి. క్వీన్ ఎలిజబెత్2ను లాంఛనంగా కలసి, 96 ఏళ్ళ రాణిగారి సాంప్రదాయిక నియామకంతో బ్రిటన్ కొత్త ప్రధానిగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన లిజ్ ఇప్పుడు ఆ ఘనతలు నిలబెట్టుకోవడానికి శ్రమించక తప్పదు. వరుస వివాదాలతో రెండు నెలల క్రితం జాన్సన్ బ్రిటీష్ ప్రధానిగా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించినప్పటి నుంచి లిజ్ ప్రయాణం మలుపు తిరిగింది. జాన్సన్ హయాంలో విదేశాంగ మంత్రిగా పనిచేసిన ఆమె మాజీ ఆర్థిక మంత్రి రిషీ సునాక్‌ను అధిగమించి, పీఠం దక్కించుకున్నారు.

కొత్త నేతగా పీఠమెక్కడానికి కన్జర్వేటివ్ పార్టీలో ఆరుగురు ఉత్సాహపడితే, ఆఖరికి బరిలో మిగిలింది – లిజ్, భారతీయ మూలాలున్న రిషీ సునాక్. 'ఇన్ఫోసిస్' సుధ – నారాయణమూర్తి దంపతుల అల్లుడైన రిషి సోమవారం ఓటమి పాలయ్యారు. అయితేనేం, లక్షా 70 వేల పైగా కన్జర్వేటివ్ పార్టీ సభ్యులు ఎన్నుకొనే పదవికి చివరి దాకా పోటీపడి, 60 వేలకు పైగా ఓట్లు సంపాదించడం విశేషమే. నిలబెట్టుకోలేని వాగ్దానాలు ఇవ్వలేనన్న రిషికి భిన్నంగా లిజ్ వ్యవహరించడం గమనార్హం. బ్రిటీష్ ప్రజాస్వామ్య వ్యవస్థలోని రాజకీయ పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన ఎన్నికల ప్రక్రియ ముగిసింది. పరిష్కారాల మాట దేవుడెరుగు, కనీసం దేశం ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉన్నట్టు తన ప్రచారంలో ప్రస్తావించకుండా వాస్తవాన్ని చూడ నిరాకరించిన లిజ్ ఇప్పుడు కళ్ళెదుటి సంక్షోభం నుంచి దేశాన్ని ఎలా గట్టెక్కిస్తారన్నది ఆసక్తికరం.

వామపక్ష భావజాల కుటుంబంలో పుట్టి, తల్లితండ్రుల రాజకీయ పొత్తిళ్ళ నుంచి బయటపడి, ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకొనే రోజుల్లో ఉదారవాద ప్రజాస్వామ్య రాజకీయాల వైపు మొగ్గి, యువ ఉద్యోగినిగా కన్జర్వేటివ్ పార్టీలో చేరిన గమ్మత్తైన ప్రయాణం లిజ్‌ది. ముగ్గురు కన్జర్వేటివ్ పార్టీ ప్రధానమంత్రుల వద్ద ఆరు మంత్రి పదవులు నిర్వహించిన ఆమె ఇప్పుడు సరాసరి లండన్‌లోని 10 డౌనింగ్ స్ట్రీట్ నివాసి అయ్యారు. ఈ ప్రధానమంత్రి పీఠంపై ఆమెకు మొదటి రోజు నుంచీ అనేక సవాళ్ళు ఎదురుకానున్నాయి. అంతకంతకూ పెరుగుతున్న ఇంధన ధరలు, కరెంట్ కోతల ముప్పు, గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా రెండంకెల ద్రవ్యోల్బణం, పొంచి ఉన్న దీర్ఘకాలిక ఆర్థిక మాంద్యం, పెరుగుతున్న తనఖా రేట్లు... వెరసి అలవి కాని జీవన వ్యయం – ఇలా సమస్యలెన్నో. దేశంలో వివిధ ఉద్యోగ సంఘాలు ఇప్పటికే సమ్మె సైరన్ మోగించాయి. ఉక్రెయిన్‌లో యుద్ధం, బ్రెగ్జిట్ పర్యవసానాల లాంటి విదేశాంగ విధానపు తలనొప్పులు సరేసరి.

పదవికి పోటీలో లిజ్ చేసిన వాగ్దానాలూ చిన్నవేమీ కావు. పన్నులను తగ్గిస్తాననీ, ప్రజా వ్యయాన్ని పెంచుతాననీ బాస చేశారు. దేశం ఇప్పుడున్న ఇక్కట్లలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే, ఆమె ఇంట్లో కల్పవృక్షమో, కామధేనువో ఉంటే కానీ సాధ్యం కాదని ఓ జోక్. బ్రిటన్ తాజా మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ లానే లిజ్‌కూ మాటల్లో ఘనత చాటుకొనే లక్షణం ఉంది. కానీ, ఆయనకున్న జనాకర్షణ, అవతలివారి అంగీకారం పొందే నేర్పు ఆమెకు లేవని విమర్శకుల మాట. ఒకప్పటి మార్గరెట్ థాచర్‌ను లిజ్‌లో ఆశించలేమని వారి విశ్లేషణ. అయితే ఎదగాలనే ఆకాంక్ష బలంగా ఉన్న ఈ దృఢచిత్తురాలికి స్వతఃసిద్ధ పోరాటగుణమే పెట్టనికోట. సమయానికి తగ్గట్టు అభిప్రాయాలు మార్చుకొనే దృక్పథం కలిసొచ్చే అంశం. 2016లో బ్రెగ్జిట్ విధానానికి తీవ్ర వ్యతిరేకిగా ఉన్న లిజ్, ఆపై బ్రెగ్జిట్‌కు పూర్తి అనుకూలంగా మారడం, 2019 నాటికి జాన్సన్ హయాంలో బ్రెగ్జిట్ అనంతరకాల వాణిజ్య మంత్రిగా వ్యవహరించడమే అందుకు ఉదాహరణ.

మాటల గారడీ జాన్సన్ హయాంలో వెనుకబడ్డ బ్రిటన్‌కు ఇప్పుడు చిత్తశుద్ధితో కూడిన స్థిరమైన, బలమైన నాయకత్వం అవసరం. రిషిని వెన్నుపోటుదారుగా భావిస్తూ, అతనికి తప్ప ఎవరికైనా ఓటేయమన్న జాన్సన్ మాటలతో ఆయన అనుకూలుర మద్దతు లిజ్‌ను గెలిపించింది. అలా జాన్సన్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న లిజ్ పాత ప్రభుత్వ తప్పుడు విధానాల నుంచి ఎంత త్వరగా బయటకొస్తే, బ్రిటన్‌కు అంత మంచిది. ఇక, ఆప్తురాలైన లిజ్ ఎన్నిక భారత్‌కు శుభవార్తే. విదేశాంగ మంత్రిగా చైనాతో కయ్యానికి కాలుదువ్వుతూ, రష్యాపై కఠినవైఖరిని అనుసరించిన ఆమె ఇప్పటికి 3 సార్లు క్యాబినెట్ మంత్రిగా భారత్‌లో పర్యటించారు. ఇరుదేశాల పాత అనుబంధంతో మెతకగానే ఉన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల చర్చలూ అక్టోబర్‌లో కొలిక్కిరానున్నాయి. ఏప్రిల్‌లో కుదుర్చుకున్న రక్షణ సహకార ఒప్పందం సహా అన్నీ సజావుగా సాగుతాయని అంచనా.

అయితే, బ్రిటన్ సమస్యల సుడిగుండంలోకి ప్రయాణిస్తోందన్న ఆలోచననే ఇన్నాళ్ళూ 'క్షీణవాద ప్రసంగం'గా కొట్టిపారేస్తూ వచ్చిన లిజ్ వాస్తవంలోకి రాక తప్పదు. సమస్యల పరిష్కారంలో జయాపజయాలను బట్టే చరిత్రలో ప్రధానిగా ఆమె అధ్యాయం లిఖితమవుతుంది. మరోపక్క దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీ అంతర్గత సమస్యలు, పరస్పర విరుద్ధ ఆలోచనల వర్గాలతో సతమతమవుతోంది. ఆ పార్టీ, దాని సారథిగా ఈ ఇద్దరు టీనేజ్ కుమార్తెల తల్లి కొద్దిగా తడబడినా, కొన్నేళ్ళుగా అధికారానికి దూరమైన ప్రతిపక్ష లేబర్‌పార్టీకి 2024 ఎన్నికల్లో సందు చిక్కినట్టే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.10.15 వరకు
తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ప.3.05 వరకు
తదుపరి శ్రవణం, **వర్జ్యం:** సా.6.47 నుండి 8.16 వరకు
దుర్ముహూర్తం: ప.11.32 నుండి 12.21 వరకు
అమృతఘడియలు: ఉ.9.05 నుండి 10.32 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.07
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

పరిశ్రమలు వద్దనడమే రాజకీయమా?

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం ఏపీకి వస్తున్న పరిశ్రమలను అడ్డుకునే పనిలో పడిందా? ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కేంద్రానికి రాసిన ఒక లేఖను చూస్తే ఈ విషయం అవగతం అవుతుంది. ఇది రాష్ట్రానికి ద్రోహం చేయడమే. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా అయినా బల్క్ డ్రగ్ పార్కును స్వాగతించి ఉంటే ఆ పార్టీ పద్ధతిగా వ్యవహరించిందని అనిపించేది. పెట్టుబడులు రావడం లేదని ఓవైపు ఆరోపిస్తూనే, వస్తున్నవాటిని అడ్డుకోవడానికి ప్రయత్నించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? వారి ఉద్దేశం స్పష్టం. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిశ్రమలు పురుడు పోసుకుంటే తమకు పుట్టగతులు ఉండవని టీడీపీ భయపడుతోంది.

కాకినాడ జిల్లా కోన వద్ద సుమారు 8,500 ఎకరాల విస్తీర్ణంలో బల్క్ డ్రగ్ పార్క్ చేపట్టడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ పార్కు కోసం తెలంగాణ, తమిళనాడుతో సహా పదిహేడు రాష్ట్రాలు పోటీ పడ్డాయి. కేంద్రం అన్ని విషయాలూ పరిగణనలోకి తీసుకుని హిమచల్ ప్రదేశ్, గుజరాత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసింది. తొంభై రోజులలో 'డీపీఆర్' పంపితే సుమారు వెయ్యి కోట్ల మేర నిధులు కేటాయించి ప్రాథమిక సదుపాయాలు కల్పించడానికి సహకరించనుంది. ఇది అంతా సంతోషించవలసిన విషయం. ఆంధ్రప్రదేశ్‌కు పరిశ్రమలు రావడానికి ఉన్న అవరోధాలను అధిగమించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది నిదర్శనం. ఈ బల్క్ డ్రగ్ పార్కు తెలంగాణకు ఇవ్వక పోవడం అన్యాయమని ఆ రాష్ట్ర మీడియా విమర్శిస్తోంది. తెలంగాణ మంత్రి కేటీఆర్ ఈ విషయంలో కేంద్రం వివక్ష చూపిందంటూ మండిపడుతున్నారు. కానీ తెలుగుదేశం మాత్రం ఈ పార్కును ఏపీకి ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నది. ఒకవేళ కేంద్రం తెలంగాణకు ఈ పార్కును ఇచ్చి ఉంటే– ఇదే టీడీపీ, టీడీపీ మీడియా గగ్గోలు పెట్టేవి. పరిశ్రమలు తెలంగాణకు వెళ్లిపోతున్నాయని ప్రచారం చేసేవి.

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అనుమతితోనే ఈ లేఖ రాశానని యనమల రామకృష్ణుడు ప్రకటించినట్లు కూడా సమాచారం వచ్చింది. తన పేరుతో ఇలాంటి లేఖ రాస్తే పార్టీకి నష్టం వస్తుందని సందేహించి యనమలతో చంద్రబాబు రాయించారని అనుకోవచ్చు. మరో వైపు గుజరాత్‌కు బల్క్ డ్రగ్ పార్కు ఇవ్వడాన్ని అక్కడి ప్రతిపక్షాలు స్వాగతించాయి. టీడీపీ తీరు అందుకు భిన్నంగా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో, ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో ఇలాంటి పరిశ్రమలు పురుడు పోసుకుంటే తమకు పుట్టగతులు ఉండవని టీడీపీ భయపడుతోంది. యనమల రామకృష్ణుడు ఈ ప్రాజెక్టు ఇవ్వవద్దని ఏకంగా కేంద్ర రసాయనాల శాఖ అధికారులకు లేఖ రాశారు. దానికి కారణం బల్క్ డ్రగ్ పార్కు వల్ల ఆ ప్రాంతం కలుషితం అవుతుందని అంటున్నారు. మరి టీడీపీ ప్రభుత్వ హయాంలో తుని ప్రాంతంలో కొన్ని కాలుష్య కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగినప్పుడు ఇదే తెలుగుదేశం ఆ పరిశ్రమలకు ఎలా మద్దతు ఇచ్చింది? అంటే తమ పార్టీ అధికారంలో ఉంటే కాలుష్యం ఉన్నా ఫర్వాలేదని చెబుతున్నారా? ఎక్కడైనా కాలుష్యం అధికంగా ఉంటే దాన్ని అదుపు చేయాలని కోరడం తప్పు కాదు. కానీ అసలు పరిశ్రమే వద్దనడం ఎంత మూర్ఖత్వం! పరిశ్రమలు తీసుకురండి, కానీ కాలుష్యం లేకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోండి అని చెప్పవలసిన నేతలు ఇలా దిక్కుమాలిన లేఖలు రాస్తున్నారంటే వారు టీడీపీకి భవిష్యత్తు ఉండాలని అనుకుంటున్నారా, వద్దనుకుంటున్నారా?



నిజంగానే కాలుష్యంపై అంత శ్రద్ధ ఉంటే, తిరుపతిలో అమర రాజా బ్యాటరీస్ సంస్థ నుంచి వస్తున్న కాలుష్యం గురించి ప్రభుత్వం నోటీసు ఇస్తే టీడీపీ ఎంత యాగీ చేసింది? వీరికి అంత చిత్తశుద్ధి ఉంటే, చంద్రబాబు నాయుడు స్వయంగా కృష్ణా కరకట్టపై ఉన్న అక్రమ భవంతిలో నివసిస్తూ కృష్ణా నది కాలుష్యానికి దోహదపడతారా? ఆ మాటకు వస్తే, అసలు మూడు పంటలు పండే పచ్చటి వేల ఎకరాల భూమిని సేకరించి రాజధాని నిర్మాణం చేపడతారా? ఇప్పటికీ అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని కోరుతూ గొడవ చేస్తున్నారే? తమ రియల్ ఎస్టేట్ అవసరాల కోసం పర్యావరణం పాడైపోయినా ఫర్వాలేదా?

గతంలో జరిగిన కొన్ని ఉదాహరణలు చెప్పాలి. 1999 ఎన్నికలకు ముందు ప్రభుత్వాన్ని నడుపుతున్న చంద్రబాబు నాయుడు కేంద్రం మంజూరు చేసిన వంటగ్యాస్ కనెక్షన్లను తన రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ భావించింది. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేతలు రోశయ్య, పర్వతనేని ఉపేంద్ర కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఆ సంగతి తెలిసిన వెంటనే టీడీపీ నేతలు కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి మేలు జరుగుతుంటే ఫిర్యాదు చేస్తారా అని జనంలో ప్రచారం చేశారు. అదే కాదు, పోలవరం ప్రాజెక్టులో అవినీతి జరుగుతోందని గత టరమ్‌లో ఎవరైనా కేంద్రానికి ఫిర్యాదు చేస్తే, ఇదే చంద్రబాబు, ఇతర టీడీపీ నేతలు పోలవరం ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారని విమర్శించేవారు. అమరావతి రాజధానిని అంతా రియల్ ఎస్టేట్ వ్యాపారంగా చేస్తున్నారని ప్రత్యర్థి పార్టీలు ఆరోపిస్తే, తాను యజ్ఞం చేస్తుంటే రాక్షసులు అడ్డుపడుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తేవారు. అధికారం కోల్పోయిన తర్వాత సీన్ రివర్స్ అయింది. టీడీపీ పల్లవి మార్చేసింది. ఎక్కడైనా ఏపీలో ఏదైనా మంచి పని జరిగితే దానిని ఎలా అడ్డుకోవాలన్న ఆలోచన చేస్తోంది. చివరికి పేదల ఇళ్ల స్థలాల విషయాన్ని కూడా కోర్టుకు తీసుకు వెళ్లి అడ్డుపడే యత్నం చేశారు. ఆంగ్ల మీడియం ప్రవేశ పెడుతుంటే తెలుగు నాశనం అవుతోందని గగ్గోలు పెడుతూ విద్యార్థులకు కీడు చేయడానికి కూడా వెనుకాడలేదు. ఇప్పుడు ఏకంగా భారీ పరిశ్రమలు రావడానికి అవకాశం ఉన్న బల్క్ డ్రగ్ పార్కునే అడ్డుకునే యత్నం చేస్తున్నారు.

ఈ ప్రాజెక్టు వస్తే సుమారు యాభై వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. పది వేల నుంచి ఇరవై వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. అనేక అనుబంధ, ఉప పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుంది. అలా జరగడం తెలుగుదేశంకు ఇష్టం లేదని అనుకోవాలి. అందుకే ఇలా అడ్డగోలుగా వ్యతిరేక ప్రచారానికి బరి తెగించారు. అయితే పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగినా అందులో చంద్రబాబు ఈ అంశం గురించి మాట్లాడలేదంటేనే తేలు కుట్టిన దొంగ మాదిరి భయపడ్డారని అనుకోవచ్చా?

ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీ గ్రూపు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తుంటే టీడీపీ మీడియా ఎంతో దుర్మార్గంగా కథనాలు ఇస్తోంది. నిజానికి జగన్ ముఖ్యమంత్రి అయ్యాక, కాలుష్య కారక పరిశ్రమలపై స్పష్టమైన విధానం ప్రకటించారు. కాలుష్యాన్ని అనుమతించే ప్రసక్తే లేదనీ, అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే వాటిని ప్రారంభిస్తామనీ అన్నారు. అదే ప్రకారం తూర్పు గోదావరి జిల్లాలో ఈ మధ్య ఒక కర్మాగారం కాలుష్యాన్ని జీరో స్థాయికి తెచ్చిన తర్వాతే దాని ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ విషయాలు యనమల, చంద్రబాబు వంటివారికి తెలియవని కావు. కానీ తమను ఓడించిన ఏపీ ప్రజల పట్ల కక్షతోనో, ద్వేషంతోనో ఈ రకమైన చర్యలకు పాల్పడుతున్నారు. ఒక వేళ ఏపీ ప్రభుత్వం తమకు ఈ పార్కు వద్దని చెబితే ఇదే టీడీపీ ఎంత దుష్ప్రచారం చేసేది! పెట్టుబడులు రావడం లేదని ఎలా ఆరోపణలు చేసేది!

ప్రభుత్వంపై విధ్వంసం అంటూ ఆరోపణలు గుప్పించే తెలుగుదేశం పార్టీ చేస్తున్న ఇలాంటి పనులు నిజంగా విధ్వంసం కిందకు వస్తాయని గమనించాలి. తాజాగా ఏపీకి సుమారు లక్షా పాతిక వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు రావడానికి అడుగులు పడుతున్నాయి. వాటిని టీడీపీ అడ్డుకోకుండా ఉంటే మంచిది. రాష్ట్రానికి పరిశ్రమలు రావడం ఒక ఎత్తు అయితే, ఇలాంటి ప్రతిపక్షం, వారికి మద్దతు ఇచ్చే ఒక వర్గం మీడియాను ఎదుర్కోవడం మరో ఎత్తు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌ను అభినందించాలి. చంద్రబాబు, యనమల వంటివారినీ, దుష్ట చతుష్టయంలో భాగంగా ఉన్న మీడియానూ ఎదుర్కుంటూ ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ఎన్నికలలో ఏమవుతుందన్నది పక్కనబెడితే, ఏపీ భవిష్యత్తుకు ఉపయోగపడే ఇలాంటి పరిశ్రమలను అడ్డుకోకుండా టీడీపీకి జ్ఞానోదయం కలుగుతుందని ఆశిద్దాం. లేకుంటే ప్రజలే వారికి గుణపాఠం చెబుతారు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఉందంటారా?



'ఇది మీకు ఆసక్తి కలిగించవచ్చు' పేరిట అమెజాన్ నా భార్యకు ఒక పుస్తకాన్ని సూచించింది. అది నా ఆత్మకథ!

– జాన్ క్లీజ్, ఇంగ్లండ్ నటుడు

భయపెట్టే కార్లు



ఇండియాలో ప్రతి యేటా జరుగుతున్న కారు ప్రమాదాల్లో 1.5 లక్షల మంది చనిపోతున్నారు. అయినా ఎవరూ దీని గురించి మాట్లాడరు. ఎవరూ దీనికి భయపడరు. జనం ఎప్పుడూ మితిమీరిన వేగంతోనే ప్రయాణిస్తుంటారు. సీటు బెల్టులు ఎప్పుడో తప్ప ధరించరు. ఏంటో ఈ పిచ్చితనం. నేనైతే ఈ కార్లకు విపరీతంగా భయపడతాను.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

నా అన్న సూర్య



ప్రతి మైనస్‌నూ గొప్ప ప్లస్‌గా మార్చుకోవడానికి తను రాత్రీ పగలు కష్టపడ్డాడు. కేవలం తన విజయాలను తిరగ రాయడం మీదే దృష్టిపెట్టాడు. వ్యక్తిగా అదివరకే ఉన్న కరుణాపూరిత హృదయాన్ని మరింత విశాలం చేసుకుని, వేలాదిమంది అర్హులైన పిల్లల జీవితాలకు ఆకారమిచ్చాడు. అతడు నా అన్న, 25 ఏళ్ల కల్ట్ సూర్యాయిజం!

– కార్తీ, నటుడు

దురాశ వల్లే...



అది బెంగళూరు గానీ, ముంబయి గానీ బ్రిటిష్‌వారి హయాంలో నిర్మించిన ప్రాంతాలు ఇటీవలి నిర్మించినవాటికంటే వాన నీటిని ఎందుకు మెరుగ్గా నిర్వహించ గలుగుతున్నాయి? బ్రిటిష్ వాళ్లు మెరుగైన ఇంజినీర్లు, మెరుగైన మురుగునీటి వ్యవస్థ కలిగివున్నారా లేక మన విచక్షణా జ్ఞానాన్ని మన దురాశ మింగేసిందా?

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

పైపై భావనలు



అభివృద్ధి చెందిన ఏ పాశ్చాత్య దేశంలోనైనా మనం కరెంటును కొన్ని నెలల పాటు ఆపేస్తే– మానవ హక్కులు, వ్యక్తివాదం లాంటి ఐదు వందల ఏళ్ల తాత్త్విక ప్రగతి కాస్తా అసలు అలాంటిదేమీ జరగనట్టుగా ఆవిరైపోతుంది.

– ముర్తజా హుస్సేన్, కాలమిస్ట్

బయటపడదాం



ఇది చాలా పెద్ద విషయం. 'నాటో' చేస్తున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని యూరప్ అంతటా వ్యతిరేకించడం మొదలైంది. 'నాటోలోంచి బయట పడదాం' అంటూ వేలాది మంది పారిస్ వీధుల్లో ప్రదర్శనలు జరిపారు.

– సారా అబ్దల్లా, వ్యాఖ్యాత

ఇదైతే సులభమనా?



సాపేక్ష ఆగ్రహ సిద్ధాంతం. వాస్తవాధీన రేఖ వెంబడి (ఎల్‌ఏసీ) కోల్పోయిన భూభాగం కంటే, దుబాయ్‌లో (ఇండియా – పాకిస్తాన్ టీ20 మ్యాచ్) వదిలేసిన క్యాచ్ మనకు మరింత ఎక్కువ పట్టింపు అయింది.

– హ్యాపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

మునుగుతుంది



కశ్మీర్ గురించిన మితి మీరిన పట్టింపునకూ, తన స్వీయ ఉనికికీ మధ్య పాకిస్తాన్ ఏదో ఒకటి ఎంచుకోవాల్సిన సమయం వచ్చేసింది. రెండూ కావాలంటే కుదరదు.

– గౌరవ్ ఆర్య, ఆర్మీ మేజర్ (రిటైర్డ్)

ఇన్‌బాక్స్

అక్షరాస్యతే కీలకం

మానవ వనరుల అభివృద్ధికి దోహదపడే అంశాల్లో అక్షరాస్యత ప్రధానమైనది. అందుకే కేంద్ర ప్రభుత్వం 1988లో జాతీయ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. 2009లో దీన్ని 'సాక్షర భారత్'గా మార్చారు. ఈ పథకం అమలు కోసం దేశవ్యాప్తంగా 404 జిల్లాల్లో 1.64 లక్షల గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు. ఈ గ్రామాలలో 8.27 కోట్ల మంది నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వాలు సఫలం కాలేదు. 2018 నుండి 'పఢ్‌నా, లిఖ్‌నా అభియాన్'గా పేరు మార్చి... జాతీయ వయోజన విద్యా పథకంగా నిర్వహించినా కూడా దేశంలో 27 శాతం నిరక్షరాస్యత ఇంకా మిగిలే ఉంది. 2001 జనాభా లెక్కల ప్రకారం దేశ అక్షరాస్యత 64.83 శాతం కాగా, 2011 నాటికి అది 74.04కు చేరింది. జాతీయ గణాంకాల కార్యాలయం 2019–21లో చేసిన సర్వే ప్రకారం దేశంలో అక్షరాస్యత రేటు 77.7 శాతం.

బ్యాంక్ ఖాతాలు తెరవాలన్నా, ఆధార్ కార్డులో తప్పులు దిద్దుకోవాలన్నా, ఏదైనా దరఖాస్తు పూర్తి చేయాలన్నా నిరక్షరాస్యులు వేలిముద్రలతోనే సరిపెట్టుకుంటున్నారు. సాక్షరతా కార్యక్రమాన్ని 2022 ఏప్రిల్ 1 నుండి కేంద్రం 'నవ భారత్ సాక్షరత'గా మార్చింది. 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు గల నిరక్షరాస్యుల్లో అక్షరాస్యతను పెంపొందించడంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మద్దతివ్వడం దీని లక్ష్యం. 2022–23 నుండి 2026–27 వరకు అమలు జరుగుతుంది. పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలు లక్ష్యాలుగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

– అంకం నరేష్, నిజామాబాద్
(సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం)

గటు దిక్కు బోవద్దు గన్పతీ!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

కైలాసం. శంకరుడు కండ్లు మూస్కోని తపస్సు జేస్తున్నడు. పార్వతి వొంట జేస్తున్నది. అదువరదాక ఎల్కలతోని దాగుడు మూతలాడుకొన్న గన్పతి గామె తాన్కి వొచ్చిండు. ''అమ్మా'' అని బిల్సిండు. ''ఏంది బిడ్డా! ఆకలైతున్నదా? ఏమన్న బెట్టాల్నా?'' అని పార్వతి అడిగింది.

''ఏమొద్దమ్మా! చవ్తి పండ్గ దినాలు గదా. ఒకసారి పట్నం బోయొస్తనే.''

''యాడికి బోవొద్దురా కొడ్కా! వొద్దు వొద్దంటె పోయిన యాడాది పట్నం బోయినవు. ఇగొస్తడు, అగొస్తడనుకుంట ఎంతగనం ఎందురుజూసినా నువ్వు రాలేదు. మేమంత పరేశానైతిమి. లెంకంగ లెంకంగ ఆకర్కి మూతదెర్సిన మ్యాన్‌హోల్ల బడ్డ నువ్వు గండ్లబడ్డవు.''

''గీపారి గట్లగాదమ్మా.''

''గిప్పుడు వానకాలం నడుస్తున్నది. వాన బడ్డదా అంటె పట్నం తొవ్వలల్ల యాడ ఏమున్నదో ఎర్కగాదు.''

''వాన కాలం నడుస్తున్నా దినాం వానగొట్టదమ్మా!''

''ఎంత జెప్పినా ఇనవైతివి. పోయిరా! జెర పైలం.''

గన్పతి కైలాసంలకెల్లి ఎల్లిండు. మెల్లగ మబ్బుల పంటి నడ్సుకుంట పట్నం దిక్కు రాబట్టిండు. నడ్మల పట్నంకెల్లి వైకుంటం బోతున్న నారదుడు గాయినకు ఎదురొచ్చిండు. ''నారాయణ, నారాయణ, యాడ్కి బోతున్నవు గన్పతీ'' అని నారదుడడిగిండు. ''పట్నం బోతున్న. గాడ పతొక్క వాడ కట్టుల నా బొమ్మలు బెడ్తరు. గవన్ని ఒక్క తీర్గనే ఉండయి. తీరు తీర్లుంటయి. గంతేగాకుంట ఉండ్రాల్లు, పండ్లు, బచ్చాలు, పాసెం, పులిగోర అసుంటియి నాకు బెడ్తరు.''

''తప్పి జారి గవి దినేవు!''

''ఎందుకు దినొద్దు?''

''ఎవలు జేసినయి ఎట్లుంటయో! మొన్న బాసర ఐఐటీ పోరగాల్లు హాస్టల్ల తిన్నంక కడ్పునొస్తున్నదని మొత్తుకున్నరు. కొంతమంది దవకాన్ల షరీకయ్యింద్రు. పదేండ్ల కిందట రొతుల్లెక్క ఉన్న ఉండ్రాల్లు దింటుంటె నీ రొండు దంతాలల్ల ఒకటిగ్గలేదా? గదంత యాదిమర్సినవా? గింత జెప్పినా తినకుంట బేచైనైతదనుకుంటే నీ ఇష్టం.''

''నువ్వు గింతగనం జెప్పినంక ఎందుకు తింట నారదా?''

''పట్నం బోతె బోయినవు గని తప్పి జారి మునుగోడు బోకు గన్పతీ.''

''ఎందుకు బోవద్దు నారదా!''

''గాడ్కి బోతివా అంటె కాంగ్రెస్ వినాయకునివా అని ఒకడు అడ్గుతడు. బీజేపీ వినాకునివా అని ఒకడు అడ్గితె, టీఆర్ఎస్ వినాయకునివా అని ఇంకొకడు అడ్గుతడు.''

''చాక్ పీస్ల గన్పతి, గవ్వల గన్పతి, ముత్యాల గన్పతి అసువంటి తీరు తీర్ల గన్పతులను జూసిన. నువ్వు జెప్పిన గన్పతులేంది నారదా?''



''మునుగోడుల బైఎలచ్చన్లొచ్చినై. మూడు పార్టీలు పైసలిచ్చి గన్పతులు బెట్టిపిచ్చినయి. కాంగ్రెస్ వినాయకుడు చెయ్యి సూబెడ్తడు. టీఆర్ఎస్ వినాయకుడు మోటర్ల గూసుంటె, బీజేపీ వినాయకుడు తామరపువ్వులుంటడు.''

''మునుగోడుల బై ఎలచ్చన్లు ఎందుకొచ్చినయి నారదా?''

''రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే కుర్సికి రాజీనామ జేసిండు. కాంగ్రెస్లకెల్లి బీజేపీలకు దుంకిండు.''

''గాయిన రాజీనామ ఎందుకు జేసిండు.''

''అడిగితె నియోజక వర్గం అభివృద్ధి కోసమన్నడు.''

''గాయిన జెప్పిన దాంట్ల నిజమేమన్న ఉన్నదా?''

''ఉన్నది. ఎట్లంటవా ఈటెల రాజేందర్ ఎమ్మెల్యే కుర్సికి రాజీనామ జేస్తే హుజూర్‌నగర్ల బై ఎలచ్చన్లు అయినయి. గప్పుడు టీఆర్ఎస్ సర్కార్ ఒక్క గా నియోజక వర్గంలనే గొర్లను పంచింది. కొత్తగ దలిత బందు పద్కం బెట్టి ఒకొక్క దలిత కుటుంబానికి పది లచ్చల రూపాయల వొంతున ఇచ్చింది.''

''మునుగోడుల గుడ్క గట్లే జేస్తదా?''

''చేస్తది. మా వూరుకు తొవ్వ లేదు. తొవ్వ ఏపిచ్చినోల్లకే ఓట్లేస్తం అని ఏ వూరోల్లన్న అంటే టీఆర్ఎస్ సర్కార్ తొవ్వ ఏపిస్తది. సూసింద్రా నేను ఎమ్మెల్యే కుర్సికి రాజీనామ జెయ్యబట్కె మీ వూరికి తొవ్వ వొచ్చిందని రాజగోపాల్ రెడ్డి అంటడు.''

''బై ఎలచ్చన్ల కర్సంత జెనం నెత్తిమీదనే బడ్తది గదా.''

''అవ్. కొత్త పన్నులేస్తరు. మునుగోడుల కొత్త దుక్నాలు బడ్డయి. గవ్వీట్ల సర్పంచులను, గల్లి లీడర్లను అమ్ముతున్నరు. పది వేల రూపాయల వొంతున ఓట్లు గొనెతందుకు పార్టీలు రడీగున్నయి.''

''వామ్మో!''

''యాడాది కొక్కపారి చవ్తి పండ్గొస్తది. గదే తీర్గ అయిదేండ్ల కొక్కపారి, ఒక్కోపారి అంతకన్న ముందుగాలే ఓట్ల పండ్గొస్తది. 'జై గణేశ, జై గణేశ, జై గణేశ దేవా' అన్కుంట జెనం నీకు పూజలు జేస్తరు. ఉండ్రాల్లు బెడ్తరు. మీరే మా దేవుల్లనుకుంట లీడర్లు జెనాలకు బిర్యాని బెడ్తరు. మందు తాపిస్తరు. తొమ్మిది దినాలైనంక నిన్ను నీల్లల్ల ముంచుతరు. ఎమ్మెల్యే కుర్సిలు దొర్కినంక లీడర్లు దినాం జెనాలను నిండ ముంచుతరు'' అని నారదుడు అన్నడు.

''నువ్వు గిదంత జెప్పినంక నాకు పట్నం పోబుద్ది అయితలేదు నారదా!'' అన్కుంట గన్పతి కైలాసం దిక్కు బోయిండు. ''నారాయణ, నారాయణ'' అన్కుంట నారదుడు వైకుంటం బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

తెలిసొచ్చింది!

అదొక గురుకులాశ్రమం. గురువును చూడటానికి వచ్చిన వారందరూ సందేహ నివృత్తి చేసుకుంటున్నారు. తనను ఎవరూ పట్టించుకోవడం లేదని బాధపడ్డాడు ఓ శిష్యుడు. అతని ఆలోచనను గురువు గ్రహించారు. శిష్యుడిని ఓ ఖాళీ కుండను తెమ్మన్నారు. శిష్యుడు లోపలికి వెళ్ళి చూడగా నీటితో ఉన్న కుండ కనబడింది.

జ్యోతిర్మయం

నీటిని కుమ్మరించి తెచ్చాడు. అప్పుడు గురువు 'నేను ఖాళీ కుండనే కదా తెమ్మన్నాను' అన్నారు. అంతట శిష్యుడు 'ఇది ఖాళీ కుండే కదండీ' అన్నాడు. 'గాలి ఉందందులో' అన్నారు గురువు. 'ఇందులోని గాలిని తీసేస్తే ఖాళీ కుండవుతుందిగా' అన్నాడు శిష్యుడు.

'కాదు నాయనా! అందులో ఆకాశం ఉంటుంది' అన్నారు గురువు. మరైతే ఆ ఆకాశాన్ని లేకుండా చేయాలంటే ఏం చేయాలని అడిగాడు శిష్యుడు. అందులో పూర్వంలాగా ఆ కుండను నీటితో నింపమన్నారు గురువు. శిష్యుడికి విషయం అర్థమైంది. తమ గురువు ఆలోచనా దృక్పథం భిన్నంగా ఉండటం వల్లే జనం ఆయన దగ్గరకు వచ్చి నాలుగు మాటలు చెప్పించుకుంటున్నారని గ్రహించాడు. తన లోని అహాన్ని పక్కనపెట్టి అణకువగా ఉంటూ వచ్చాడు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా

శ్రీశైలానికి 1.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్(మాచర్ల): శ్రీశైలం రిజర్వాయర్‌కు మంగళవారం ఎగువ ప్రాజెక్టుల నుంచి 1,14,573 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. క్యాచ్‌మెంట్ ఏరియాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాల నుంచి స్పిల్ వే ద్వారా 20,615 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం 43,777 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 117 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 50,064 క్యూసెక్కులు నీరు వస్తోంది. శ్రీశైలం డ్యామ్ రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర తెరచి 55,692 క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 67,028 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 212.92 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సాగర్‌కు తగ్గిన వరద

నాగార్జునసాగర్ జలాశయానికి వరదనీరు తగ్గుముఖం పట్టింది. మంగళవారం 1,48,763 క్యూసెక్కులు నీరు వస్తోంది. 12 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు 96,072 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఈ నెలకు 5.22 లక్షల టన్నుల ఎరువులు

వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్

సాక్షి, అమరావతి : సెప్టెంబర్ నెలకు రాష్ట్రానికి 5.22 లక్షల టన్నుల ఎరువులను కేంద్రం కేటాయించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. వీటిలో 2.05 లక్షల టన్నుల యూరియా, 62 వేల టన్నుల డీఏపీ, 44 వేల టన్నుల ఎంవోపీ 17,700 టన్నులు, ఎస్ఎస్‌పీ 1.93 లక్షల టన్నులు రాష్ట్రానికి కేటాయించినట్టు తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం ఓడరేవులతో పాటు దేశీయ తయారీదారుల నుంచి రాష్ట్రంలో అన్ని జిల్లాలకు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా కానున్నాయని చెప్పారు. జిల్లాల వ్యవసాయ అధికారులు, సహాయ సంచాలకులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ–క్రాప్ నమోదు ప్రగతి, పీఎం కిసాన్–ఈకేవైసీ అంశాలపై సమీక్షించారు. కిసాన్ డ్రోన్ల మంజూరుకు రైతు గ్రూపుల ఎంపిక ప్రక్రియ సత్వరం పూర్తిచేయాలని ఆదేశించారు. వీరికి డాక్టర్ ఎన్జీ రంగా విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20 తర్వాత శిక్షణ మొదలవుతుందని హరికిరణ్ వెల్లడించారు.

ఆదివాసీల హక్కుల రక్షణే లక్ష్యం

ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు



సాక్షి, అమరావతి : గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు చెప్పారు. పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గిరిజన గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సమావేశం మంగళవారం విజయవాడలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో గిరిజన ఉద్యోగులకు రాజ్యాంగపరమైన హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ దేశంలో అడవుల నుంచి ఆదివాసీలను దూరం చేయడం ఎవరితరం కాదని, ఆదివాసీల హక్కుల రక్షణే లక్ష్యంగా ఎస్టీ కమిషన్ పని చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీ కమిషన్ పర్యటిస్తుందని, ప్రతి జిల్లాలో అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ శాఖలో 650కి పైగా బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని కమిషన్ గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆదివాసి రైతులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వడంతో మూడేళ్లలో నాలుగు లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని వివరించారు. ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, జె.లిల్లి, కొర్ర రాము, పశుసంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర, ఎస్టీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మూడు రోజులు వానలు

- గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో మోస్తరు వర్షాలు
- ఉత్తరకోస్తాలో భారీ వర్షాలకు ఆస్కారం
- తీరం వెంబడి ఈదురుగాలులు
- వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచన



శ్రీకాళహస్తిలో జలమయమైన జయరామారావువీధి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో రెండు, మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ప్రస్తుతం ఉత్తర–దక్షిణ ద్రోణి ఛత్తీస్‌గఢ్ నుంచి కర్ణాటక పరిసరాల వరకు ఆంధ్రప్రదేశ్ మీదుగా పయనిస్తోంది. ఇది సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. దీని ప్రభావంతో ఇప్పటికే రెండ్రోజులుగా కోస్తాంధ్ర, రాయలసీమల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమలో దీని ప్రభావం మరింత ఎక్కువ ఉండడంతో అక్కడ వానలు ఎక్కువ పడుతున్నాయి. బుధవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, ఈనెల 9న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నాయి. ఇటు ద్రోణి, అటు ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో బుధవారం కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో ఉత్తర కోస్తాలోని విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి, దక్షిణ కోస్తాలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం, రాయలసీమలోని కర్నూలు జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అక్కడక్కడ పిడుగులకు ఆస్కారం ఉందని పేర్కొంది. రానున్న మూడు రోజులు తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది. అందువల్ల మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించింది. కాగా మంగళవారం రాత్రి వరకు వెంకటగిరిలో అత్యధికంగా 9.1 సెంటీమీటర్లు, సీతానగరం 8.8, బొబ్బిలి 8.3, సాలూరు 7.3, కొయ్యూరు 6.6, లింగసముద్రం 6.1, అమలాపురం 5.8, బోడవరం 5.2, గోకవరం 5.0, గుత్తి (అనంతపురం జిల్లా)లో 4.2 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

స్టార్టప్‌లకు కేంద్రంగా భారత్

ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ సదస్సులో ఈఎస్‌సీ చైర్మన్ సందీప్ నరూలా



ఎంవోయూలను చూపిస్తున్న డాక్టర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి, సందీప్ నరూలా, దేవేష్ త్యాగి

సాక్షి, విశాఖపట్నం : భవిష్యత్‌లో టెక్నికల్ స్టార్టప్‌లకు భారతదేశం కేంద్ర బిందువుగా మారనుందని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్(ఈఎస్‌సీ) చైర్మన్ సందీప్ నరూలా తెలిపారు. కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'ఏపీ స్టేట్ స్టార్టప్ కాన్‌క్లేవ్'ను ఏయూ వీసీ డాక్టర్ పీవీజీడీ ప్రసాదరెడ్డితో కలిసి సందీప్ నరూలా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టార్టప్‌లకు సంబంధించిన సాంకేతికతను అందిపుచ్చుకునే విషయంలో పరస్పర సహకారం కోసం ఏయూ ఇన్నోవేటివ్ సొసైటీ, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్, ఈఎస్‌సీ సంస్థ ఎంవోయూ చేసుకున్నాయి. అనంతరం సందీప్ నరూలా మాట్లాడుతూ దేశంలో లోకల్ స్టార్టప్‌లు పెరగడం శుభపరిణామమన్నారు. స్టార్టప్‌లు స్థానిక ఆర్థిక ప్రగతికి ఊతమిస్తాయన్నారు. ఔత్సాహికుల ఆలోచనలను విజయవంతమైన వ్యాపారంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఏయూ సహకారం అందించడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి రాష్ట్రంలో స్టార్టప్‌ల పోటీలు నిర్వహిస్తున్నామని, వీటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి త్వరలోనే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమమైన స్టార్టప్‌లను ఎంపిక చేసి, శాన్‌ఫ్రాన్సిస్కోలో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని సందీప్ వివరించారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) సీనియర్ డైరెక్టర్ డాక్టర్ దేవేష్ త్యాగి మాట్లాడుతూ ఎస్‌టీపీఐకి దేశ వ్యాప్తంగా 62 కేంద్రాలు ఉన్నాయని, విశాఖ కేంద్రంలో టీపీవో 2.0 ప్రాజెక్టు అమలుకు సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో నెక్ట్స్ జనరేషన్ ఇంక్యుబేషన్ స్కీమ్ అమలుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూలోని స్టార్టప్ సెంటర్‌లో 38 అంకుర పరిశ్రమలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఈఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుర్మీత్ సింగ్, ఎస్‌టీపీఐ డైరెక్టర్ రామ్‌ప్రసాద్, ఈఎస్‌సీ ఏపీ చాప్టర్ చైర్మన్ సుధాకర్ పంతుల, ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఆర్‌బీకేలు అద్భుతం

రైతులకు గ్రామస్థాయిలోనే ప్రయోజనం

- ప్రశంసలు కురిపించిన తమిళనాడు వ్యవసాయాధికారుల బృందం
- తిరుపతి జిల్లాలో ఆర్‌బీకేల, పరిశోధనల ల్యాబ్‌ల సందర్శన



ఆర్‌బీకే పనితీరును అడిగి తెలుసుకుంటున్న మురళీధరన్

తిరుపతి రూరల్ : రైతులకు గ్రామ స్థాయిలోనే సంపూర్ణ సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రాలు అద్భుతమని తమిళనాడుకు చెందిన వ్యవయసాయాధికారుల బృందం ప్రశంసలు కురిపించింది. ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడింది. తమిళనాడుకు చెందిన సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ మురళీధరన్‌ఆధ్వర్యంలో 35 మంది డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, వ్యవసాయాధికారుల బృందం ప్రత్యేక బస్సులో మంగళవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే), చంద్రగిరిలోని నియోజకవర్గ వ్యవసాయ పరిశోధన ల్యాబ్‌ను సందర్శించింది. ఆర్‌బీకేలో అందిస్తున్న సేవలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం ఉపయోగించే డిజిటల్ కియోస్క్‌ల ఉపయోగాలను పరిశీలించింది. వారికి వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, ఏడీ సుబ్రమణ్యంలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మురళీధరన్ మాట్లాడుతూ ఒకే గొడుగు కింద రైతులకు అన్ని రకాల సేవలను అందించడంలో ఆర్‌బీకేలు అక్షయ పాత్రలుగా పనిచేస్తున్నాయని కొనియాడారు. అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అన్నదాతలకు విప్లవాత్మక సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ముఖ్యంగా ఆర్‌బీకే స్థాయిలోనే ప్రతి నెలా వ్యవసాయ సలహా కమిటీ సమావేశాలు నిర్వహించి, రైతులకు సంబంధించి సమగ్రంగా చర్చించుకునే విధానం అనుసరణీయమన్నారు. ఏపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ పరిశోధన ల్యాబ్‌ల వల్ల కలిగే ప్రయోజనాలపై తమిళనాడు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు మురళీధరన్ వెల్లడించారు.

టీడీపీ నాయకుల బరితెగింపు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపైకి కారు ఎక్కించిన టీడీపీ నాయకులు
- ముగ్గురికి తీవ్ర గాయాలు.. ప్రకాశం జిల్లా గొంగటిరెడ్డిపాలెంలో ఘటన

జరుగుమల్లి : ప్రకాశం జిల్లా గొంగటిరెడ్డిపాలెంలో టీడీపీ నాయకులు మంగళవారం దౌర్జన్యానికి పాల్పడ్డారు. వినాయకుడి నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ వర్గీయులను అడ్డుకొని.. కులం పేరుతో దూషించారు. కారును ఊరేగింపు మీదకు దూకించి.. ముగ్గురిని తీవ్రంగా గాయపరిచారు. వినాయకచవితి సందర్భంగా గొంగటిరెడ్డిపాలెంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయులు వేర్వేరుగా వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. రెండు రోజుల కిందట టీడీపీ వాళ్లు తమ వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ వర్గీయులు తమ విగ్రహంతో నిమజ్జనానికి బయల్దేరారు. ఇంతలో టీడీపీ నాయకుడు బండి మాలకొండారెడ్డి కుమారులైన కొండారెడ్డి, మాల్యాద్రి రోడ్డుకు అడ్డంగా కార్లు పెట్టి.. ఊరేగింపును అడ్డుకున్నారు. దీంతో 'మీ బొమ్మను మేము అడ్డుకోలేదు కదా.. మాకెందుకు అడ్డు పడుతున్నారు' అని వారిని వైఎస్సార్ సీపీ వర్గీయులు ప్రశ్నించారు. కొండారెడ్డి, మాల్యాద్రి వెంటనే తమ కార్లను రోడ్డుపై విచక్షణారహితంగా తిప్పుతూ.. ఒక్కసారిగా ఊరేగింపులో ఉన్న వారి మీదకు దూకించారు. మల్లవరపు పోలయ్య అనే వ్యక్తి కాలు మీదకు కారు ఎక్కించిన కొండారెడ్డి.. అతన్ని కులం పేరుతో దూషిస్తూ, 'మీకు కూడా వినాయకుడు కావాలా..' అంటూ హేళన చేశాడు. పోలయ్య, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు ఎదురుతిరిగి పోలీసులకు సమాచారమివ్వడంతో మాల్యాద్రి పారిపోయాడు. కొండారెడ్డి మాత్రం గోడకు తల బాదుకొని.. తనను కొట్టారంటూ పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చి కందుకూరు ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. గాయపడిన వారిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ సురేష్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

18 మంది విద్యార్థులకు అస్వస్థత

కాకినాడ కేంద్రీయ విద్యాలయలో ఘటన

- హుటాహుటిన 108 అంబులెన్సుల్లో జీజీహెచ్‌కు తరలింపు
- కోలుకుంటున్న విద్యార్థులు
- ముగ్గురు డిశ్చార్జ్
- ఘటనపై సర్కార్ సీరియస్.. కమిటీ ఏర్పాటు



కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఊపిరి ఆడక 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయిన ఘటన మంగళవారం కాకినాడలోని కేంద్రీయ విద్యాలయలో చోటు చేసుకుంది. కాకినాడ రూరల్ మండలం వలసపాకలలో ఉన్న కేంద్రీయ విద్యాలయలో 473 మంది చదువుకుంటున్నారు. మంగళవారం మొదటి పీరియడ్ 9.30 గంటలకు ప్రారంభం కాగా, 6వ తరగతి విద్యార్థి ఒకరు తనకు ఊపిరి ఆడడం లేదని.. కళ్లు మండుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశాడు. ఆ తర్వాత వరుసగా మరో 17 మంది ఇదే సమస్యతో తరగతి గదుల నుంచి బయటకు వచ్చేశారు. వీరిలో 11 మంది అబ్బాయిలు, ఏడుగురు అమ్మాయిలు ఉన్నారు. వీరందరినీ సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారంతా కోలుకుంటున్నారు. వీరిలో ముగ్గురు విద్యార్థులను డిశ్చార్జ్ చేశారు. మిగతా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని.. వారందరినీ పరిశీలనలో ఉంచామని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ బుద్ధా తెలిపారు. విద్యార్థులను మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా పరామర్శించారు.

పాఠశాలను పరిశీలించిన అధికారుల బృందం

డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ అధికారి వెంకటాచలం, డీఎస్పీ భీమారావు, ఫుడ్ సేఫ్టీ అధికారి షేక్ నాగూర్ మీరా, తహశీల్దార్ మురార్జీ తదితరులు స్కూల్‌ను పరిశీలించారు. విద్యార్థులు అస్వస్థతకు గురవడానికి కారణం తరగతి గదుల్లో ఆక్సిజన్ లెవెల్స్ తక్కువగా ఉండటమేనని భావిస్తున్నారు. సోమవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొందరు విద్యార్థులు నురుగు వచ్చే ఫోమ్‌తో కూడిన స్ప్రే టిన్‌లను వినియోగించినట్టు తెలిసింది. రాత్రి కిటికీలు మూసి ఉండటంతో స్ప్రేలో ఉండే ఐసోసైనెట్, పాలియాల్ రసాయనాలు గదుల్లో వ్యాపించి ఆక్సిజన్ లెవెల్స్ తగ్గి ఉండొచ్చని భావిస్తున్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. కలెక్టర్ చైర్మన్‌గా విచారణకు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించింది.

వచ్చే ఏడాది విజయవాడ నుంచే హజ్ యాత్ర

- హజ్ కమిటీ సమావేశ వివరాలు వెల్లడించిన చైర్మన్ గౌసల్ అజమ్

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది నుంచి విజయవాడ కేంద్రంగా హజ్ యాత్రకు చర్యలు చేపడతామని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర హజ్ కమిటీకి లేఖలు రాస్తామని ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌసల్ అజమ్ తెలిపారు. విజయవాడలోని హజ్ కమిటీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర హజ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న పలు నిర్ణయాలను ఎమ్మెల్సీ, హజ్ కమిటీ సభ్యుడు ఇస్సాక్ బాషా, మిగిలిన సభ్యులతో కలిసి చైర్మన్ గౌసల్ అజమ్ మీడియాకు వెల్లడించారు. గత నెల 6న ఈ ఏడాది హజ్ యాత్ర ముగిసిందని, యాత్రకు 1,164 మంది సురక్షితంగా వెళ్లి వచ్చారని తెలిపారు. హజ్ యాత్రికులకు దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనంత ఎక్కువగా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్న ఘనత ఏపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించి, ఆయన అనుమతితో రానున్న ఏడాదికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం కావడంతో 2020లో విజయవాడ నుంచి హజ్ యాత్రకు కేంద్ర హజ్ కమిటీ ఎంబార్కేషన్ సెంటర్‌కు అనుమతిచ్చిందని, కోవిడ్ కారణంగా అది వినియోగంలోకి రాలేదన్నారు. వచ్చే ఏడాది(2023) ఎంబార్కేషన్ సెంటర్‌ను పునరుద్ధరించేలా చేసి గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచే హజ్ యాత్రకు చర్యలు చేపడతామని తెలిపారు. వైఎస్సార్ కడపలో హజ్ కమిటీ భవన నిర్మాణం దాదాపు 80 శాతం పూర్తయిందని, అలాగే విజయవాడ–గుంటూరు మధ్య హజ్ హౌస్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీఎం జగన్‌ను కోరతామని చెప్పారు. ఇందుకోసం గన్నవరం ఎయిర్‌పోర్టు – గుంటూరు మధ్య ఐదెకరాల భూమి కేటాయించి, నిధులు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని గౌసల్ అజమ్ వివరించారు.

బొగ్గు కొరత రానివ్వొద్దు

- ఇంధన శాఖ, గనుల శాఖ సమన్వయంతో పనిచేయాలి
- బొగ్గు గనులు నిర్వహిస్తున్న ఏపీఎండీసీ సహకారం తీసుకోవాలి
- వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో జాప్యం వద్దు
- అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ఇంధన, గనులు, ఖనిజాభివృద్ధి శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్కేంద్రాలకు దేశీయంగా లభిస్తున్న బొగ్గుతో పాటు విదేశాల నుంచి కూడా దిగుమతులు చేసుకుంటున్నామన్నారు. ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) వంటి ప్రభుత్వరంగ సంస్థలు బొగ్గు రంగంలోకి ప్రవేశించిన నేపథ్యంలో దేశీయంగా లభించే బొగ్గును మన రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాలు వినియోగించుకునేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా బొగ్గు గనుల నిర్వహణకు ఏపీఎండీసీ సిద్ధంగా ఉందని, ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో సుల్యారీ గనిని నిర్వహిస్తోందన్నారు. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాల్లో మరికొన్ని గనులను కూడా చేపట్టే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును అందించేందుకు ఉన్న అన్ని మార్గాలను పరిశీలించాలని.. ఇందుకు ఇంధన, గనుల శాఖాధికారులు సమన్వయం చేసుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి సూచించారు.

ఇంధన శాఖ పునర్వ్యవస్థీకరణ

ఇక ఇంధన శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయడంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో పెరిగిన జిల్లాలకు అనుగుణంగా ఇంధన శాఖను కూడా పునర్వ్యవస్థీకరించాలని ఆయన సూచించారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతులకు వ్యవసాయ కనెక్షన్లను ఇవ్వడంలో జాప్యం చేయకూడదని సీఎం జగన్ ఆదేశాలిచ్చారని.. దానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. అలాగే, వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు బిగించే కార్యక్రమాన్ని కూడా నిర్ణీత లక్ష్యంలోగా పూర్తిచేయాలని సూచించారు.

పెండింగ్ కేసులపై దృష్టి

ఇంధనశాఖ పరిధిలో వివిధ విభాగాలకు సంబంధించిన కోర్టు కేసులను సత్వరం పరిష్కరించే విషయంలో అధికారులు దృష్టిసారించాలని కూడా మంత్రి పెద్దిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నెడ్‌క్యాప్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులపై రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే విజయానంద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, ట్రాన్స్‌కో సీఎండీ బీ శ్రీధర్, నెడ్‌క్యాప్ వీసీ–ఎండీ ఎస్.రమణారెడ్డి, ఏపీఎండీసీ వీసీ–ఎండీ వీజీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ టికెట్లు

- ఈ నెల 20 నుంచి అమలు.. భక్తులు అడ్వాన్స్‌గా టికెట్లు, గదులు బుక్ చేసుకోవచ్చు
- దసరా ఉత్సవాల్లో వీఐపీలూ టికెట్ కొంటేనే దుర్గగుడిలో దర్శనం
- వీఐపీల దర్శనాలకు టైం స్లాట్
- దసరా తర్వాత దుర్గగుడిలో అంతరాలయ దర్శనానికి రూ.500 టికెట్
- అక్టోబరు 10న ధార్మిక పరిషత్ తొలి సమావేశం
- మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



సాక్షి, అమరావతి : దేవదాయ శాఖ పరిధిలో ఉన్న 11 ప్రధాన ఆలయాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి దర్శనం టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఇవ్వనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆలయాల వద్ద గదుల కేటాయింపు వంటి వాటిని కూడా ఆన్‌లైన్ పరిధిలోకి తెస్తామన్నారు. మంత్రి మంగళవారం విజయవాడలో దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ గుడి, పెనుగ్రంచిపోలు, ద్వారకా తిరుమల, అన్నవరం, సింహాచలం, విశాఖపట్నం కనకమహాలక్ష్మి ఆలయం, వాడపల్లి, ఐనవల్లి ఆలయాల్లో ఆన్‌లైన్ టికెట్ విధానం తప్పనిసరి చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు అడ్వాన్స్‌గా నిర్ణీత తేదీకి ఆన్‌లైన్ దర్శన టికెట్లు, గదులు బుకింగ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. రద్దీ అధికంగా ఉండే మరో 12 ఆలయాల్లోనూ ఆన్‌లైన్ విధానం అమలుపై చర్చిస్తున్నట్లు వివరించారు.

వారం వారం సమీక్ష

ఇకపై ప్రతి బుధవారం దేవదాయశాఖ సమీక్ష సమావేశం నిర్వహించి, ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులకు అడ్డుగా ఉన్న కోర్టు కేసుల ఉపసంహరణకు ఉద్యోగ సంఘాల నేతలు ముందుకొచ్చారని, ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పదోన్నతులు కల్పిస్తామని చెప్పారు. దేవదాయ శాఖ ట్రిబ్యునల్‌లో సిబ్బంది నియామకాలను చేపట్టినట్లు వివరించారు. కొత్తగా ఏర్పాటైన ధార్మిక పరిషత్ తొలి సమావేశం అక్టోబరు 10న నిర్వహించనున్నట్లు చెప్పారు.

దసరా ఉత్సవాల్లో వీఐపీలకూ టైం స్లాట్ దర్శనాలు

దసరా ఉత్సవాల్లో విజయవాడ కనకదుర్గ గుడిలో వీఐపీలకు కూడా టైం స్లాట్ ప్రకారమే దర్శనాలు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. వీఐపీలు కూడా టికెట్ కొనాలని చెప్పారు. రోజుకు ఐదు ప్రత్యేక టైం స్లాట్‌లు ఉంటాయన్నారు. రెండేసి గంటలు ఉండే ఒక్కొక్క టైం స్లాట్‌లో రెండు వేల వీఐపీ టికెట్లను ఇస్తామన్నారు. అందులో 600 టికెట్లు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలు ఉన్న వారికి కేటాయించి, మిగిలినవి అందరికీ ఇస్తామన్నారు. ఒక లేఖకు ఆరు టికెట్లు ఇస్తామన్నారు. సిఫార్సు లేఖలు, ఇతర వీఐపీ టికెట్ల బుకింగ్‌కు విజయవాడ కలెక్టర్ ఆఫీసులో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు వంటి ప్రివిలేజ్డ్ వీఐపీలు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే ఉదయం, సాయంత్రం వేళల్లో అర్ధ గంట చొప్పున ఉచిత దర్శనం ఉంటుందని తెలిపారు. సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. దుర్గగుడి ఘాట్ రోడ్డును పూర్తిగా క్యూలైన్‌లకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఉచిత దర్శనానికి మూడు లైన్లు, రూ.300 టికెట్ వారికి ఒకటి, రూ.100 టికెట్ వారికి మరొక క్యూ ఉంటాయని చెప్పారు. వికలాంగులు, వృద్ధులకు రోజూ ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఒకసారి, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య మరోసారి ప్రత్యేక దర్శనాలు ఉంటాయని వివరించారు.

మంత్రులకూ అంతరాలయ దర్శనం ఉండదు

దసరా ఉత్సవాల సమయంలో దుర్గగుడిలో అంతరాలయ దర్శనం గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి ప్రముఖులకు మాత్రమే ఉంటుందని తెలిపారు. మంత్రులకు సైతం బయట నుంచే దర్శనాలు కల్పించాలని ఆలోచన చేస్తున్నామని వివరించారు. దసరా ఉత్సవాల తర్వాత దుర్గగుడిలో అంతరాలయ దర్శనానికి రూ. 500 టికెట్ విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు.

ముక్కు ద్వారా తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్‌కు డీసీజీఐ అనుమతి

న్యూఢిల్లీ/హైదరాబాద్: ముక్కు ద్వారా చుక్కల రూపంలో తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్‌కు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా అనుమతి లభించింది. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ తయారీ ఇంట్రానాసల్ కోవిడ్ వ్యాక్సిన్.. ఐఎన్‌కోవ్యాక్ (బీబీవీ164)ను 18 ఏళ్లపైబడిన వారికి ఇచ్చేందుకు అత్యవసర అనుమతులు మంజూరుచేసినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రి మాన్సుఖ్ మాండవీయ మంగళవారం ట్వీట్ చేశారు. ముక్కు ద్వారా చుక్కల రూపంలో తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్‌లలో భారత్ బయోటెక్ తయారీ వ్యాక్సిన్.. ప్రపంచంలోనే తొలి వ్యాక్సిన్ కావడం విశేషం. క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా 4,000 మంది వలంటీర్లపై జరిపిన పరీక్షల్లో ఎలాంటి దుష్ప్రభావాలు కనిపించలేదని భారత్ బయోటెక్ చైర్మన్, ఎండీ కృష్ణ ఎల్లా చెప్పారు. క్లినికల్ ట్రయల్స్‌లో వ్యాధి నిరోధకతను వ్యాక్సిన్ సమర్థవంతంగా ప్రేరేపించిందని వెల్లడించారు. ప్రపంచ ఇంట్రానాసల్ వ్యాక్సిన్ టెక్నాలజీలో నూతన ఒరవడి మొదలవనుందని ఆయన అన్నారు.

క్లుప్తంగా...

సరిహద్దుల వద్ద 250 మంది ఉగ్రవాదులు

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఉగ్ర శిబిరాల్లో 250 ఉగ్రవాదులు సరిహద్దులు దాటేందుకు నక్కి ఉన్నారన్న నిఘా వర్గాల హెచ్చరికలతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. చొరబాట్లు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి రవాణాతోపాటు సరిహద్దుల ఆవలి నుంచి డ్రగ్స్ స్మగ్లింగ్ ఆందోళన కలిగిస్తోందని డీజీపీ దిల్బాగ్ సింగ్ తెలిపారు. చలికాలం రానున్నందున 12 వేల అడుగుల ఎత్తులో గస్తీ విధుల నిర్వహణ మరింత కఠిన తరం కానుందన్నారు. నిఘా వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు.

ఇద్దరు ఉగ్రవాదులు హతం

అనంత్‌నాగ్ జిల్లా పాష్‌క్రీరి ప్రాంతంలో భద్రతా బలగాలతో ఎదురుకాల్పుల్లో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిని డనిష్ భట్, బషరత్ నబీగా గుర్తించారు.

ఆ స్థానాలపై ప్రత్యేక దృష్టి

నేతలతో నడ్డా, అమిత్ షా చర్చలు

న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ వ్యూహాలకు పదును పెడుతోంది. వివిధ రాష్ట్రాల్లో గడ్డు పరిస్థితులున్న 144 లోక్‌సభ స్థానాల్లో ఎలాగైనా విజయకేతనం ఎగురవేయడానికి ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇతర కీలకనాయకులతో కలిసి మంగళవారం సమావేశమై చర్చించారు. గెలుపు అంత సులభం కాదని కమలనాథులు భావిస్తున్న 144 లోక్‌సభ నియోజకవర్గాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై లోతుగా చర్చించారు. ఈ సమావేశానికి భూపేందర్ యాదవ్, గిరిరాజ్ సింగ్, స్మృతి ఇరానీ, గజేంద్ర సింగ్ షెకావత్ సహా 25 మందికిపైగా కేంద్ర మంత్రులు హాజరయ్యారు. మంత్రులకి, ఇతర నాయకులు ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలను కేటాయించి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే పని అప్పగించినట్టుగా పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆయా నియోజకవర్గాల్లో వివిధ వర్గాలను ఆకట్టుకునే వ్యూహాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల లబ్ధిదారులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టనున్నారు. 144 నియోజకవర్గాల్లో అత్యధికంగా 2019లో ఓటమిపాలైనవి ఉండగా, విజయం సాధించిన కొన్ని సీట్లు కూడా ఉన్నాయి. ప్రాంతీయంగా నెలకొన్న రాజకీయ పరిస్థితులతో గత ఎన్నికల్లో విజయం సాధించిన కొన్ని సీట్లలోనూ బీజేపీకి వ్యతిరేకత ఉంది. ఈ నియోజకవర్గాలకు సంబంధించి ఏం చేయాలో సమగ్ర ప్రణాళికతో పార్టీ ఇప్పటికే ఒక బ్లూ ప్రింట్‌ను రూపొందించింది. ఆ నియోజకవర్గాల్లో పార్టీకి ఉన్న బలాలు, బలహీనతలు, అవకాశాలు, ముప్పుల్ని అంచనా వేస్తూ 2024లో గెలిచే వ్యూహరచన మంత్రులు చేయాల్సి ఉంటుంది.

రష్యాకు ఉత్తర కొరియా రాకెట్లు

వాషింగ్టన్ : ఉక్రెయిన్‌తో యుద్ధం ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్తర కొరియా నుంచి భారీ ఎత్తున ఆయుధాలు కొనుగోలు చేయడానికి రష్యా సన్నాహాలు చేస్తోంది. లక్షల సంఖ్యలో రాకెట్లు, శతఘ్నులు ఉత్తర కొరియా నుంచి కొనుగోలు చేసే ప్రక్రియను రష్యా రక్షణ శాఖ ప్రారంభించిందని అమెరికా ఇంటెలిజెన్స్ వెల్లడించింది. భవిష్యత్‌లో కూడా మిలటరీ పరికరాల్ని రష్యా ఉత్తర కొరియా నుంచే కొనుగోలు చేస్తుందని ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించినట్టు ది న్యూయార్క్ టైమ్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఉక్రెయిన్‌పై దండయాత్రతో ఆయుధాల కొరతను ఎదుర్కొంటూ ఉండడంతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్‌లు లేఖలు రాసుకున్నారు. గత నెలలో ఇరాన్ నుంచి రష్యా డ్రోన్లు కొనుగోలు చేసింది. ఉక్రెయిన్ యుద్ధ భూమిలో వీటిని వినియోగించనప్పుడు సాంకేతిక లోపాలు తలెత్తాయి.

యెమెన్‌లో ఉగ్ర దాడి

కైరో: యెమెన్‌లో భద్రతా బలగాలున్న సెక్యూరిటీ పోస్ట్‌పై అల్‌ఖైదా ఉగ్రవాదులు మంగళవారం మెరుపుదాడి చేశారు. దాంతో సీనియర్ కమాండర్‌సహా 21 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఎదురుకాల్పుల్లో ఆరుగురు మిలిటెంట్లు హతమయ్యారు. దక్షిణ యెమెన్‌లోని అబ్యాన్ ప్రావిన్స్‌లోని అవార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ యెమెన్ దక్షిణ ప్రాంతంలో వేర్పాటువాద స్థానిక ప్రభుత్వం నడుస్తోంది. దీనికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మద్దతు పలుకుతోంది.

పగ్గాలు చేపట్టిన లిజ్

బ్రిటన్‌ను సమున్నతంగా తీర్చిదిద్దుతానని ప్రకటన

- ఆమె కేబినెట్లో చేరొద్దని రిషి నిర్ణయం
- హోం మంత్రిగా భారత సంతతికి చెందిన సుయెల్లా బ్రెవర్మన్

లండన్: హోరాహోరి పోరులో నెగ్గి కన్జర్వేటివ్ పార్టీ నేతగా ఎన్నికైన లిజ్ ట్రస్ (47)ను బ్రిటన్ ప్రధానిగా రాణి ఎలిజబెత్2 లాంఛనంగా నియమించారు. ట్రస్ మంగళవారం స్కాట్లండ్ వెళ్లి అక్కడి బాల్మోరల్ క్యాజిల్‌లో వేసవి విడిదిలో సేదదీరుతున్న 96 ఏళ్ల రాణితో భేటీ అయ్యారు. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఈ సందర్భంగా రాణి ఆమెను ఆహ్వానించారు. అంతకుముందు తాత్కాలిక ప్రధాని బోరిస్ జాన్సన్ (58) రాణికి తన రాజీనామా సమర్పించారు. కొత్త ప్రధానిని ప్రభుత్వ ఏర్పాటుకు రాణి ఆహ్వానించే ప్రక్రియ లండన్‌లోని బకింగ్‌హాం ప్యాలెస్‌లో జరగడం ఆనవాయితీ. కానీ వృద్ధాప్యంతో రాణి ప్రయాణాలు బాగా తగ్గించుకున్నారు. దాంతో తొలిసారిగా వేదిక బాల్మోరల్ క్యాజిల్‌కు మారింది. ఎలిజబెత్2 హయాంలో ట్రస్ 15వ ప్రధాని కావడం విశేషం! 1952లో విన్‌స్టన్ చర్చిల్ తొలిసారి ఆమె ద్వారా ప్రధానిగా నియమితుడయ్యారు. ప్రభుత్వ ఏర్పాటు ఆహ్వానం అందుకున్న అనంతరం ట్రస్ లండన్ తిరిగి వచ్చారు. ప్రధానిగా తొలి ప్రసంగం అనంతరం తన కేబినెట్‌ను ఆమె ప్రకటించనున్నారు.



లిజ్ ట్రస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు లాంఛనంగా ఆహ్వానిస్తున్న బ్రిటన్ రాణి ఎలిజబెత్2

భారత సంతతికి చెందిన అటార్నీ జనరల్ సుయెల్లా బెవర్మన్‌ను హోం మంత్రిగా ట్రస్ ఎంచుకున్నారు. ప్రధాని పీఠం కోసం ట్రస్‌తో చివరిదాకా హోరాహోరీ పోరాడిన భారత సంతతికి చెందిన రిషి సునాక్ మాత్రం ఆమె కేబినెట్లో చేరబోనని దాదాపుగా స్పష్టం చేశారు. రాజీనామాకు ముందు జాన్సన్ వీడ్కోలు ప్రసంగం చేశారు. 'ఆట మధ్యలో నిబంధనలు మార్చేయడం ద్వారా' సహచర పార్టీ నేతలే తనను బలవంతంగా సాగనంపారంటూ ఆక్రోశించారు. తనను తాను అప్పగించిన పని విజయవంతంగా పూర్తి చేసిన బూస్టర్ రాకెట్‌గా అభివర్ణించుకున్నారు. మున్ముందు కూడా అవసరాన్ని బట్టి తళుక్కుమని మెరుస్తుంటానని చమత్కరించారు. ట్రస్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు.



భార్యతో కలిసి ప్రధాని అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్ వీడుతున్న బోరిస్ జాన్సన్

సాహసోపేత ప్రణాళికలు: ట్రస్

బ్రిటన్‌ను సంక్షోభం నుంచి బయట పడేసేందుకు తన వద్ద సాహసోపేత ప్రణాళికలున్నాయని ట్రస్ ప్రకటించారు. పన్ను కోతలు, సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిస్తానని ప్రధాని అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్ నుంచి చేసిన తొలి ప్రసంగంలో పేర్కొన్నారు. ''అత్యంత కీలక సమయంలో దేశ సారథ్య బాధ్యతలు చేపట్టడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఇంధన కొరత వంటి సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొంటాం. అందరికీ ఆశించిన అవకాశాలు, అత్యధిక వేతనాలు, సురక్షిత వీధులతో కూడిన ఆకాంక్షల దేశంగా బ్రిటన్‌ను తీర్చిదిద్దుతా. తక్షణమే అందుకు రంగంలోకి దిగుతా'' అని ప్రకటించారు. పలువురు ఎంపీలు వర్షంలో తడుస్తూనే ప్రసంగం విన్నారు.



10, డౌనింగ్ స్ట్రీట్ ముందు భర్తతో కలిసి లిజ్ ట్రస్

రిషి ఓటమి వెనక..

రెడీ ఫర్ రిషి అంటూ బ్రిటన్ ప్రధాని అభ్యర్థి ఎన్నికలో మొదట్లో దూకుడు చూపించిన రిషి సునాక్ ఎందుకు ఓటమి పాలయ్యారు? ఎంపీల మద్దతు పుష్కలంగా ఉన్నా టోరీ సభ్యుల అండదండలు ఎందుకు లభించలేదు? భారత్‌ను వలసరాజ్యంగా మార్చిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఒక భారతీయుడు పాలించే రోజు వస్తుందన్న ఆశలు ఎందుకు అడియాసలయ్యాయి? దీనిపై బ్రిటిష్ మీడియాలో పలు కథనాలు వస్తున్నాయి...



- కోవిడ్–19 పార్టీ గేట్ కుంభకోణంలో ఇరుక్కొన్న ప్రధాని బోరిస్ జాన్సన్‌కు రిషి వెన్నుపోటు పొడిచారన్న అభిప్రాయం కన్జర్వేటివ్ పార్టీలో బలంగా ఏర్పడింది. రాజకీయ గురువని కూడా చూడకుండా జాన్సన్‌కు వ్యతిరేకంగా పని చేసి ఆయన రాజీనామా చేయాల్సిన పరిస్థితి కల్పించారని టోరీ సభ్యులు విశ్వసించారు. ఆర్థిక మంత్రి పదవికి రిషి రాజీనామా చేయడంతో ఇతర మంత్రులూ అదే బాట పట్టారు. వారికి మద్దతుగా 50 మంది ఎంపీలు కూడా రాజీనామా చేయడంతో ఒత్తిడి పెరిగి జాన్సన్ గద్దె దిగాల్సి వచ్చింది. దీన్ని నమ్మకద్రోహంగానే టోరి సభ్యులు చూశారు. ఆ వెంటనే రెడీ ఫర్ రిషి అంటూ పోటీకి దిగి దూకుడుగా ప్రచారానికి తెర తీయడంతో ప్రధాని పదవి కోసమే అంతా చేస్తున్నారన్న ప్రచారం జరిగింది. బోరిస్ కూడా రిషికి వ్యతిరేకంగా పని చేశారు.
- ప్రతి మగవాడి విజయం వెనకా ఒక మహిళ ఉంటుందంటారు. కానీ రిషి పరాజయం వెనుక దురదృష్టవశాత్తూ ఆయన భార్య, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కుమార్తె అక్షత ఉన్నారు. ఆమె ఎలిజెబెత్ రాణి కంటే సంపన్నురాలన్న ప్రచారముంది. అలాంటి వ్యక్తి పన్నులు ఎగ్గొట్టడానికి నాన్ డొమిసైల్ హోదాను అడ్డం పెట్టుకున్నారన్న ఆరోపణలు కూడా రిషికి ప్రతికూలంగా మారాయి.
- తన ప్రత్యర్థి లిజ్ ట్రస్ ప్రకటించిన పన్ను రాయితీలను వ్యతిరేకించడం కూడా రిషి కొంప ముంచింది. వాటివల్ల ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుందన్న రిషి వాదనకు కాకలు తీరిన ఆర్థికవేత్తలు మద్దతిచ్చినా టోరీ సభ్యులు మాత్రం ట్రస్ తక్షణం ఉపశమన చర్యలకే జై కొట్టారు.
- రిషీ అమెరికా గ్రీన్ కార్డు వివాదం కూడా ఆయనకు వ్యతిరేకంగా మారింది. బ్రిటన్‌కు మకాం మార్చాక కూడా గ్రీన్ కార్డును ఆయన అట్టిపెట్టుకున్నారని, ఎప్పటికైనా అమెరికాకు వెళ్లిపోవడానికే ఈ పని చేశారని సోషల్ మీడియాలో బాగా ప్రచారమైంది. ఆర్థిక మంత్రి కాగానే గ్రీన్‌కార్డును వదులుకున్నానని రిషి వివరణ ఇచ్చినా అప్పటికే నష్టం జరిగిపోయింది.
- రిషి విలాసవంతమైన జీవితం కూడా ఆయనకు కాస్త చేటు చేసింది. ఆయన ఖరీదైన సూటు, బూటు, ఆర్థిక మంత్రిగా బడ్జెట్ ఫొటో సెషన్లో ఖరీదైన మగ్గుతో ఫోటోలు దిగడం వంటివి పత్రికల్లో పతాక శీర్షికలయ్యాయి. కరువు గుప్పిట్లో చిక్కిన బ్రిటన్‌లో గుక్కెడు నీళ్ల కోసం జనం విలవిల్లాడుతుంటే రిషీ యార్క్‌షైర్‌లోని తన కొత్తింట్లో 4 లక్షల పౌండ్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మించడం వివాదాస్పదమైంది. 'నా ఫ్రెండ్స్ అంతా ధనవంతులే. నా స్నేహితుల్లో సామాన్యులెవరూ లేరు' అంటూ ఎప్పుడో ఆయన మాట్లాడిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో రిషి అందరివాడు కాదన్న ప్రచారానికి బలం చేకూరింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

'ప్రధాని' ఆసక్తి లేదు: నితీశ్

- కేజ్రీవాల్, అఖిలేశ్, రాజా, ఏచూరి, చౌతాలా తదితరులతో మంతనాలు
- విపక్షాల ఐక్యతే లక్ష్యమని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్‌కుమార్ మంగళవారం ఆప్ నేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాంలతో భేటీ అయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన సోమవారం దేశ రాజధానికి చేరుకోవడం తెలిసిందే. విపక్షాలన్నింటినీ ఒక్కతాటిపైకి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగానే వారితో సమావేశమైనట్టు అనంతరం నితీశ్ మీడియాకు తెలిపారు. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ప్రాంతీయ పార్టీలన్నీ కూడా ఏకమై విపక్షాల సమష్టి శక్తిని చాటాల్సిన సమయం వచ్చిందన్నారు. అనంతరం సమాజ్‌వాదీ నేత ములాయం సింగ్ యాదవ్, పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఐఎన్ఎల్‌డీ నేత ఓం ప్రకాశ్ చౌతాలా తదితరులను కూడా నితీశ్ కలిశారు. తనకు ప్రధాని కావాలని ఉందన్న వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. ''ఆ పదవికి నేను పోటీదారు కాను. దానిపై నాకు ఆసక్తీ లేదు'' అని చెప్పుకొచ్చారు. విపక్షాలన్నింటినీ ఏకం చేయడమే తమ తొలి అజెండా తప్ప ప్రధాని అభ్యర్థిని నిర్ణయించడం కాదని ఏచూరి చెప్పారు. ప్రధాని అభ్యర్థి ఎవరన్నది సమయం వచ్చినప్పుడు తేలుతుందన్నారు. బీజేపీపై పోరులో నితీశ్ కలిసి రావడం దేశ రాజకీయాలకు గొప్ప శుభ సంకేతమని అభిప్రాయపడ్డారు. నితీశ్, కేజ్రీవాల్ భేటీ గంటన్నర పాటు సాగింది. విద్య, వైద్యం తదితర అంశాలతో పాటు ఆపరేషన్ లోటస్, విపక్షాల ఎమ్మెల్యేల కొనుగోలు తదితరాలపై చర్చించినట్టు కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకోసం బీజేపీపై పోరాటానికి వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలు ఒక్కతాటిపైకి రావాల్సిన సమయం వచ్చిందని రాజా అన్నారు. సోమవారం రాహుల్‌గాంధీతోనూ నితీశ్ భేటీ కావడం తెలిసిందే.

25న 'బల ప్రదర్శన' ర్యాలీ

నితీశ్, కేసీఆర్, మమత హాజరు!

సెప్టెంబర్ 25న హరియాణాలో ఐఎన్ఎల్‌డీ తలపెట్టిన ర్యాలీని విపక్షాల బల ప్రదర్శనకు వేదికగా మార్చాలని నితీశ్ భావిస్తున్నారు. దానికి ఎన్సీపీ అధినేత శరద్ పవార్, అఖిలేశ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, అకాలీదళ్ నేత ప్రకాశ్‌సింగ్ బాదల్ తదితరులను ఐఎన్ఎల్‌డీ ఆహ్వానించింది. తెలంగాణ సీఎం కేసీఆర్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తదితరులకు కూడా ఆహ్వానాలు పంపుతామని పేర్కొంది. ఈ ర్యాలీలో విపక్ష నేతలంతా ఒకే వేదికపైకి వచ్చి పలు అంశాలపై లోతుగా చర్చిస్తారని చెప్పుకొచ్చింది. బీజేపీతో జనం విసిగిపోయారని చౌతాలా అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక వాతావరణం స్పష్టంగా కన్పిస్తోందని చెప్పారు.

విచ్ఛిన్న శక్తులపై ఉమ్మడి పోరు

- భారత్–బంగ్లాదేశ్ ప్రధానుల భేటీలో నిర్ణయం
- 25 ఏళ్ల తర్వాత నదీ జలాల పంపిణీపై ఒప్పందం
- బంగ్లా రైల్వేల అభివృద్ధికి భారత్ సాయం

న్యూఢిల్లీ: పరస్పర విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించే ఉగ్రవాద, ఛాందసవాద శక్తులను కలిసికట్టుగా ఎదుర్కోవాలని భారత్, బంగ్లాదేశ్ నిర్ణయించాయి. భారత్ పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో మంగళవారం ద్వైపాక్షిక చర్చల అనంతరం హైదరాబాద్ హౌస్‌లో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. 'ఉగ్రవాదం, ఛాందస వాదంపై పోరులో సహకరించుకోవాలని మేం నిర్ణయించాం. 1971 నాటి స్ఫూర్తిని సజీవంగా నిలుపుకునేందుకు రెండు దేశాల మధ్య కొనసాగుతున్న పరస్పర విశ్వాసానికి విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే శక్తులపై ఉమ్మడిగా పోరాడాలని అంగీకారానికి వచ్చాం' అని అన్నారు. రెండు దేశాలను కలుపుతూ ప్రవహించే 54 నదులపై ఆధారపడి కోట్లాదిమంది రెండు దేశాల ప్రజలు శతాబ్దాలుగా జీవిస్తున్నారని మోదీ వివరించారు. 'మైత్రి, సహకారభావం స్ఫూర్తితో రెండు దేశాలు ఎన్నో అంశాలను పరిష్కరించుకున్నాయి. తీస్తా నదీ జలాల పంపిణీ సహా అన్ని ప్రధాన సమస్యలపై త్వరలోనే అంగీకారం కుదురుతుందని ఆశిస్తున్నాను' అని ప్రధాని మోదీ



అన్నారు. బంగ్లాదేశ్‌తో సమగ్ర వాణిజ్య భాగస్వామ్య ఒప్పందం(సెపా)పై త్వరలోనే చర్చలు మొదలవుతాయని వెల్లడించారు. బంగ్లాదేశ్‌పై చైనా పలుకుబడి పెరిగిపోవడంపైనా ఇద్దరు నేతలు పూర్తిస్థాయిలో చర్చించారని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా చెప్పారు.

ఏడు ఒప్పందాలపై సంతకాలు

మోదీ, హసీనాల చర్చల అనంతరం రెండు దేశాల అధికారులు రైల్వేలు, అంతరిక్ష పరిజ్ఞానం, నదీ జలాల పంపిణీ, అనుసంధానతకు సంబంధించిన 7 ఒప్పందాలపై సంతకాలు చేశారు. వీటిలో కుషియారా నదీ జలాల ఒప్పందం కూడా ఉంది. దీనిద్వారా బంగ్లాదేశ్‌లోని సిల్హెట్, భారత్‌లో దక్షిణ అస్సాం లాభపడతాయి. 1996లో గంగా జలాల ఒప్పందం తర్వాత రెండు దేశాల మధ్య కుదిరిన నదీ జలాల ఒప్పందం ఇదే. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ అభ్యంతరాలతో 2011 నుంచి తీస్తా నదీ జలాల పంపిణీ వివాదం కొనసాగుతుండటంపై హసీనా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుదిరిన ఎంవోయూలు..

బంగ్లాదేశ్ రైల్వే ఉద్యోగులకు వివిధ అంశాల్లో శిక్షణ, ఐటీ సొల్యూషన్స్ భారత్ సమకూర్చుతుంది. బంగ్లాదేశ్ ప్రభుత్వ రోడ్లు, హైవేల శాఖకు భారత్ నిర్మాణ సామగ్రి, యంత్రాలను అందజేయనుంది. ఖుల్నా–దర్శన రైలు మార్గం ప్రాజెక్టులో ట్రాక్ డబ్లింగ్ పనుల్లోనూ, పర్బతీపూర్– కౌనియా రైలు మార్గాన్ని డబుల్ లైన్‌గా మార్చేందుకు భారత్ సాయం చేయనుంది. ఖుల్నాలోని రాంపాల్ వద్ద 1,320 మెగావాట్ల సూపర్ క్రిటికల్ బొగ్గు ఆధారిత ప్లాంట్ మైత్రి యూనిట్–1ను, ఖుల్నా–మోంగ్లా పోర్టు ప్రాజెక్టులోని 5.13 కిలోమీటర్ల రుప్షా రైలు వంతెనను ప్రారంభించారు.

షేక్ హసీనాకు ఘన స్వాగతం

బంగ్లా ప్రధాని షేక్ హసీనా నాలుగు రోజుల పర్యటనకు గాను సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్నారు. మంగళవారం రాష్ట్రపతి భవన్ వద్ద ప్రధాని మోదీ ఆమెకు స్వాగతం పలికారు. రెండు దేశాల మధ్య సంబంధాలకు సహకారం, పరస్పర విశ్వాసమే ప్రాతిపదిక అని ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. 'ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం, ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడమే ప్రధాన లక్ష్యం. మైత్రితో ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునని మా విశ్వాసం' అని హసీనా అన్నారు. అనంతరం హసీనా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో భేటీ అయ్యారు. రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మునికి పుష్పాంజలి ఘటించారు.

రేషన్ బియ్యం.. బెంజ్ కారులో

చండీగఢ్: కిలో రూ.2 చొప్పున నిరుపేదలకు చేరాల్సిన తిండిగింజలు బెంజ్ కారులో తిరిగే వాళ్ల చెంతకు చేరుతున్న వైనం పంజాబ్‌లో వెలుగుచూసింది. హోషియార్‌పూర్‌లో ఇటీవల తీసిన వీడియో ఒకటి రేషన్ కార్డు నకిలీ లబ్ధిదారుల అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చింది. హోషియార్‌పూర్‌లో ఒక రేషన్ షాపు ముందు ఖరీదైన మెర్సిడెజ్ బెంజ్ కారు రేషన్ దుకాణం ముందు ఆగింది. అందులోంచి దిగిన వ్యక్తి లోపలికెళ్లి రేషన్ కార్డు చూపించి బియ్యం, గోధుమ పిండి మూటలు తీసుకుని కారు డిక్కీలో వేసుకుని వెళ్లిపోయాడు. అతడు మాత్రం తాను పేదవాడినేనంటుండటం విశేషం. 'ఆ బెంజ్ మా బంధువులది. అమెరికా వెళ్తూ మా స్థలంలో పార్క్ చేసి వెళ్లారు. ఖాళీగా వదిలేస్తే పాడైపోతుందని అప్పుడప్పుడు తిప్పుతున్నాను. నా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారు' అన్నాడు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి లాల్ చంద్ ప్రకటించారు.



నేటి నుంచి కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర'

కన్యాకుమారి: కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర' బుధవారం కన్యాకుమారి నుంచి ప్రారంభం కానుంది. సుమారు 3,570 కిలోమీటర్ల మేర 12 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల మీదుగా సాగే యాత్రకు రాహుల్ గాంధీ నేతృత్వం వహించనున్నారు. యాత్ర ప్రారంభానికి ముందు శ్రీపెరంబుదూర్‌లో తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ స్మారకం వద్ద నివాళులర్పించనున్నారు. అనంతరం కన్యాకుమారిలో ర్యాలీని ప్రారంభిస్తారు. కార్యక్రమంలో తమిళనాడు సీఎం స్టాలిన్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ సీఎంలు అశోక్ గహ్లోత్, భూపేశ్ బఘేల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులు భారీగా పాల్గొంటారు. ఖాదీ జాతీయ జెండాను చేతబూని రాహుల్ తన యాత్రను ప్రారంభిస్తారు.



కన్యాకుమారిలో యాత్ర ప్రారంభ వేదిక

బెంగళూరులో వరద విలయం

- నీటిలోనే కాలనీలు, రహదారులు
- ట్రాక్టర్లలో ఆఫీసులకు ఐటీ ఉద్యోగులు



బెల్లందూర్‌లో జలమయమైన ఇంటెల్ ముఖద్వారం

బెంగళూరు: ఐటీ నగరి బెంగళూరును వరద కష్టాలు వదలడం లేదు. ఆదివారం రాత్రి నుంచి కురిసిన కుండపోతకే నగరం అల్లాడిపోగా మంగళవారం కూడా భారీ వర్షం కురవడంతో పరిస్థితి పులిమీద పుట్రలా మారింది. గత 42 సంవత్సరాల్లో ఎన్నడూ చూడనంతటి వర్షం కురవడంతో నగరంలో 164 చెరువులు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లన్నీ నీట మునిగాయి. జనజీవనం స్తంభించింది. ద్విచక్ర వాహనాలు, ఖరీదైన కార్లు వర్షార్పణం కావడంతో చివరికి రవాణాకు ట్రాక్టర్లు దిక్కయ్యాయి! ఎక్కడ చూసినా జనాన్ని తరలిస్తున్న ట్రాక్టర్లే దర్శనమిచ్చాయి. ఐటీ ఉద్యోగులు కూడా ట్రాక్టర్లలో ఆఫీసులకు వెళ్లారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థ అన్‌అకాడమీ వ్యవస్థాపకుడు గౌరవ్ ముంజల్ జలమయమైన తన నివాసం నుంచి ట్రాక్టర్‌లోనే కుటుంబీకులతో సహా సురక్షిత ప్రాంతానికి వెళ్లారు! స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. పరిస్థితిని త్వరలో చక్కదిద్దుతామని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాల వల్లే బెంగళూరులో ఇలాంటి సమస్యలని విమర్శించారు.

సోషల్ మీడియాలో జోకులు, విమర్శలు

కుండపోత వర్షంపై సోషల్ మీడియాలో నెటిజన్లు విపరీతంగా స్పందించారు. 'బెంగళూరు వెనిస్‌లా మారింది', 'నగరమే వాటర్ పార్క్‌గా మారినప్పుడు ఇక వండర్‌లా అవసరమా?', 'ఖరీదైన కార్లు నీళ్లలో ఈదులాడుతుంటే రవాణాకు ట్రాక్టర్లే దిక్కయ్యాయి' అంటూ పోస్టులు పెట్టారు. ముడుపుల పాలన అంటూ ఆగ్రహించారు.

కరెంట్ షాక్‌తో యువతి దుర్మరణం



వానలకు వరదమయంగా మారిన రోడ్డు ఓ యువతిని బలి తీసుకుంది. సోమవారం రాత్రి స్కూటీపై ఇంటికెళ్తున్న అఖిల అనే 23 ఏళ్ల యువతి నీళ్లలో పట్టుతప్పి పడబోయి డివైడర్ మధ్యలో ఉన్న అడ్వర్టైజ్‌మెంట్ బోర్డ్‌ను పట్టుకుంది. దాని కరెంట్ వైర్లు బయటకు ఉండటంతో షాక్‌తో కన్నుమూసింది. వృద్ధులైన తల్లిదండ్రులను, వికలాంగుడైన సోదరుడిని ఆమే పోషిస్తోంది!



బెల్లందూర్‌లో చేతికందిన సామాన్లతో వరద నీటి గుండా వెళ్తున్న జనం

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా


బుధవారం । 7 । సెప్టెంబర్ । 2022



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో జరిగే నిత్యాన్నదానానికి విజయవాడ గులాబీతోటకు చెందిన ఎ.కస్తూరి భాయి పేరిట ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



పవర్ లిఫ్టర్‌కు సన్మానం
చిలకలపూడి: ప్రపంచ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో రజత పతకం సాధించిన దోనె మురళీకృష్ణను కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మంగళవారం తన చాంబర్‌లో సన్మానించారు.



పులిచింతల నీటినిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో 38.6937 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 99,356 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 92,956 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

11న బాడీ బిల్డింగ్ పోటీలు
పెనమలూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో ఈ నెల 11వ తేదీన బాడీబిల్డింగ్ పోటీలు జరుగుతాయని జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, అధ్యక్ష, కార్యదర్శులు ఈదా రాజేష్, బత్తుల మనోహర్, తాళ్లూరి అశోక్ తెలిపారు. వారు ఈ వివరాలను కానూరులో మంగళవారం వెల్లడించారు. కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ ఫిట్‌నెస్ అసోసియేషన్, రోటరీ మిడ్ టౌన్ విజయవాడ, యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల బాడీబిల్డర్లు పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 86867 71358, 94943 99707 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

11న చెస్ పోటీలు
విజయవాడ స్పోర్ట్స్: పెనమలూరు మండలం పోరంకిలోని స్లేట్ స్కూల్‌లో ఈ నెల 11వ తేదీన జిల్లా స్థాయి అండర్-6, 8, 10, 12, 14, 16 బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తామని ఆర్గనైజర్ ఎస్.ఎం.ఫణి కుమార్ మంగళవారం తెలిపారు. బ్రెయిట్ మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రి, ఎస్‌ఆర్‌ఆర్ చెస్ కోచింగ్, స్పార్క్ చెస్ కోచింగ్ ఆకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి 12 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఆరు గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97007 75220, 94935 01506 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దాతలకు టీటీడీ సత్కారం



లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఏటా శ్రీవారి నిత్యాన్నదానానికి కూరగాయలు పంపిస్తున్న నగరానికి చెందిన మండవ కుటుంబరావు, ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం వారు సత్కరించారు. ఏటా తిరుమల శ్రీవారికి సేవా కార్యక్రమాలు నిర్వహించే వారిని సత్కరించడం టీటీడీకి అనవాయితీ. అందులో భాగంగా మంగళవారం తిరుమలలో పలువురిని సన్మానించారు. రాష్ట్రంలోనే తిరుమల నిత్యాన్నదానానికి అత్యధికంగా కూరగాయలు పంపించిన మండవ కుటుంబరావు, ఆయన కుమార్తె మండవ సస్య, అల్లుడు అరవపల్లి ఆదిత్యను ఈఓ ధర్మారెడ్డి ఘనంగా సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

సత్వరం దుర్గమ్మ సర్వదర్శనం

- కనకదుర్గనగర్‌లో ప్రసాదాల కౌంటర్లు
- మహా మండపం నుంచి వీఐపీలకు దర్శనం చేయించాలని నిర్ణయం
- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): సర్వ దర్శనం క్యూలైన్ ద్వారా సామాన్య భక్తులు గంటల వ్యవధిలోనే దుర్గమ్మను దర్శించుకునేలా దసరా ఉత్సవాల ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బ్రాహ్మణవీధిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది వీఐపీలను మహా మండపం ద్వారానే దర్శనానికి అనుమతించాలని నిర్ణయించామన్నారు. ఉత్సవాల తొలి మూడు రోజులు ట్రైల్ రన్‌గా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత పరిస్థితులను బట్టి మార్పులూ చేర్పులు ఉంటాయని వివరించారు. ఉత్సవాల్లో సేవలు అందించే వలంటీర్లకు క్యూర్ కోడ్‌తో ఐడీ కార్డులు అందజేస్తామని, నిర్ణీత సమయంలోనే వారిని ఆలయ పరిసరాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా, దుర్గగుడి అధికారులు మంగళవారం మరో మారు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారని పేర్కొన్నారు. అధికారుల సూచన మేరకు కనకదుర్గనగర్‌లోనే ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఉత్సవాల్లో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయాలని నిర్ణయించామని తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా

భక్తుల కోసం వసతులు

దసరా ఉత్సవాలకు విచ్చేసే భక్తులు కృష్ణా నదిలో దిగి స్నానాలు చేయకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని మంత్రి సత్యనారాయణ తెలిపారు. జల్లు స్నానాల కోసం 700 షవర్లను అందుబాటులో ఉంచుతామన్నారు. 300 టాయిలెట్లను సిద్ధం చేస్తామన్నారు. కేశ ఖండన శాలల్లో 600 మంది క్షురకులను నియమిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలపై నిరంతర పర్యవేక్షణకు వివిధ ప్రాంతాల్లో 330 సీసీ కెమెరాలు చేర్పాటుచేయాలని అధికారులను ఆదేశించామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

పరిమిత సంఖ్యలో ఉత్సవ కమిటీ

దసరా మహోత్సవాల నిర్వహణకు పరిమిత సంఖ్యలో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయనున్నామని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ఉత్సవాలకు కొద్ది రోజుల ముందే కమిటీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన
శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరిగే దసరా ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు తదితరులు మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. కనకదుర్గనగర్‌లో ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం అర్జున వీధి నుంచి ఇంద్రకీలాద్రిపైకి చేరుకున్నారు. వీఐపీలను మహా మండపం మీదగా కొండపైకి తీసుకురావడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులకు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పర్యటించి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చేపట్టాల్సిన చర్యలపై సుమారు గంట పాటు చర్చించారు. అనంతరం దేవదాయ శాఖ మంత్రి క్యాంప్ కార్యాలయానికి వెళ్లి, మంత్రితో చర్చించారు. పోలీసు, రెవెన్యూ శాఖల సూచనల మేరకు ఉత్సవాల ఏర్పాట్లలో చేయాల్సిన మార్పుల గురించి దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రమాకు వివరించారు.

యార్డుకు 37,679 బస్తాల మిర్చి రాక
కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 37,679 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి 35,511 బస్తాల విక్రయాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం మిర్చి క్వింటా ధర రూ.7 వేల నుంచి 26 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7 వేల నుంచి రూ.27 వేల వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాకు రూ.11,500 నుంచి రూ.27,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి రూ.26,800 వరకు ధర పలికింది. తాలు మిర్చికి రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు ధర లభించింది. యార్డులో ఇంకా 5,135 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి
సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి నాయకుల ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డిని కోరారు. గొల్లపూడిలోని ప్రజారోగ్య ప్రధాన కార్యాలయంలో మంగళవారం రామి రెడ్డిని నాయకులు కలిశారు. కాంటాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, యూరోపియన్ ఏఎన్ఎంలరే భరోసా కల్పించాలని విజ్ఞప్తిచేశారు. గ్రామస్థాయిలో పని చేస్తున్న ఏఎన్ఎంలకు బయోమెట్రిక్ హాజరును రద్దు చేయాలని, సీడీ-ఎన్‌సీడీ సర్వే, అనేక యాప్‌ల ద్వారా ఉద్యోగులు సతమతమవుతున్నారని వాటిని తగ్గించాలని విన్నవించారు. ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్న అనేక క్యాడర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, జీఓ 143ను సవరించాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చా నాగరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

బందరులో అభివృద్ధి కూత

- రూ.25 కోట్లతో రైల్వే స్టేషన్ నిర్మాణం
- సమకూరుతున్న ఆధునిక హంగులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మచిలీపట్నం ప్రజలు

మచిలీపట్నంటౌన్: స్థానిక రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు కూతపెడుతున్నాయి. బ్రిటీష్ పాలన నుంచి రైలు సౌకర్యం పొందిన మచిలీపట్నం స్టేషన్ ఆధునిక హంగులు సమకూర్చుకుంటోంది. దాదాపు రూ.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి, నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ప్రధాన భవనంతో పాటు రెండు ప్లాట్‌ఫారాలు, ఫుట్ బ్రిడ్జి నిర్మాణం, రైల్వే ట్రాక్‌ల అభివృద్ధి, ఎలక్ట్రికల్ పనులు చేపట్టారు. ప్రస్తుతం సివిల్ వర్క్‌లు పూర్తవగా ఎలక్ట్రికల్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి రైల్వేస్టేషన్‌ను ప్రారంభించేందుకు రైల్వే శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పెద్ద నగరాల రైల్వే స్టేషన్లకు దీటుగా దీనిని తీర్చిదిద్దుతున్నారు. 2020 నవంబర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న రైల్వేస్టేషన్ సమీపంలోని బందరుకోట రోడ్డు దాటి రైల్వేట్రాక్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ జాప్యం కావటంతో పనులు కూడా ఆలస్యమయ్యాయి.

1906లోనే రైల్వే స్టేషన్

మచిలీపట్నంలో రైల్వేవ్యవస్థ ప్రారంభంలో రాకపోకలు సాగించిన పాతరైల్వేస్టేషన్ స్థానంలోనే ప్రస్తుతం నూతన భవన నిర్మాణం చేపట్టారు. 1906లో బ్రిటీష్ పాలకులు పోర్టు సరుకుల రవాణా కోసం పెంకుటింట్లో రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం 1980లో పోర్టు రోడ్డు పక్కన ఉన్న ప్రాంతంలో రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దాదాపు 42 సంవత్సరాలుగా రైల్వే స్టేషన్ ఇదే ప్రాంతంలో కొనసాగుతోంది. పాత పెంకుటిల్లు స్టేషన్ ఉన్న ప్రాంతంలోనే నూతన భవనం నిర్మించారు. గతంలో ఈ ప్రాంతంలో గూడ్స్ రవాణా నిర్వహించే వారు. ప్రస్తుతం ఈ రైల్వేస్టేషన్ పనులు చివరి దశకు చేరాయి. పోర్టు రోడ్డుకు ఆవల నూతనంగా నిర్మించిన రైల్వేట్రాక్ వద్ద గూడ్స్ రవాణాకు సంబంధించి ఎగుమతి, దిగుమతి పనులు నిర్వహిస్తున్నారు.




ప్రారంభానికి సిద్ధమవుతున్న రైల్వేస్టేషన్



నిర్మాణం పూర్తిచేసుకున్న ఫుట్‌బ్రిడ్జి

సాగర్ జలాశయంలో 309 టీఎంసీలు
విజయపురిసౌత్ (మాచర్ల): నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.10 అడుగుల వద్ద ఉంది. ఇది 309.3588 టీఎంసీలకు సమానం. సాగర్ నుంచి కుడికాలువకు 10,700, ఎడమకాలు వకు 6,712, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 29,191, క్రస్ట్‌గేట్ల ద్వారా 64,048, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 1,12,851 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 1,12,851 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 884.50 అడుగుల వద్ద ఉంది. ఇది 212.8198 టీఎంసీలకు సమానం. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 64,392, రోజా నుంచి 50,064, హంద్రి నుంచి 117 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయానికి మొత్తం 1,14,573 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



రక్షిత తాగునీటి పనులను పూర్తిచేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నందిగామ నియోజకవర్గ ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు చేపట్టిన పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. ఈ పనుల ప్రగతిపై నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తన కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ కింద రూ.25.18 కోట్లతో 195 రక్షిత తాగునీటి పథకం పనులు మంజూరయ్యాయని, వీటిలో కొన్ని పనులు పూర్తవగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ప్రారంభం కాని వాటిపై సమీక్షించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పార్టీలకు అతీతంగా పనులను పూర్తి చేసి ప్రతి కుటుంబానికీ రక్షిత తాగు నీటిని సరఫరా చేయాలన్నదే ప్రధాన ధ్యేయమన్నారు. జగనన్న కాలనీల్లో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని కోరారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.5 లక్షల లోపు చేపట్టిన 91 పనుల్లో 28 పూర్తయ్యాయని, 29 పురోగతిలో ఉన్నాయని, మిగిలిన 34 పనులను ప్రారంభించాల్సి ఉందని వివరించారు. పరిటాల, మున్నలూరు, జి.మాధవరం, పొన్నవరం, వి.అన్నవరం, వెల్లంకి, జుజ్జూరు తదితర గ్రామాల్లో కంట్రాక్టర్లకు పనులను అప్పగించామన్నారు. మరో 11 గ్రామాల పనులను అప్పగించేలా వారం లోపు పంచాయతీ తీర్మానాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.40 లక్షల్లోపు చేపట్టిన 95 పనులకు సంబంధించి 16 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, కాంట్రాక్టర్‌కు అప్పగించామన్నారు. వీటిలో మూడు పనులు పూర్తయ్యాయని, లక్ష్మీపురం కొడవటికల్లు, కొత్తూరు, మునగాలపల్లి, లింగాలపాడు, పల్లగిరి పెద్దవరం, తక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. 55 పనులను ప్యాకేజీ పద్ధతిలో వారం లోపు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రూ.40 లక్షలకు పైబడిన 16 పనులకు మూడు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని తెలిపారు. మరో సారి టెండర్ల ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ డి.వి.రమణ, ఈఈ డి.ఆర్.ఎల్.ప్రసాద్, డీఈఈ రవికుమార్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

పోషకాహార లోపాలను నివారించాలి



చిన్నారికి పోషకాహారం అందిస్తున్న కృష్ణా కలెక్టర్ రంజిత్‌బాషా

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి (మచిలీపట్నం): మహిళలు, శిశువులు, గర్భిణుల్లో పోషకాహార లోపం, అనీమియా నివారణ వంటి కార్యక్రమాలతో సంపోషణ గ్రామాలు, వార్డులను తీర్చిదిద్దాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా కోరారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాసోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం 'సుపోషిత ఆంధ్రప్రదేశ్' జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. ఐసీడీఎస్ ద్వారా కిశోర బాలికలు, గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, పోషకాహార ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకూ హెల్త్ ఐడీ జారీ చేసి, ఎదిగో కొద్దీ వారి ఆరోగ్య స్థితిని యాప్ ద్వారా గమనిస్తూ అవసరమైన పోషకాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వివరించారు. ప్రతి గ్రామంలో నెలలో కనీసం ఒక రోజు ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు టీమ్‌లుగా ఏర్పడి గ్రామంలో జాబితాలు తయారు చేసుకుని రక్తహీనత, పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించాలని పేర్కొన్నారు. వారికి అవసరమైన పౌష్టిహారం, విటమిన్లు, ఐరన్ వంటి పోషకాలు అందించేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పోషణ్ అభియాన్ ద్వారా కిశోర బాలికలు, మహిళల్లో పోషకాహార లోపం, అనీమియా నివారణ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. తద్వారా మాతృ, శిశు మరణాలను తగ్గించటం, తక్కువ బరువుతో శిశువులు జన్మించడాన్ని నివారించే లక్ష్యాలతో కృషిచేస్తోందని పేర్కొన్నారు. అనంతరం వెల్ బేబీషో కార్యక్రమంలో గెలుపొందిన శిశువుల తల్లులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ, డీఎంహెచ్ఓ గీతాబాయి, డీఈఓ తాహెరా సుల్తానా, సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె.సరస్వతి, జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ ఎన్.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ముదిగొండ ఫణి దూర్జటి తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి ఆయన నైజం

- చెన్నుపాటి గాంధీపై గతంలోనే రౌడీషీట్
- కాంగ్రెస్, టీడీపీ పాలనలో 16 కేసుల నమోదు
- టీడీపీ పాలనలోనే రౌడీషీట్ ఎత్తివేత
- క్షణికావేశంలో జరిగిన దాడికి రాజకీయ రంగు
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దౌర్జన్యాలు, దాడులు, హత్యాయత్నాలు, పోలీసులపై తిరగబడటం వంటి 16 కేసుల్లో చెన్నుపాటి గాంధీ నిందితుడు. ఆయనపై గతంలోనే రౌడీషీట్ ఉంది. తమ పార్టీ నాయకుడు కావడంతో టీడీపీ అధికారంలోకి వచ్చాక రౌడీషీట్‌ను తొలగించారు. గాంధీపై క్షణికావేశంలో జరిగిన దాడికి చంద్రబాబు రాజకీయ రంగు పులిమి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాత నేరస్తుడే..

టీడీపీ నాయకుడు చెన్నుపాటి గాంధీ పాత నేరస్తుడు. ఆయనపై తీవ్ర నేరారోపణలు, కేసులు ఉన్నాయి. ఎన్నో ఘర్షణల్లో స్వయంగా పాల్గొనడంతో టీడీపీ, కాంగ్రెస్ పాలనా సమయాల్లో అతనిపై పలు కేసులు నమోదయ్యాయి. రాజకీయ ఆధిపత్యం, వ్యాపార వ్యవహారాల కోసం ప్రత్యర్థులతో ఘర్షణ పడటం, నోటిదురుసు ప్రదర్శించడం చెన్నుపాటి గాంధీ నైజమని స్థానికులు పేర్కొంటున్నారు. తరచూ వివాదాలు, ఘర్షణలకు కేంద్ర బిందువుగా నిలుస్తున్న అతనిపై 16 కేసులు నమోదయ్యాయి. విజయవాడ నగర పోలీసులు అతనిపై రౌడీషీట్ కూడా తెరిచారు. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ రౌడీషీట్ ఎత్తివేశారు. అతనిపై నమోదైన కేసుల్లో హత్యాయత్నం, దాడులు, దౌర్జన్యం, పోలీసులపై తిరగబడటం వంటివి ఉండటం గమనార్హం. ఇటీవల పటమట లంకలో పైపు లైను విషయంలో వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో చెన్నుపాటి గాంధీకి స్థానికంగా కొందరితో దీర్ఘకాలికంగా ఉన్న విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి.

స్వార్థ రాజకీయాల కోసమే..

అనుకోకుండా క్షణికావేశంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో చెన్నుపాటి గాంధీ కంటికి గాయమైంది. ఇది పూర్తిగా స్థానికంగా ఉన్న పాతకక్షలు, విభేదాలు, ఆధిపత్య పోరు నేపథ్యంలో తలెత్తిన ఘర్షణే. అయితే ఈ ఘర్షణకు రాజకీయ రంగు పులిమేందుకు టీడీపీ ప్రయత్నించడం విస్మయం కలిగిస్తోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆరోపణలు చేసేందుకు ఎలాంటి అవకాశాలు లేకపోవడంతో స్థానికంగా జరిగిన స్వల్ప ఘర్షణలను రాజకీయ లబ్ధికి వాడుకోవాలని చంద్రబాబు అండ్ కో కుట్ర పన్నిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గాంధీ సాత్వికుడని చంద్రబాబు స్వయంగా చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిచడంపై నగర ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చెన్నుపాటి నేరచరిత్ర తెలిసిన వారు టీడీపీ డ్రామాపై మండిపడుతున్నారు. విజయవాడలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకొంటున్నారు. చెన్నుపాటి గాంధీ తాజా ఘర్షణపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం చేతితో కొట్టడంవల్లే చెన్నుపాటి గాంధీ కంటికి గాయమైందని పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. అయితే చంద్రబాబు మాత్రం 'ఎంత మందిని కొడతారు? ఎంత మంది కళ్లు పొడుస్తారు?' అంటూ రాద్ధాంతం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మళ్లీ రౌడీ మూకలు పేట్రేగుతున్నాయని హంగామా చేస్తున్నారు. నీతి, నిజాయతీగా పనిచేసే వ్యక్తి చెన్నుపాటి గాంధీ అని, తాను విజయవాడను ప్రశాంతంగా మార్చానని చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడంపై నగర ప్రజలు విస్తుపోతున్నారు. ఐపీఎస్ అధికారిపై టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల దౌర్జన్యం, మహిళా అధికారులపై జరిగిన దాడులు, కాల్‌మని వేధింపులను గుర్తుచేసుకొంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

చిల్లర రాజకీయాలు చేస్తున్నారు : దేవినేని అవినాష్
రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు, టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ విమర్శించారు. నియోజకవర్గంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాను తూర్పు నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి టీడీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే గద్దె రామ్మోహన్ అసత్య ప్రచారాలు, కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో కాల్‌మనీ వేధింపులు, మహిళల సెక్స్ రాకెట్‌లో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడ్డంగా దొరికితే వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. ఇద్దరి మధ్య గొడవను పార్టీలకు అంటగట్టి, ఏ సంబంధం లేని తమపై ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టంచేశారు. గతంలో ఎవరూ చేయని విధంగా ఈ మూడేళ్లలో నూతన మెట్లు, మంచినీటి పైప్‌లైన్, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, పలువురు కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

గాంధీపై గతంలో నమోదైన కేసులు..

క్రైమ్ నంబర్	సంవత్సరం	నమోదైన సెక్షన్లు
152	1992	అండర్ సెక్షన్ 148, 302, 307 రెడ్‌విత్, 149 ఐపీసీ (ఇద్దరు వ్యక్తుల మర్డర్ కేసు)
204	2009	110 (ఈ) సీఆర్‌పీసీ
204	2009	110 (ఈ) సీఆర్‌పీసీ
221	2009	171-ఎఫ్, 188 ఐపీసీ
483	2010	427, 342, 448, 341, రెడ్‌విత్ 34 ఐపీసీ
359	2010	151 సీఆర్‌పీసీ
646	2010	151 సీఆర్‌పీసీ
617	2012	151 సీఆర్‌పీసీ
679	2012	151 సీఆర్‌పీసీ
989	2013	143, ఐపీసీ, 32పీఏ-1861, 290, 341 రెడ్‌విత్ ఐపీసీ
677	2013	143, 290, రెడ్‌విత్, 149 ఐపీసీ
178	2014	290,143, 149ఐపీసీ
319	2014	353, 509 రెడ్‌విత్, 34 ఐపీసీ
128	2015	380, 454, 149, 323 ఐపీసీ
922	2021	144, 148, 427, 341, 294-బీ, 506, 352, 188, 269, 270 రెడ్‌విత్ 148, ఐపీసీ, 3(1)(ఆర్), 3(1) (ఎస్), 3(2)(వీఏ) ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్టు
554	2021	151 సీఆర్‌పీసీ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డుపై గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిముక్కల మండలం అమీనాపురానికి చెందిన ఎం.రామారావు (55) బైక్ పై సోమవారం విజయవాడకు వస్తుండగా గంగూరు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతను అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని కుమారుడు శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాల కేంద్రంలో కార్యదర్శి చేతివాటం

పెడన : మండలంలోని జింజేరు గౌడపాలెంలోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘంలో రూ.2.92లక్షలకు పైగా గోల్‌మాల్ జరిగిందని పాల ఉత్పత్తిదారులు, సంఘ సభ్యులు ఆరోపించారు. మంగళవారం వీరు గ్రామంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు పెడన పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. సంఘ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాల కేంద్ర సహకార సంఘంలో కార్యదర్శిగా మోతుకూరి వరప్రసాద్‌ను సెక్రటరీగా రెండేళ్ల కాలపరిమితితో.. నెలకు రూ.7వేలు జీతానికి పెట్టుకున్నారు. ఆయన పాలు పోస్తున్న వారి పేర్లు కాకుండా పాలు పోయని వారి పేర్లను నమోదు చేస్తూ నగదు స్వాహా చేశాడు. దీంతో సభ్యులు తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై పెడన ఎస్‌ఐ మురళీ స్పందిస్తూ ఫిర్యాదు అందిందని.. పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని హామీనిచ్చారు.

మెడికల్ కళాశాల నిర్మాణం వేగవంతం

అధికారులకు కృష్ణా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): బందరులో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని కృష్ణా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. ఆయన మంగళవారం తన చాంబర్‌లో మెడికల్ కళాశాల నిర్మాణ ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి కళాశాల నిర్మాణం పూర్తి చేసి మెడికల్ విద్యార్థుల అడ్మిషన్ కోసం సిద్ధం చేయాలని ఆదేశించారు. రూ.550 కోట్లతో నిర్మాణం చేపట్టిన మెడికల్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం తన వంతు వాటాగా రూ.196 కోట్లు కేటాయించిందన్నారు. సివిల్ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, లెక్చరర్ హాల్స్ నిర్మాణ పనులను జూన్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. మెడికల్ కళాశాల గెస్ట్‌హౌస్ నిర్మాణం పూర్తికావచ్చిందని, బాలురు, బాలికల హాస్టల్ నిర్మాణం పురోగతిలో ఉందని ఏపీఎస్ఎంఐడీసీ ఎస్ఈ అంకమ్మచౌదరి కలెక్టర్‌కు వివరించారు.

డిసెంబర్‌లో రానున్న మెడికల్ కౌన్సిల్ బృందం..

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాస్పత్రిని వైద్య కళాశాలకు అనుబంధంగా మార్పు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఆ నిధులతో ఓపీడీ బ్లాక్, డయాగ్నోస్టిక్ బ్లాక్, హాస్పిటల్ సర్వీసెస్ బ్లాక్ తదితర నిర్మాణాలు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. కొత్తగా నియమితులైన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయకుమారి మాట్లాడుతూ డిసెంబరులో నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృంద సభ్యులు ప్రభుత్వాస్పత్రి, మెడికల్ కళాశాలను పరిశీలించేందుకు వస్తారని తెలిపారు. అక్టోబరు నెలాఖరులోగా కళాశాల లెక్చరర్లు, సిబ్బందిని నియమిస్తామని చెప్పారు.

రుణాలు సత్వరమే మంజూరు చేయండి

బ్యాంకర్లకు కృష్ణా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో టిడ్కో గృహాలు కేటాయించిన లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కృష్ణా కలెక్టర్ పి. రంజిత్‌బాషా బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో టిడ్కో, మునిసిపల్ కమిషనర్లు బ్యాంకర్లతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ప్రాంతాల్లో ఉన్న టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. వయసు పైబడిన లబ్ధిదారుల కుటుంబ సభ్యుల పేర్లు దరఖాస్తుదారులుగా స్వీకరించి రుణాలు మంజూరు చేయాలన్నారు. గుడివాడలో వచ్చే డిసెంబరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా టిడ్కో గృహాల ప్రారంభోత్సవం ఉంటుందని ఈలోగా లబ్ధిదారులందరూ రుణాలు మంజూరు చేయాలన్నారు. రుణాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు త్వరితగతిన రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో టిడ్కో ప్రాజెక్టు ఆఫీసర్ చిన్నోడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయిరాం, ఆర్డీవోలు ఐ. కిషోర్, బి. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వెబ్‌సైట్‌తో 'క్రిప్టో' వల

- దివిసీమ కేంద్రంగా 70 మంది నుంచి రూ.82.59 లక్షల వసూలు
- పులిగడ్డ వద్ద ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఖమ్మం, పటమటల్లోనూ నిందితుడిపై పలు కేసులు
- మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఖాదర్‌బాషా


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఖాదర్‌బాషా, సీఐలు

అవనిగడ్డ: యూకే ట్రస్ట్ వాలెట్ క్రిప్టో కరెన్సీ పేరుతో దివిసీమ కేంద్రంగా 70 మంది బాధితుల నుంచి లక్షలాది రూపాయలు కట్టించుకుని మోసం చేసిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ ఖాదర్‌బాషా తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

అధిక లాభాల ఆశ చూపి..

విజయవాడకు చెందిన సిద్ధంశెట్టి ఆనంద్ కిశోర్, గుడివాడకు చెందిన మత్తి నరేష్, అవనిగడ్డకు చెందిన మానేపల్లి జగదీష్, తుంగలవారిపాలెంకు చెందిన తుంగల లక్ష్మీ నరసయ్యతో పాటు మరికొంతమంది కలసి అవనిగడ్డ ఏరియా ప్రాంతానికి చెందిన 70 మందితో రూ.82.59లక్షలను క్రిప్టో కరెన్సీ పేరుతో కట్టించుకున్నారు. లాగిన్ ఐడీ కోసం ఒక్కొక్కరూ రూ. 3.75లక్షలు కట్టాల్సి ఉండగా.. బాధితరులు ఇద్దరు ముగ్గురు కలిసి ఆ మొత్తాన్ని చెల్లించారు. ఇలా లాగిన్ ఐడీ పొందినందుకు గానూ ప్రోత్సాహకంగా ప్రతిరోజూ రూ.7వేలు చొప్పున 200 రోజులపాటు వారి ఖాతాలకు డబ్బులు జమ చేస్తామని నమ్మబలికారు. అంతే కాక కొత్త సభ్యుడిని చేరిస్తే రూ.30వేలు, ఇద్దరిని చేరిస్తే రూ.90వేలు చొప్పున కమీషన్ ఇస్తామని మాయమాటలు చెప్పి వీరి నుంచి డబ్బులు కట్టించుకున్నారు. బిజినెస్ పెంచుకోవడం కోసం బాధితులకు అప్పుడప్పుడు రూ.25.90లక్షల వరకూ తిరిగి చెల్లించారు. ఈ కేసులో ఉన్న నిందితులు ఢిల్లీలో ఇమిటేషన్ వెబ్‌సైట్‌ని తయారు చేయించి దీని ద్వారా బాధితులను నమ్మించారు.

ఎస్పీకి ఫిర్యాదుతో వెలుగులోకి..

అవనిగడ్డ మండల పరిధిలోని తుంగలవారిపాలెంకు చెందిన భోగిరెడ్డి నాగేశ్వరరావు మరి కొంతమంది క్రిప్టో కరెన్సీ మోసంపై ఇటీవలే జిల్లా ఎస్పీ జాషువాకు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో అవనిగడ్డ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాహనాల తనిఖీల్లో భాగంగా మోపిదేవి వార్పు వైపు నుంచి అవనిగడ్డకు కారులో వస్తున్న సిద్ధంశెట్టి ఆనంద్ కిశోర్‌ని పులిగడ్డ జంక్షన్ వద్ద సీఐ శ్రీనివాస్ అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఇతని వద్ద నుంచి ఐడీలు వేయడానికి ఉపయోగించిన ల్యాప్‌టాప్, పలు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మోసపోవద్దు..

డబుల్, ట్రిపుల్ వస్తున్నాయని చెప్పి ఎవరూ మల్టీలెవల్ మార్కెటింగ్ మాడ్యూల్స్‌లో డబ్బులు కట్టి మోసపోవద్దని డీఎస్పీ ఖాదర్‌బాషా హెచ్చరించారు. మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ కేసుని ఛేదించిన సీఐలు శ్రీనివాస్, రవికుమార్, సహకరించిన ఐటీ కోర్ ఎస్ఐ దీపికతో పలువురు కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.

మరో రెండు కేసుల్లో నిందితుడు..

గతంలో ఖమ్మం జిల్లాలో ఇలాగే క్రిప్టో కరెన్సీ పేరుతో పలువురిని మోసం చేయగా అక్కడ కూడా నిందితుడు ఆనంద కిశోర్‌పై కేసు నమోదైంది. అలాగే ప్లాస్టిక్ గ్యాస్ సిలిండర్స్ ఏజెన్సీ ఇప్పిస్తామని చెప్పి 2018లో విజయవాడకు చెందిన తిరుమలశెట్టి నాగశ్రీనివాసరావు నుంచి రూ.5లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లోనూ కేసు నమోదైంది.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

పమిడిముక్కల: మండలంలోని చోరగుడి గ్రామంలో పురుగుల మందు తాగిన ఓ యువకుడు విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. చోరగుడికి చెందిన పామర్తి మోహన జగదీష్(21) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ తల్లితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తండ్రి గతంలోనే చనిపోగా.. ఏడాది క్రితం వివాహం చేసుకున్న భార్య.. అతని తాగుడు అలవాటును భరించలేక ఆరు నెలల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన జగదీష్ తన ఇంటి వద్ద పురుగుమందు తాగడంతో చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి అన్నయ్య హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఐఎంఏ భవన నిర్మాణానికి రూ.13 లక్షలు విరాళం


న్యాయమూర్తి బట్టు దేవానంద్ చేతుల మీదుగా విరాళం అందజేస్తున్న దృశ్యం

గుడివాడ టౌన్: స్థానిక సత్యనారాయణపురంలో నిర్మిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) భవన నిర్మాణానికి ఐఎంఏ పూర్వ అధ్యక్షులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ కుటుంబసభ్యులు రూ.13 లక్షలు విరాళం అందజేశారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు ఫంక్షన్ హాలులో డీఆర్‌కే ప్రసాద్ ప్రథమ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఈ వితరణను హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ చేతుల మీదుగా ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్‌లకు అందజేశారు.

పిల్లల గుండె ఆపరేషన్‌లకు రూ.10లక్షలు


సీపీ టి.కె. రాణా చేతుల మీదుగా రూ.10 లక్షలు అందిస్తున్న సోమరాజు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రా హాస్పిటల్ మదర్ అండ్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల ఉచిత గుండె సర్జరీలకు గాను తమ వంతుగా మంతెన వెంకట రామరాజు వసుధ ఫౌండేషన్ రూ.10 లక్షల విరాళం అందజేసింది. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్స్‌లో మంగళవారం జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా చేతుల మీదుగా ఆంధ్రా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రమణమూర్తికి ఫౌండేషన్ ప్రతినిధి సోమరాజు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఆంధ్రా హాస్పిటల్ చిల్డ్రన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏడేళ్లుగా 2,700 మంది పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయడం, వారిలో ఎంతో మందికి ఉచితంగా చేసినందుకు కృతజ్ఞతతో ఈ చెక్కుని అందజేసినట్లు తెలిపారు. ఐదేళ్లలో తమ ఫౌండేషన్ రూ.40 లక్షలు సహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.వి.రామారావు, డాక్టర్ జె.శ్రీమన్నారాయణ, డాక్టర్ దిలీప్, డాక్టర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెన్సీ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): పర్యాటకశాఖ ద్వారా ఎక్సలెన్సీ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని పర్యాటక, సాంస్కృతికశాఖ జిల్లా అధికారి ఫణి దూర్జటి మంగళవారం తెలిపారు. ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ హోటల్, వంటకాలు, ఎకో టూరిజం, బెస్ట్ ఎయిర్‌పోర్టు, రూరల్ టూరిజం, స్టార్‌హోటల్, బడ్జెట్ హోటల్ వంటి 40 విభాగాలలో అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10వ తేదీలోగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, 5వ అంతస్తు, ఆటోనగర్, విజయవాడ అడ్రస్‌కు పంపాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9121144099లో సంప్రదించాలన్నారు.

పోషక లోపాలకు చెక్ పెడదాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


వాల్ పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో చేపట్టిన పోషణ్ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేసి పౌష్టికాహార లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. స్త్రీ, శిశు సంక్షేమ ఆధ్వర్యంలో జిల్లాలో నెల రోజుల పాటు నిర్వహించనున్న పోషణ్ మహా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావు విడుదల చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు నెల రోజులపాటు జిల్లాలో అంగన్‌వాడీ ప్రాజెక్టు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, సచివాలయ స్థాయిలలో పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత, పరిశుభ్రత, సంపూర్ణ పోషణ, పౌష్టికాహారంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. తద్వారా జిల్లాను పౌష్టికాహార లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్, డీఆర్వో కె. మోహన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, సీడీపీవోలు జి.మంగమ్మ, టి. నాగమణి, సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

25న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు



రాష్ట్ర స్థాయి చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: అండర్–8, 10, 12, 14 బాలబాలికల రాష్ట్ర స్థాయి చెస్ పోటీలను ఈ నెల 25వ తేదీన విజయవాడ గురునానక్ కాలనీలోని గేట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ది విజయవాడ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. రాజీవ్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గేట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో రోటరీ మిడ్ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు మాగంటి కృష్ణప్రభు, కేఎస్ఎన్ బాబు, చీఫ్ అడ్వైజర్ టి. కిషోర్‌బాబు, యూత్ సర్వీసెస్ చైర్మన్ బి. దేవకుమార్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ ది విజయవాడ చెస్ అసోసియేషన్, విజయవాడ రోటరీ మిట్ టౌన్, యూత్ సర్వీసెస్ ఆఫ్ మంత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రత్యేక ప్రతిభ కనబర్చిన క్రీడాకారుడికి రూ. 55,555 బహుమతిని అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందస్తుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9030308811లో సంప్రదించాలని కోరారు.

ఐదుగురు బైక్ దొంగలు అరెస్ట్

27 బైక్‌లు స్వాధీనం



ఐదుగురు నిందితులను మీడియా ముందు హాజరు పరిచిన ఏసీపీ రవికిరణ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చెడు వ్యసనాలకు బానిసై, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను గవర్నర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 27 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశం సెంట్రల్ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు.

సాంకేతిక సాయంతో..

ఈ ఏడాది మే నెలలో హనుమాన్ పేటలో ఓ వ్యక్తి నుంచి మొబైల్ ఫోన్ లాక్కెళ్లిన ఘటనపై గవర్నర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు కగ్గ ఆంజనేయులు(వలివేరు), చొప్పవరపు వెంకటేష్(వలివేరు), మన్నవ సాయి వంశీ(అంగలకుదురు), ఖిరోది భాను ప్రకాష్ (అంగలకుదురు), గౌస్ ఖాన్ గౌస్(చుండూరు) అనే ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మొబైల్ ఫోన్లు, బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైందని రవికిరణ్ తెలిపారు. వీరంతా జట్టుగా ఏర్పడి పొన్నూరు, గుంటూరు, గుడివాడ, తణుకు, విజయవాడతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని నేలకొండపల్లి, కోదాడలలో మోటార్ సైకిల్ దొంగతనాలు చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. వారి వద్ద నుంచి 27 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని ఆయన అభినందించారు. గవర్నర్‌పేట పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ డి. సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య


విజయశేఖర్ (ఫైల్)

పెద్దాపురం(వీరులపాడు): అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన బొజ్జా విజయశేఖర్ (45) ఈ ఏడాది నాలుగెకరాలలో మొక్కజొన్న, రెండెకరాలలో పత్తి పంట సాగు చేశాడు. మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోవటంతో మనస్తాపం చెంది సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విజయశేఖర్ ఇంటిలోని పురుగు మందు తాగి వాంతులు చేసుకుంటుండగా.. చుట్టుపక్కల వారు గమనించి కంచికచర్ల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నందిగామ ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆరు ఎకరాలలో పంట సాగు చేశాడని, సాగులో తీవ్ర నష్టం రావటంతో పాటు గ్రామంలోని సొసైటీలో రూ. 10 లక్షల అప్పుందని మృతుని భార్య రాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

పరామర్శించిన నాయకులు..

ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

క్లుప్తంగా

నేడు 38వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం 38వ డివిజన్ 113వ వార్డు సచివాలయం పరిధిలోని రథం సెంటర్ కెనరా బ్యాంక్ నుంచి ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభిస్తారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జ్‌లు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

హనుమత్ గణపతి



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): బాలగణపతి.. హన్‌మత్ గణపతిగా భక్తులకు కనువిందు చేశారు. పాతబస్తీలోని పూజారి వారి వీధిలో కొలువై ఉన్న శ్రీ బాలగణపతి ఆలయంలో చవితి ఉత్సవాల్లో భాగంగా హనుమత్ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి సన్నిధిలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సహస్ర నామార్చన, మహానివేదన కార్యక్రమాలు చేశారు. సాయంత్రం సహస్ర మోదక పూజను ఉభయదాతలు నిర్వహించారు. శివపార్వతుల తేజస్సు హనుమత్ గణపతి స్వరూపాలను ఒకే రూపంలో చూసిన భక్తులు తన్మయత్వం చెందారు. సాయంత్రం గద్దం రామమోహనరావు ఆధ్వర్యంలో 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు పారాయణం చేశారు. అక్కరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యాన అమ్మవారి సంకీర్తన వీనుల విందుగా సాగింది.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో రమా సహిత, వినాయకుని దేవస్థానంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈవో హేమలతాదేవి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

– కొత్తపేట కోమల విలాస్ సెంటర్‌లో జరుగుతున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా శ్రీశైలం దేవస్థాన ధర్మకర్త గురుమహంతు మహేష్ ఆధ్వర్యాన లక్ష్మీ గణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు మరుపిళ్ల రాజేష్, నాయకులు నాగోతి చంద్రశేఖర్, తోత్తడి భరత్ బయన కుమార్, పత్తి సాయికుమార్, పోతిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'కిడ్నీ' బాధితుడికి పెన్షన్



కిడ్నీ వ్యాధి బాధితుడికి పెన్షన్ అందిస్తున్న కార్పొరేటర్ అప్పాజీరావు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : కిడ్నీ బాధితుడికి మంగళవారం 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవు అప్పాజీరావు పెన్షన్ అందించారు. వన్‌టౌన్ గులాంమొహియుద్దీన్ వీధిలోని నివసిస్తున్న ఈది వెంకటస్వామికి కిడ్నీ సమస్య రావడంతో ఆయనకు డయాలసిస్ చేయాల్సి వస్తోంది. దీనికోసం ఆయన ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా పది వేల పెన్షన్ మంజూరైంది. ప్రతి నెలా ప్రభుత్వం నుంచి పది వేల పెన్షన్ ఆ కుటుంబానికి అందనుంది. తొలి పింఛన్‌ను అప్పాజీరావు ఆ కుటుంబం వద్దకు వెళ్లి అందించారు. కార్యక్రమంలో స్థానిక సచివాలయం వెల్ఫేర్ అడ్మిన్ శ్రీకాంత్, వలంటీర్ డేవిడ్, పార్టీ నేత రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో వ్యాపారుల సంతోషం

37వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపార వర్గాలు సుఖంగా ఉన్నాయని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 37వ డివిజన్ 185వ సచివాలయం పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ బృందం పర్యటించింది. సామరంగ్ చౌక్ నుంచి ప్రారంభమైన నాయకుల బృందం కందులవారి వీధి, పులిపాటివారి వీధి, భావనారాయణ వీధి మీదుగా ముందుకు సాగింది. వెలంపల్లి గడప గడపకు వెళ్లి ప్రజలకు మూడేళ్ల పాలనలో ప్రభుత్వ పరంగా అందిన సంక్షేమ పథకాల వివరాలు తెలియజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెలంపల్లి మాట్లాడుతూ 37వ డివిజన్‌లో అత్యధిక ప్రాంతం వాణిజ్య ప్రాంతంగా ఉందన్నారు. డివిజన్‌లో కొన్ని రోడ్లు అభివృద్ధి చేయాలన్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. చిన్నపాటి నీటి సమస్యలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, వాటిని త్వరగా పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇస్తున్నారని వివరించారు. ప్రతిపక్ష కుటుంబాలకు సైతం అర్హత ఉంటే పథకాలను అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు.

అభివృద్ధిని ఓర్వలేక కుట్రలు

రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ ఓర్వలేక పోతున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని వారు నిప్పులు కక్కుతున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు మాటలను ప్రజలు పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలుకుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు జిలానీ, గ్రంధి రమేష్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులు తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గురువుల పాత్ర కీలకం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు చిట్టూరి ఆనందరామ సుధాకర్ అన్నారు. కొత్తపేట హిందూ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్న ఉపాధ్యాయులకు, ఇతర గురువులకు సత్కారం చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన మ్యాథ్స్ ఉపాధ్యాయులు ఆనంద కుమార్, డ్రాయింగ్, ఎన్‌సీసీ అధికారి బీ బ్రహ్మేశ్వరరావులకు రూ.20 వేల నగదు అందజేశారు. ఇక గత విద్యా సంవత్సరం నూటికి నూరుశాతం ఫలితాలు సాధించిన ఎం సువర్ణకుమార్, ఏ జయశ్రీ, జీ పురుషోత్తం, వీ అరుణకుమారిలకు 20వేలు బహుమతిగా అందజేశారు. ప్రథమ కార్యదర్శి కె.ఎల్.వి. మోహనరావు, కోశాధికారి బాబా విజయ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగినా వారి మూలాలు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆనందకుమార్‌ను సత్కరిస్తున్న పాలకవర్గం

మర్చిపోకూడదన్నారు. గురుశిష్యుల అనుబంధం చాలా గొప్పదన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల ప్రతినిధి రాజశేఖర్, సీనియర్ ఉపాధ్యాయులు సోము భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేరువతో సైబర్ నేరాలపై అవగాహన

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): చేరువ ద్వారా నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో మంగళవారం చేరువ వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఓటీపీ, ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంక్ ఏటీఎం కార్డు వివరాలను గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్ ద్వారా గానీ, మెసేజ్ రూపంలో చెప్పకూడదనే అంశాలను చిన్న చిన్న వీడియోల రూపంలో వివరించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యువకుల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలనే అంశాలను వీడియోల రూపంలో వివరించారు. చిన్నారులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏంటి అనే విషయాల అవ



చేరవ వాహనం ద్వారా అవగాహన వీడియోలు చూస్తున్న జక్కంపూడి వాసులు

గహన కల్పించారు. కార్యక్రమంలో దిశా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అర్జమ్మ, కొత్తపేట ఎస్‌ఐ శేఖర్ బాబు, ఎస్‌ఈబీ ఎస్‌ఐ వంశీరాం పాల్గొన్నారు.

మహిళా పోలీసులు నిఘా ఉంచాలి

సెబ్ జాయింట్ డైరెక్టర్ మోకా సత్తిబాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంలో వార్డు మహిళా పోలీసులు కీలకంగా వ్యవహరించాలని సెబ్ జాయింట్ డైరెక్టర్ మోకా సత్తిబాబు అన్నారు. సీతారాంపురంలోని సెబ్ విజయవాడ వెస్ట్ స్టేషన్‌లో మంగళవారం వార్డు మహిళ పోలీసులతో సమావేశం నిర్వహించారు.

మాదక ద్రవ్యాలు, గంజాయి, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యం, సారాయి వంటి నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వార్డు మహిళా పోలీసులు మాదక ద్రవ్యాల అక్రమ రవాణా చేసే వారి సమాచారాన్ని సెబ్,



వార్డు మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సెబ్ జాయింట్ డైరెక్టర్ మోకా సత్తిబాబు

పోలీసులకు అందించాలన్నారు. సమావేశంలో ఏఈఎస్ డి.ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి, సత్యనారాయణపురం, నున్న, అజిత్‌సింగ్‌నగర్ స్టేషన్ల పరిధిలోని వార్డు మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గుణదల (విజయవాడ తూర్పు): యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆకాంక్షించారు. గుణదల గంగిరెద్దుల దిబ్బ కమ్యూనిటీ హాల్లో మంగళవారం యువ పారిశ్రామికవేత్త ఇంటి ప్రదీప్‌ను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం యువత బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని తెలిపారు. దేశ విదేశాల్లో మంచి ఉద్యోగాలు చేస్తూ ప్రగతి సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. దీనికి భిన్నంగా నగరానికి చెందిన ప్రదీప్ లక్ష రూపాయల జీతం వచ్చే ఉద్యోగాన్ని విడిచివ్యవసాయ రంగం వైపు అడుగు వేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా పౌల్ట్రీ రంగంలో అత్యంత ఖరీదైన కడకనాథ్ బ్రీడ్ ఎంచుకుని వ్యాపారాన్ని ప్రారంభించారని తెలిపారు. ఎన్నో వ్యయ ప్రయాసలు తట్టుకుని ప్రస్తుతం ఏపీలోని అన్ని గ్రామాల్లో పౌల్ట్రీ రంగాన్ని కొత్త కోణంలో తీర్చిదిద్దారని పేర్కొ



ప్రదీప్‌ను సత్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్, తదితరులు

న్నారు. ప్రదీప్ శ్రమకు ఫలితంగా గ్లోబల్ స్కాలర్స్ ఫౌండేషన్ సంస్థ ఆయనకు భారతీయ రత్న–2022 అవార్డును ప్రకటించిందని గుర్తు చేశారు. అనంతరం ప్రదీప్ దంపతులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మూడో డివిజన్ కార్పొరేటర్ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఆక్వారంగంలో ఎన్నో అవకాశాలు

ప్రొఫెసర్ పద్మావతి

పటమట(విజయవాడ తూర్పు) : ఆక్వా రంగంలో ఎన్నో నూతన అవకాశాలు ఉన్నాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ పద్మావతి అన్నారు. స్టెల్లా కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యాన మంగళవారం కళాశాల్లో రీసెంట్ యండ్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్ ప్రాక్టీసెస్ ఇన్ ఇండియా అంశంపై సదస్సు నిర్వహించారు. ఆమె విద్యార్థులకు పలు అంశాలు వివరించారు. పరదేశీ చేపల పెంపకం, కొల్లేరు నీటి కలుషిత చేయడం, పంట దిగుబడి తగ్గించడం చేస్తుందని తెలిపారు. టాక్సిక్ మెటీరియల్స్‌ను తొలగించి మంచిలాభాలను పొందవచ్చని, టిలిఫియా చేపలు 8 నెలల్లో చేపలు పెరుగదల ఉంటుందని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఈ చేపలు ఎగుమతుల్లో కూడా లాభాలు తెస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల జువాలజీ విభాగం అధిపతి డాక్టర్ జీవ ప్రద, కళాశాల అధ్యాపక బృందం, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత దత్తక్రియ యోగ శిక్షణ

పటమట(విజయవాడ తూర్పు): సెంట్రల్ నియోజకవర్గంలోని లోటస్‌ల్యాండ్‌మార్క్ వద్ద గణపతి సచ్చిదానంద దత్తపీఠం ఆధ్వర్యంలో ఉచిత దత్తక్రియ యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు దత్తక్రియ యోగ సీనియర్ బోధకులు దంతలూరి తిరుపతి రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, వివరాలకు 9866041332లో సంప్రదించాలని సూచించారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని, ఈ క్రమంలో చట్టాలను పటిష్టంగా అమలయ్యేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. టుబాకో కంట్రోల్ ప్రోగ్రామ్ అమలులో భాగంగా సిద్ధార్థ వైద్య కళాశాలలో మంగళవారం పొగాకు ఉత్పత్తులు, వాటితో కలిగే దుష్పరిణామాలు, అమలులో ఉన్న చట్టాలపై వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులతో ఎదురయ్యే దుష్పరిణామాలపై భావి వైద్యులుగా వైద్య విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. పొగాకు నియంత్రణ చట్టాలు పటిష్టంగా అమలుకావడానికి కృషి చేయాలని కోరారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో లంగ్ క్యాన్సర్, నోరు, గొంతు క్యాన్సర్, గుండె జబ్బులు, రక్తపోటు, క్షయ వంటి అనేక వ్యాధులు సంక్రమిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా టుబాకో శిక్షణ కార్యక్రమం అధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ నాయక్, క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): స్థానిక హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా ప్రాంతంలో నివసిస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు షేక్ ఖాదర్ షరీఫ్ వైద్య ఖర్చుల నిమిత్తం ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆంధ్ర హాస్పటల్ ఐసీయూలో చికిత్స పొందుతున్న ఖాదర్ షరీఫ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న వెలంపల్లి మంగళవారం హాస్పటల్‌కు వెళ్లి డాక్టర్‌తో మాట్లాడి అతని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. షరీఫ్ తల్లి జరీనాకు ధైర్యం చెబుతూ తక్షణ సాయం కింద రూ.50 వేలు అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజా, 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, దర్గా కమిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్, అబ్దుల్ రెహమాన్, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ అభ్యున్నతికి కృషి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఏపీ ఎడిటర్స్ అండ్ రిపోర్టర్స్ సంఘ ప్రధాన న్యాయసలహాదారుడిగా నరహరిశెట్టి శ్రీహరిని ఎంపిక చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు చొప్పరపు సాంబశివనాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన సదస్సులో మంత్రి రమేష్ నుంచి నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. సంఘ అభ్యున్నతికి కృషి చేస్తానని శ్రీహరి తెలిపారు.

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): విద్యుత్ శాఖ అధికారులు గృహాలు, వాణిజ్య సముదాయాల్లో మంగళవారం తనిఖీలు చేశారు. కృష్ణలంక సెక్షన్ పరిధిలో 84 మంది సభ్యులు 42 బృందాలుగా విడిపోయి కృష్ణలంకలోని భ్రమరాంభపురం, హైస్కూల్ రోడ్డు, శంకరమఠం రోడ్డు, సత్యంగారిదొడ్డి, రాణిగారితోట తదితర ప్రాంతాల్లోని గృహాలు, వాణిజ్య విద్యుత్ సర్వీసులు తనిఖీ చేశారు. 2973 గృహ సర్వీసులు, 134 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేసి వాటిలో కొన్ని సర్వీసుల ద్వారా అదనపు లోడ్ వాడుతున్నట్లు గుర్తించారు. అదనపు లోడ్‌కు సంబంధించి రూ.6.6 లక్షల అపరాధ రుసుం విధించినట్లు విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. తనిఖీల్లో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీధర్, విజిలెన్స్ అధికారి బి.నవీన్, అసిస్టెంట్ ఇంజినీర్ జె.కృష్ణారెడ్డి, ఏఈలు, ఫోర్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసీ అధ్యాపకురాలికి ఆర్‌ఎల్ నికొరే అవార్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న దేవినేని జ్యోతిర్మయికి ప్రతిష్టాత్మకమైన ఆర్‌ఎల్ నికొరే అవార్డు లభించింది. మైసూర్‌లోని జేఎస్‌ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విశ్వవిద్యాలయంలో సోమవారం రాత్రి అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ మౌన్టు కుమార్ పటేల్, ఏపీటీఐ ప్రెసిడెంట్ డాక్టర్ ఉమేకర్‌ల నుంచి జ్యోతిర్మయి అవార్డు, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఆమె గైడెన్స్‌లో చేసిన బి ఫార్మసీ ప్రాజెక్ట్ వర్క్ రీసెర్చ్ పబ్లికేషన్స్ ఇండియన్ జనరల్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐజేపీఈఆర్)లో ప్రచురితమైంది. ఇది అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ జనరల్స్‌గా



అవార్డు అందుకుంటున్న జ్యోతిర్మయి

ఎంపికై నందుకు అవార్డు ప్రదానం చేశారు. ఆమె హైదరాబాద్‌లోని హిటిక ఫార్మాస్యుటికల్స్‌కు కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్నారు. సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత ఇతర అధ్యాపకులు అభినందించారు.

జాతీయ రహదారులను శుభ్రంగా ఉంచాలి

పటమట(విజయవాడ తూర్పు): జాతీయ రహదారి వెంట రోడ్ల మార్జిన్లలో చెత్త, వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు రోడ్డుకు రెండువైపులా పలు ప్రాంతాలను పరిశీలించారు. జాతీయ రహదారి నిరంతరం శుభ్రంగా ఉండాలని, వర్షం నీరు నిల్వ ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, రోడ్డు మార్జిన్లు, డివైడర్లు పచ్చదనంతో ఆకర్షణీయంగా ఉండాలని చెప్పారు. గ్రీనరీ పనులు గతంలో సీఆర్‌డీఏ పర్యవేక్షణలో జరిగేదని, ప్రస్తుతం ఈ పనిని వీఎంసీ చేపట్టిందని, జాతీయ రహదారి వెంబడి కుండీల్లో పాడైన మొక్కలను



జాతీయ రహదారి వెంట పర్యటిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ సిటీప్లానర్ జుబెన్ శిరస్‌రాయ్, ఈఈ ఏఎస్‌ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించండి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): బిల్కిస్ బానో అత్యాచార నేరస్తులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడం సిగ్గుచేటని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ అన్నారు. ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నేరస్తులను విడుదల చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో ధర్నా చేశారు. దుర్గాంబ మాట్లాడుతూ అత్యాచార నేరస్తులకు ఇప్పటి వరకూ శిక్ష పడకపోగా వారిని విడుదల చేయడం సరికాదని హితవు పలికారు. 2002 అల్లర్ల సమయంలో పలువురు సామూహిక అత్యాచారానికి తెగబడ్డారని, ఆ కేసులో 11 మంది నిందితులుగా ఉన్నారన్నారు. బాధితురాలు తనకు జరిగిన ఘోరంపై పోరాటం చేసినా ఫలితం దక్కకుండా పోయిందన్నారు. ప్రధాని మోదీ ఒకవైపు స్వాతంత్ర్య వేడుకల్లో మహిళలకు అండగా ఉంటామని చెబుతునే ఇలా దౌర్జన్యాలకు మద్దతు పలకడం



నెహ్రూబొమ్మ సెంటర్‌లో ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

దుర్మార్గమన్నారు. 20 ఏళ్లుగా శిక్ష పడకపోగా వారిని విడుదల చేయడం ఏ చట్టంలో ఉందని ప్రశ్నించారు. ఇప్పటికైనా 11 మంది నిందితులను వెంటనే శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు భారతి, సభ్యులు తమ్మిన దుర్గా, దుర్గాసి రమణమ్మ, పడాల తవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి పాతశివాలయంలో దసరా మహోత్సవాలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో ఈ నెల 26 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకూ దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.హేమలతాదేవి తెలిపారు. ఉత్సవాల కరపత్రాన్ని ఆలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దసరాల్లో అమ్మవారికి విశేష అలంకారాలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



కరపత్రాన్ని ఆవిష్కరించిన ఈవో హేమలతాదేవి

● టెన్షన్..'అట్కిన్‌సన్' జంక్షన్..!



గొల్లపూడి బైపాస్ రహదారిపై ఉన్న అట్కిన్‌సన్ స్కూల్ జంక్షన్ పేరు చెబితేనే అందరికీ టెన్షనే. ఇక్కడ విశాలమైన ఫోర్ లైన్ల రోడ్డు కావడంతో వాహనచోదకులు దూసుకుపోతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు ఉండకపోవడం, వాహనచోదకులు ముందుకు వెళ్లాలనే తొందరలో నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

–భవానీపురం(విజయవాడ పశ్చిమ)

షి'కారు' వెనుక డీలర్లతో డీల్!

- ఎస్సీ కార్పొరేషన్ నిధులు పరాయి పాలు
- ముందుగానే రూ.365.67 కోట్లు చెల్లింపులు
- ఆ మేరకు వాహనాలు లేవు.. డబ్బులూ తిరిగివ్వరు
- నాలుగేళ్లుగా రూ.67.67 కోట్లు డీలర్ల వద్దే
- తిరిగి వసూలుకు అధికార యంత్రాంగం సన్నద్ధం

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో ఎస్సీ యువతకు ఉపాధి పేరుతో కేటాయించిన వాహనాలు, యంత్రాలను పక్కదారి పట్టించిన వ్యవహారంలో తవ్వేకొద్దీ విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. నిరుద్యోగ ఎస్సీలకు దక్కాల్సిన కార్లను టీడీపీ ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నేతలు కాజేసినట్లు ఇటీవల విజిలెన్స్ నిగ్గుతేల్చిన సంగతి తెలిసిందే. టీడీపీ పెద్దల సిఫారసు ఉన్నవారికే వాహనాలు ఇచ్చేలా ముందస్తు ఒప్పందాలు జరిగాయి. ఎస్సీ కార్పొరేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ వారికి లబ్ధి చేకూర్చారు. ఇదిలా ఉండగా వాహనాలు సరఫరా చేసే డీలర్లతో టీడీపీ పెద్దలు కుదుర్చుకున్న డీల్ తాజాగా బహిర్గతమైంది. నిబంధనలకు విరుద్ధంగా ఇండెంట్ పెట్టిన వాహనాలన్నింటికీ డీలర్లకు ముందుగానే అడ్వాన్సులు చెల్లించారు. అయితే డీలర్లు ఆ మేరకు వాహనాలను సరఫరా చేయలేదు. ఏళ్ల తరబడి వాహనాలు ఇవ్వకుండా, ప్రభుత్వానికి నగదు తిరిగి చెల్లించకుండా డీలర్ల వద్దే డబ్బులు ఉండటాన్ని గమనిస్తే బినామీల బాగోతం, అక్రమ వ్యవహారాలు తేటతెల్లమవుతున్నాయి.

ఎస్సీలకు ఉపాధి పేరుతో టీడీపీ సర్కారు నిర్వాకాలు



సబ్సిడీ రుణాలంటూ గొప్పలు..

ఎస్సీ యువతకు ఉపాధి కోసం వాహనాలు / యంత్రాలు సమకూర్చి సబ్సిడీ రుణాలు ఇచ్చినట్లు గత సర్కారు గొప్పలు చెప్పుకుంది. నేషనల్ షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ), నేషనల్ సఫాయి కర్మచారీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) ద్వారా వివిధ పథకాల కింద 2017–18 నుంచి 2018–19 వరకు సబ్సిడీపై వాహనాల కోసం రూ.వందల కోట్ల నిధులు కేటాయించారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నేతలకే లబ్ధి చేకూర్చేలా గత సర్కారు పెద్దలు డీలర్లతో గుట్టు చాటుగా వ్యవహారాన్ని నడిపించారు.

ఐదు పథకాలు.. పథకం ప్రకారం!

వాహనాలు అందకుండానే గత సర్కారు డీలర్లకు ముందే చెల్లింపులు జరపడం అక్రమాలను బలపరుస్తోంది. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ద్వారా ఐదు పథకాల కింద లబ్ధిదారులకు ఇన్నోవాలు, ఇతియోస్, ట్రాక్టర్లు, ఈ ఆటోలు, మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు(ఎండీసీఎం) ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇందుకోసం టీడీపీ సర్కారు డీలర్లకు రూ.365,67,29,910 అడ్వాన్సులుగా చెల్లించింది. ఆ మొత్తంలో రూ.298,00,01,285 విలువైన యూనిట్లను డీలర్లు సరఫరా చేశారు. మరో 5,467 యూనిట్లు (వాహనాలు, యంత్రాలు) ఇవ్వకపోవడంతో డీలర్ల వద్దే రూ.67,67,28,625 మేర డబ్బులు ఉండిపోవడం గమనార్హం. ఇందులో రూ.23.05 కోట్లకుపైగా ఇవ్వాల్సిన రాధా మాధవ్ ఆటోమొబైల్ ప్రైవేట్ లిమిటెడ్ (విజయవాడ) ఇటీవల బోర్డు తిప్పేసింది. మరో మూడు కంపెనీల పేరుతో తప్పుడు చిరునామా ఇచ్చారు. వాహనాలు ఇవ్వకుండా ముఖం చాటేసిన సదరు డీలర్ ఏకంగా రూ.41.67 కోట్లకు పైగా ఎగ్గొట్టేందుకు దారులు వెతుకుతున్నాడు. మరో కంపెనీ పేరుతో అడ్వాన్సులు తీసుకున్న ఓ మహిళ నుంచి రూ.2.93 కోట్లు వసూలు చేసేందుకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఎన్ని నోటీసులు పంపినా స్పందన లేదు.

డీలర్ల నుంచి రాబట్టేందుకు సన్నద్ధం

టీడీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు పొందిన డీలర్లు ఆ మేరకు వాహనాలు ఇవ్వకపోవడం, అడ్వాన్సులు తిరిగి వెనక్కు చెల్లించకపోవటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన దాదాపు రూ.67.67 కోట్లు నాలుగేళ్లుగా డీలర్ల వద్దే ఉండటంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. కొద్ది రోజుల క్రితం ఆయా డీలర్లతో సమావేశం నిర్వహించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఒప్పందం ప్రకారం వాహనాలు ఇవ్వాలని లేదంటే డబ్బులైనా తిరిగి చెల్లించాలని స్పష్టం చేశారు. అయితే అప్పటి ధరల ప్రకారం వాహనాలు ఇవ్వలేమని, పెరిగిన ధరల ప్రకారం తీసుకునేందుకు అంగీకరిస్తే పరిశీలిస్తామని రాధా మాధవ్ ఆటోమొబైల్ ప్రైవేట్ లిమిటెడ్(విజయవాడ) ప్రతినిధులు పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు మూడు కంపెనీల పేరుతో ప్రకాశం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి అడ్వాన్సులు తీసుకుని చేతులెత్తేయడంతో అతడితో తమకు సంబంధం లేదని ఆయా కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక మహిళ కూడా తప్పించుకుని తిరుగుతోంది. దీంతో మరోసారి ఆ డీలర్లను పిలిచి మాట్లాడాలని, అప్పటికీ దారికి రాకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఏ డీలర్.. ఎంతంటే?

డీలర్: రాధా మాధవ్ ఆటోమొబైల్ ప్రైవేట్ లిమిటెడ్ (విజయవాడ)
పథకం: ఎన్ఎస్ఎఫ్‌డీసీ స్కీమ్
ఆర్డర్ ఇచ్చిన వాహనాలు: 1,647 (ఇన్నోవాలు 1,061- ఇతియోస్ 588)
సరఫరా చేసినవి: 1,417 వాహనాలు
ఇంకా ఎన్ని ఇవ్వాలి?: 230 వాహనాలు
డీలర్‌కు చెల్లించిన మొత్తం: రూ.221,64,87,589
వాహనాల వ్యయం: రూ.198,59,54,411
డీలర్ దగ్గర ఉండిపోయిన మొత్తం: రూ.23,05,33,178

డీలర్: వేంకటేశ్వర ట్రేడర్స్, తాడేపల్లి, గుంటూరు జిల్లా
సప్లయర్: కెనెటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ (పుణె)
పథకం: ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ స్కీమ్
వాహనం పేరు: ఇ-వెహికిల్స్ (పవర్ ఆటోలు)
ఆర్డర్ ఇచ్చిన వాహనాలు: 7,500
డీలర్ అందచేసినవి: 2,550
ఇంకా ఇవ్వాల్సినవి: 4,950
ముందుగా చెల్లించిన మొత్తం రూ.77,91,34,321
వాహనాల వ్యయం : రూ.57,98,78,874
డీలర్ వద్ద మిగిలిపోయిన మొత్తం: రూ.19,92,55,447

డీలర్: ఈగల్ అగ్రీ ఎక్విప్‌మెంట్, కావలి, నెల్లూరు జిల్లా
పథకం: ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ స్కీమ్
వాహనం: ట్రాక్టర్లు
మంజూరైన ట్రాక్టర్లు: 660
డీలర్ అందచేసినవి: 451
ఇంకా ఇవ్వాల్సినవి: 209
డీలర్‌కు చెల్లించిన మొత్తం: రూ.38.87 కోట్లు
ట్రాక్టర్ల వ్యయం: రూ.26.56 కోట్లు
డీలర్ వద్దే మిగిలిపోయిన మొత్తం రూ.12.31కోట్లు

డీలర్: ఈగల్ అగ్రీ ఎక్విప్‌మెంట్, కావలి, నెల్లూరు జిల్లా
పథకం: ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ స్కీమ్
వాహనం: మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు (ఎండీసీఎం)
ఆర్డర్ ఇచ్చిన మిషన్లు: 280
సరఫరా చేసినవి: 209
ఇంకా ఇవ్వాల్సినవి: 71
డీలర్‌కు చెల్లించిన మొత్తం: రూ.23.72 కోట్లు
మిషన్ల వ్యయం: రూ.14.27 కోట్లు
డీలర్ వద్ద ఉండిపోయిన మొత్తం: రూ.9.45కోట్లు

డీలర్: ఎంట్రాన్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీపశ్చిమ గోదావరి జిల్లా
పథకం: ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ స్కీమ్
వాహనం/యంత్రం: మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు (ఎండీసీఎం)
మంజూరు చేసినవి: 15 **ఇచ్చినవి:** 6
ఇంకా ఇవ్వాల్సినవి: 9
డీలర్‌కు చెల్లించిన మొత్తం: రూ.3,52,08,000
యంత్రాల వ్యయం: రూ.58,68,000
ఇంకా డీలర్ వద్దే మిగిలిపోయిన మొత్తం: రూ.2,93,40,000

నారాయణ, లింగమనేనికి ముందస్తు బెయిల్

దేశం విడిచి వెళ్లరాదని హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి : అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై ఇటీవల సీఐడీ నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్న మాజీమంత్రి పొంగూరు నారాయణ, వ్యాపారవేత్త లింగమనేని రమేశ్, అతని సోదరుడు లింగమనేని వెంకటసూర్య రాజశేఖర్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ డైరెక్టర్ కేపీవీ అంజనీకుమార్‌లకు హైకోర్టు ఊరటనిచ్చింది. సీఐడీ నమోదు చేసిన కేసులో వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కానీ, కొన్ని షరతులు విధించింది. ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు దేశంలోనే ఉండాలని నిందితులను హైకోర్టు ఆదేశించింది. ఒకవేళ దేశం విడిచి వెళ్లాలంటే సంబంధిత కోర్టు అనుమతి తీసుకోవాలని వారికి స్పష్టంచేసింది. రూ.50వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం తీర్పు వెలువరించారు.

ఆళ్ల ఫిర్యాదు.. సీఐడీ కేసు..

అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ డిజైన్ల మార్పు ముసుగులో భారీ భూ దోపిడీ జరిగిందంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మాజీ సీఎం చంద్రబాబునాయుడు, మాజీమంత్రి పొంగూరు నారాయణ, వ్యాపారవేత్త లింగమనేని రమేశ్, అతని సోదరుడు లింగమనేని వెంకటసూర్య రాజశేఖర్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ డైరెక్టర్ కేపీవీ అంజనీకుమార్ తదితరులపై సీఐడీ ఈ ఏడాది మే 9న కేసు నమోదు చేసింది. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ నారాయణ, లింగమనేని సోదరుడు, అంజనీకుమార్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి జూన్ 17కు తీర్పును వాయిదా వేశారు. తీర్పు రిజర్వ్ చేసిన రెండున్నర నెలల తరువాత న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

దేవదాయ శాఖ ట్రిబ్యునల్ సభ్యురాలిగా పద్మ

సాక్షి, అమరావతి : దేవదాయ శాఖ ట్రిబ్యునల్ సభ్యురాలిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్లు లేదా ఆమెకు 65 ఏళ్లు నిండే వరకు, ఏది ముందు అయితే అప్పటి వరకు పద్మ ట్రిబ్యునల్ సభ్యురాలిగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె గతంలో దేవదాయ శాఖ కమిషనర్‌గా పనిచేశారు.

కొత్త విత్తన వంగడాలు విడుదల

రైతులకు లాభసాటిగా ఉంటాయంటున్న శాస్త్రవేత్తలు


నంద్యాల (అర్బన్) : నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్తలు కొత్త రకాల విత్తనాలను విడుదల చేశారు. ఎన్‌బీఈజీ 776 శనగ రకం, ఎస్ఐఏ 3159 మహానంది కొర్ర రకాలను మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏడీఆర్ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు డా.జయలక్ష్మి, రమాదేవి, మంజునాథ్, చైతన్యల ఆధ్వర్యంలో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, జయలక్ష్మి మాట్లాడుతూ.. నూతన వంగడాలను రాష్ట్రవ్యాప్తంగా సాగుచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిఫార్సులను అనుసరించి విడుదల చేశామన్నారు. ఆర్ఏఆర్ఎస్ నుండి ఇప్పటికే ఏడు రకాల శనగ విత్తనాలను విడుదల చేశామన్నారు. యంత్రంతో కోసేందుకు అనువైన నూతన ఎన్‌బీఈజీ 776 రకానికి చెందిన 100 గింజల బరువు 25–26 గ్రాములు ఉంటుందన్నారు. దీని పంటకాలం 90–105 రోజులని, ఎకరాకు 7–8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని.. 1, 2 తడులు పెడితే 10–12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఎండతెగులునూ తట్టుకుంటుందన్నారు.

ట్రిపుల్ ఐటీ పిలుస్తోంది

- దరఖాస్తు చేసుకోండి ఇలా
- ఈనెల 19 వరకు గడువు
- 29న ఎంపిక జాబితా విడుదల

గుర్తుంచుకోవాల్సిన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు	సెప్టెంబర్ 19
అర్హుల జాబితా విడుదల	సెప్టెంబర్ 29
కౌన్సెలింగ్ తేదీలు	అక్టోబరు 12 నుంచి 15 వరకు
తరగతులు ప్రారంభం	అక్టోబరు 17



ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీ ముఖ ద్వారం

సత్తెనపల్లి: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల బీటెక్ సమీకృత ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఇటీవలే నోటిఫికేషన్ విడుదలైంది. ఒక్కో సెంటర్‌లో 1100 సీట్లు (ఈడబ్ల్యూఎస్ కింద వంద సీట్లు అదనం) అందుబాటులో ఉన్నాయి. గతనెల 30 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. పదో తరగతిలో మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. నూజివీడు, ఇడుపులపాయలోని సీట్లలో 85 శాతం సీట్లు స్థానికంగా, మిగిలిన 15 శాతం సీట్లను మెరిట్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఈ-మెయిల్, మొబైల్‌కు సమాచారం ఇస్తారు.

రిజర్వేషన్లు ఇలా..

వర్గం	శాతం
ఎస్సీ	15
ఎస్టీ	6
బీసీ-ఏ	7
బీసీ-బీ	10
బీసీ-సీ	1
బీసీ డీ	7
బీసీ-ఈ	4
వికలాంగులు	3
సైనిక కోటా	2
ఎన్‌సీసీ	1
స్పోర్ట్స్	0.5
బాలికలు	33.33

కౌన్సెలింగ్‌లో సమర్పించాల్సినవి

కౌన్సెలింగ్ సమయంలో విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించినప్పుడు ఇచ్చిన రశీదు, పదో తరగతి హాల్ టికెట్, మార్కులలిస్టు, రెసిడెన్స్ సర్టిఫికెట్, సంబంధిత రిజర్వేషన్ల ధ్రువీకరణపత్రాలు సమర్పించాలి.

అర్హతలు

- అభ్యర్థులు ప్రథమ ప్రయత్నంలోనే 2022లో ఎస్ఎస్‌సీ, తత్సమాన పరీక్షలో రెగ్యులర్ విద్యార్థిగా ఉత్తీర్ణులై ఉండాలి.
- ఈ ఏడాది సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన వారూ రెగ్యులర్‌గానే ప్రభుత్వం ప్రకటించినందున వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు ఇలా..

- ఏపీ ఆన్‌లైన్ సెంటర్ ద్వారా ఆర్జీయూకేటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు రుసుము రూ. 250, ఎస్సీ, ఎస్టీలు రూ. 150 చెల్లించాలి.
- రశీదును జాగ్రత్తగా పెట్టుకోవాలి, సర్వీసు చార్జి కింద ఆన్‌లైన్ సెంటర్‌కు అదనంగా రూ.25లు చెల్లించాలి.

ఫీజుల వివరాలు

- రాష్ట్రంలోని పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ట్యూషన్ ఫీజు కింద పీయూసీ-1, పీయూసీ-2లకు ఏడాదికి రూ.45వేలు, ఇంజినీరింగ్ నాలుగు సంవత్సరాలకు ఏడాదికి రూ.50వేలు చొప్పున చెల్లించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులు చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజు ఏడాదికి రూ.1.50 లక్షలు చెల్లించాలి
- ఎన్నారై, అంతర్జాతీయ విద్యార్థులు అయితే ఏడాదికి రూ.3 లక్షలు ట్యూషన్ ఫీజు చెల్లించాలి.

కోర్సులు

పీయూసీ : గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఇంగ్లిషు, తెలుగు, ఐటీ, బయాలజీ సబ్జెక్టులు ఉంటాయి.
ఇంజినీరింగ్ : కెమికల్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్ ఇంజినీరింగ్ (ఈ రెండు నూజివీడు, ఇడుపులపాయలో మాత్రమే ఉన్నాయి). సివిల్, సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ బ్రాంచ్‌లు.

నాన్‌స్టాప్ కిక్స్.. గిన్నిస్ రికార్డు బ్రేక్

17 మంది అవనిగడ్డ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు


గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన విద్యార్థులతో అకాడమీ నిర్వాహకులు ఈశ్వర్, విశ్వ

అవనిగడ్డ: స్థానిక ఈశ్వర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన 17 మంది విద్యార్థులు కిక్ బాక్సింగ్‌లోని ఫేస్‌లెవల్ నాన్‌స్టాప్ కిక్స్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినట్టు అకాడమీ నిర్వాహకుడు ఈశ్వర్ తెలిపారు. మూడు నెలల క్రితం స్థానిక అకాడమీ వద్ద మూడు వీడియో కెమెరాల సహాయంతో నాన్‌స్టాప్ కిక్స్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ వీడియోలను లండన్‌లోని గిన్నిస్‌బుక్ ప్రతినిధులకు పంపించగా.. వీటిని పరిశీలించి ఈశ్వర్ అకాడమీకి చెందిన 17 మంది గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించినట్టు ప్రకటించారన్నారు. ఈ మేరకు లండన్ నుంచి ధ్రువీకరణ పత్రాలు, సర్టిఫికెట్లను మంగళవారం అకాడమీకి పంపించారని పేర్కొన్నారు. ఒక్కొక్కరు 23 నిముషాల్లో రెండు వేలకు పైగా నాన్‌స్టాప్ కిక్‌లు కొట్టి రికార్డు సృష్టించారని వివరించారు. గతంలో 23 నిముషాలకు 1600 కిక్స్ రికార్డు ఉండేదని.. దీనిని బ్రేక్ చేయడంతో ఈ ఘనత సాధించినట్టు ఈశ్వర్ తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

అధికారులతో ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్యాధికారులు, సిబ్బంది తమ విధులను అంకితభావంతో నిర్వర్తిస్తూ, సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులతో మంగళవారం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రికాషనరీ డోసులు, సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రగతిపై చర్చించారు. వైద్యులు, అధికారులు నిబద్ధతతో సేవలు అందించాలన్నారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ ద్రావణం పంపిణీని సక్రమంగా నిర్వహించాలన్నారు.

నేటి నుంచి 'స్వచ్ఛ వాతావరణం' కార్యక్రమం..

రాష్ట్రీయ బాల, శిశు కార్యక్రమం జిల్లా సమన్వయాధికారి డాక్టర్ మాధవి మాట్లాడుతూ 3వ అంతర్జాతీయ స్వచ్ఛ వాతావరణం దినోత్సవంలో భాగంగా సెప్టెంబరు 7 నుంచి 10 వరకూ పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలు, పోలీస్ స్టేషన్‌ల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ అంచనాలు రూపొందించండి

కంకిపాడు: డ్రైనేజీ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు అవసరమైన అంచనాలను రూపొందించి నివేదిక ఇవ్వాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కంకిపాడు పట్టణంలోని పాత జాతీయ రహదారి వెంబడి డ్రైనేజీ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే పార్థసారథి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో జేసీ మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. వర్షం వస్తే మురుగు రోడ్లపై నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పూర్తి స్థాయిలో పరిష్కారానికి అంచనాలు రూపొందించాలని జేసీ మహేష్‌కుమార్ ఆదేశించారు.

ఈ-క్రాప్ క్షేత్రస్థాయి పరిశీలన..

మండలంలోని పునాదిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను జేసీ మహేష్‌కుమార్ రావిరాల పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరణ, ఈ క్రాప్ నమోదు అంశాలను స్వయంగా తనిఖీ చేశారు. ఈ-క్రాప్ నమోదులో సాంకేతిక సమస్యలపై తహసీల్దార్ టి.వి.సతీష్, ఏవో పి.ఎం.కిరణ్, స్థానిక రైతులతో చర్చించారు. పంట దిగుబడులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ కె.చైతన్య పాల్గొన్నారు.

ఫొటో షూట్ పేరుతో చోరీలు

- జల్సాల కోసం కెమెరాలు, కార్లు, మొబైళ్ల దొంగతనాలు
- నిందితుడి నుంచి రూ.12 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: వెడ్డింగ్ ఫొటో షూట్ తీయాలంటూ నమ్మించి కెమెరాలు దొంగిలించే ఘరానా దొంగను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.12 లక్షల సొత్తును రికవరీ చేశారు. అతడిని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వివరాలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. గుంటూరులోని డొంకరోడ్డుకు చెందిన షేక్ సుభానీ ఫొటో, వీడియో కెమెరాలను అద్దెకు ఇస్తుంటాడు. అతనికి మే 19న కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన దారా పాల్ విజయ్‌రాజ్ అలియాస్ విజయ్ ఫోన్‌చేసి కెమెరాలు అద్దెకు కావాలని అడిగాడు. ప్రీ వెడ్డింగ్ షూట్ ఉందని, బాపట్ల జిల్లా చీరాల మండలంలోని ఓడరేవులో తీయాలని నమ్మించాడు. దీంతో సుభానీ ఒప్పుకున్నాడు. మే 22 తెల్లవారుజామున 3 గంటలకు కారులో వచ్చి ఓడరేవు వెళ్లాలని ఎక్కించుకున్నాడు. ఉదయం 5.30 గంటలకు ఓడరేవు సమీపంలోకి రాగానే వాటర్‌బాటిల్ తీసుకురావాలని సుభానీని కారులో నుంచి కిందికి దింపి ఉడాయించాడు. కారులో రూ.12 లక్షల విలువ చేసే కెమెరాలు ఉన్నాయి. దీంతో బాధితుడు మే 22న ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తరచూ దొంగతనాలు

కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. విజయ్ గతంలోనూ ఇలాగే దొంగతనాలకు పాల్పడ్డాడని గుర్తించారు. పెళ్లి కొడుకు వేషంలో వెళ్లి ఫొటో షూట్ తీయాలంటూ నమ్మించి చాలా మందిని బురిడీ కొట్టించాడని తెలుసుకున్నారు. ప్రీ వెడ్డింగ్ కోసమని తీసుకొచ్చిన కారు కూడా అద్దెదేనని, దాని నంబర్‌ప్లేట్ కూడా మార్చాడని పోలీసులు నిర్ధారించారు. విజయ్‌ను ఈనెల 5న పోలీసులు వలపన్ని చీరాలలోని బస్టాండ్ వద్ద అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి కారు, మొబైల్ ఫోన్లు, రూ.12 లక్షల విలువచేసే కెమెరాలను రికవరీ చేశారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

'కత్తికన్నా మాటకు పదునెక్కువ' అంటారు.
సన్నిహిత సంబంధాలలో ముఖ్యంగా భార్యాభర్తల బంధంలో
'మాట'ను మించిన ఆయుధం లేదు.
ఒక్క మాటతో తమకు తామే బంధం మధ్య ఇనుప గోడగా మారచ్చు.
చట్టం గృహహింసను మాత్రమే నేరంగా పరిగణించినప్పటికీ
మానసిక దాడి అంతకుమించిన పరిణామాలకే దారితీస్తుందని,
బంధాల నడుమ ఇది అత్యంత ప్రమాదకరం అంటున్నారు మనస్తత్వ నిపుణులు.
కోవిడ్ సమయం నుంచి కుటుంబ బంధాలలో పెరుగుతున్న
మానసిక దాడి గురించి .. నియంత్రించుకోదగ్గ ఆవశ్యకతను
నొక్కి చెబుతున్నారు నిపుణులు.

ఆయుధం

మాటతో మానసిక దాడి?!



'ది రోల్ ఆఫ్ జెండర్ అండ్ ఏజ్ 2020 అధ్యయనం ప్రకారం గృహహింసలో శారీరక దాడికి సమానమైన భావోద్వేగ దుర్వినియోగం తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తుంది.

■ జోక్ చేస్తున్నామా...

భాగస్వామిని జోక్‌గా ఓ మాట అనాలనుకోవచ్చు. కానీ, జోక్స్ కూడా కొన్నిసార్లు చెడు పరిమాణాలకు దారి తీయవచ్చు. ఉదాహరణకు.. 'ఎందుకంతగా తింటావు.. ఇప్పటికే ఏనుగులా అయ్యావు. ఇంకెంతవుతావు' ఇలాంటి రకరకాల వ్యంగ్య వ్యాఖ్యలు సాధారణంగా భాగస్వామి ప్రవర్తనను నియంత్రించడానికి సంకేతంగా వాడుతారు.

■ ప్రమాదకరమే!

శారీరక లేదా లైంగిక హింసను అనుభవించిన వారి కంటే మానసికంగా బాధింపబడిన వ్యక్తులు తీవ్ర నిరాశ, ఆందోళన, ఒత్తిడి, కించపరిచిన వ్యక్తిత్వానికి గురవుతున్నారని తెలిసింది. దీనివల్ల డిప్రెషన్ బారిన పడుతున్నవారి సంఖ్య కూడా పెరుగుతోందంటున్నారు మానసిక నిపుణులు. వయసు ప్రకారంగా చూస్తే బాల్యంలో మానసికంగా గాయపడిన వారిలో చాలా కాలం పాటు ఈ లక్షణాలు ఉంటాయని అధ్యయనం వెల్లడించింది. యవ్వనంలో చాలా మంది వ్యక్తుల ప్రవర్తనపై బాల్యం ముద్ర అలాగే ఉండిపోయింది. లైంగిక, శారీరక వేధింపుల లాగానే భావోద్వేగ దుర్వినియోగం కూడా అత్యంత హానికరం.

■ ప్రేమగా అవమానం..

ప్రేమతో అయినా అతను/ఆమె ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటం ద్వారా భాగస్వామి తనను తాను ఆత్మస్థైర్యం కోల్పోయిన వ్యక్తిగా భావించడం ప్రారంభిస్తారు. తమ విశ్వాసం దెబ్బతింటుంది. 'నువ్వు ఇంత తెలివితక్కువ దానివి అనుకోలేదు...' చాలా సర్వసాధారణంగా ఇళ్లలో వాడే మాట. ప్రపంచం ముందు తమను తాము గొప్పగా నిరూపణ చేసుకోవడానికి, తమ భాగస్వామిని మానసికంగా నియంత్రించడానికి, చాలా మంది వ్యక్తులు పెట్‌నేమ్స్‌తో అవమానకరంగా పిలుస్తుంటారు. ఆ మాటలు చాచి కొట్టినదానితో సమానంగా ఉంటాయి.

■ జాప్యమూ లోపమేనా!

భాగస్వామిని నియంత్రించడానికి చిన్న చిన్న విషయాలు లేదా వారి పనులను లక్ష్యంగా చేసుకుంటారు. ఉదాహరణకు.. 'ఈ మాత్రం పని కూడా సరిగ్గా చేయడం చేతకాదా? ఎప్పుడూ లేటేనా..' లాంటి మాటలు తరచూ అనేస్తుంటారు. ఇలాంటి వ్యక్తులు తమ భాగస్వామికి ఏదీ రాదని ఎదుటివారి ముందు నిరూపించాలనుకుంటారు.

■ అరిస్తే వింటారా..

చిన్న విషయాలకే భాగస్వామిని కించపరచడం, పళ్లు కొరకడం, తప్పుడు ప్రమాణాలు చేయడం, వస్తువులు పగులకొట్టడం.. లాంటివి బంధాలు బీటలువారడానికి సంకేతాలుగా నిలుస్తాయి.

■ తామే గొప్పని..

కొందరికి తమ గొప్పతనాన్ని ప్రతీసారి చాటుకోవాలనిపిస్తుంటుంది. ఉదాహరణకు.. భార్య ఉద్యోగం/వ్యాపారం లో ఏదైనా చిన్న విజయం సాధిస్తే 'నా వల్ల నీకు జాబ్ వచ్చింది. నేను కనికరిస్తే నువ్వు కాలు బయట పెట్టగలుగుతున్నావు. ఇదేమీ నీ గొప్పతనం కాదు' వంటి మాటలు అనేస్తుంటారు. ఇటువంటి వ్యక్తులను అర్థం చేసుకోవడం అంత సులభం కాదు' అంటారు మానసిక నిపుణులు.

చిన్నమాటే.. కానీ, అది పదునుగా మనసుపై దాడి చేస్తుంది. సన్నిహితంగా ఉన్న వ్యక్తిని దూరంగా ఉంచేలా చేస్తుంది. ఒక్కో మాట పడుతున్నప్పుడు అది సమ్మెట దెబ్బలా బంధాన్ని ఛిద్రం చేస్తూనే ఉంటుంది. అందుకే, హింస అంటే శారీరకమైనదే కాదు మానసికపరమైనది కూడా అని భావించి, ఎదుటివారిని నొప్పించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి జాగ్రత్త పడటం మంచిది.

– నిర్మలారెడ్డి

మాట్లాడే ముందే ఆలోచన

శారీరక దాడికన్నా భావోద్వేగపరమైన దాడి చాలా తీవ్రమైనది. ఒక చిన్న పదం చాలా తీవ్ర పరిమాణాలు చూపవచ్చు. 'నువ్వు ఎందుకూ పనికిరావు' అనే మాట ఎదుటివారి ఆత్మస్థైర్యాన్ని తగ్గించేస్తుంది. దీని వల్ల ఇద్దరి మధ్య బాంధవ్యం పలచబడటం మొదలవుతుంది. మానసిక దాడి కారణంగా ఆందోళన, రక్తపోటు వంటి సమస్యలు పెరగడంతో పాటు చిన్న చిన్న విషయాలకు కూడా కోప్పడిపోయి డిప్రెషన్ బారినపడిన వ్యక్తులను చూస్తుంటాం. కోవిడ్‌టైమ్‌లో ఈ సమస్య చాలా ఎక్కువ గమనించాం. కుటుంబ సభ్యులు ఎక్కువ సమయం కలిసి ఒకే చోట ఉండేవారు. దీని వల్ల ఒకరినొకరు మాటలు అనుకోవడం కూడా పెరిగింది. 'మానసిక దాడి' భార్యభర్తలు, పిల్లలు-పెద్దలు మధ్య ఎక్కువయ్యింది. ఇది ఇంకా కంటిన్యూ అవుతూనే ఉంది. ఎవరికి వారు ఒక మాట అనే ముందు నియంత్రణ ఉండాలి. బంధాల మధ్య కమ్యూనికేషన్ సరిగా ఉండాలి. పెద్దలు ఒకరికొకరు కించపరిచేలా మాట్లాడుకుంటే ఆ ప్రభావం పిల్లల మీద పడుతుంది. మాట జారిన తర్వాత వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదు కాబట్టి మాట్లాడే ముందే ఆలోచించాలి. 'ముందు మన మైండ్‌లో నన్నెవరైనా ఇలాగే అంటే ఎలా అనిపిస్తుంది' అనే ఆలోచన చేయాలి. కోపం వచ్చినప్పుడు 100 నుంచి 1 వరకు కౌంట్ చేయడం, ఆ ఆలోచనకు అక్కడ కట్ చేసి, మరో విషయంవైపు మైండ్‌ను డైవర్ట్ చేయడం, సహనాన్ని అలవర్చుకోవడం.. వంటివి పాటించాలి.



– ప్రొఫెసర్ జ్యోతి రాజ,
సైకాలజిస్ట్, లైఫ్‌స్కిల్స్ ట్రైనర్

స్ఫూర్తి

'వయసు అనేది అంకె మాత్రమే' అనడం చాలా తేలిక.
వయసును సవాలు చేయడం మాత్రం కష్టం!
ఆ కష్టాన్ని ఇష్టంగా చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది పుష్ప భట్.
66 సంవత్సరాల వయసులో వరల్డ్స్ హైయెస్ట్ అల్ట్రామారథాన్‌లో పాల్గొనబోతుంది...

పుష్ప
అవును.. తగ్గేదేలే





మరో రెండురోజుల్లో 'వరల్డ్స్ హైయెస్ట్ అల్ట్రా మారథాన్ ఖార్‌దుంగ్ లా ఛాలెంజ్'లో పాల్గొనబోతోంది 66 సంవత్సరాల పుష్పభట్. ముంబైకి చెందిన పుష్ప 63 సంవత్సరాల వయసులో తొలిసారిగా ఈ సాహసోపేత మారథాన్‌లో పాల్గొంది.

'ఇలాంటి మారథాన్‌లో పాల్గొనడానికి ఉత్సాహం మాత్రమే సరిపోదు. సంకల్పబలం కూడా ఉండాలి' అంటుంది పుష్ప.

తాను పన్నెండు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు. చదువు కొనసాగించడానికి పదిహేడేళ్ల వయసు నుంచి చిన్నాచితకా పనులు చేస్తుండేది. 'బీఏ పూర్తి చేయగలనా?' అనుకుంది. చేయడమే కాదు ఆ తరువాత ఎంబీయే కూడా చేసింది.

ఒక కంపెనీలో సెక్రెటరీగా చేరింది. కొన్ని సంవత్సరాల తరువాత ఒక షిప్పింగ్ కంపెనీలో ఎక్కువ జీతంతో చేరింది. ఆ తరువాత... ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనే కోరికతో యాభై ఏళ్ల వయసులో ఉద్యోగానికి రాజీనామా చేసింది.

ఉద్యోగం చేస్తున్న రోజుల్లో...

స్టాండర్డ్ చార్టెడ్ ముంబై మారథాన్‌లో పాల్గొనడానికి సహా ఉద్యోగులు ఉత్సాహం చూపుతున్న సమయంలో తాను కూడా చూపింది. 'ఒక ప్రయత్నం చేసి చూద్దాం' అనుకుంటూ నలభైఏడు సంవత్సరాల వయసులో తొలిసారిగా మారథాన్‌లో పాల్గొంది.

'మనవల్ల ఎక్కడవుతుంది. మహా అంటే పదిహేను నిమిషాలసేపు పరుగెత్తగలనేమో' అనుకుంది. కష్టం అనిపించినా సరే, పట్టుదలగా పరుగెత్తి మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఆ సమయంలోనే పరుగెత్తడంలో ఉన్న కష్టం ఏమిటో పుష్పభట్‌కు తెలిసింది. అయితే 'మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేయగలిగాను' అనే ఉత్సాహం ఆ కష్టాన్ని వెనక్కి నెట్టేసింది.

> సుఖంగా అనిపించే పనుల్లో కంటే, కష్టంగా అనిపించే పనుల ద్వారానే మనకు క్రమశిక్షణ అలవడుతుంది. క్రమశిక్షణ ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఆరోగ్యం ఉత్సాహాన్ని, శక్తిని ఇస్తుంది.
>
> – పుష్ప భట్

ఇక అప్పటి నుంచి ఎనిమిది అల్ట్రా మారథాన్స్, పదకొండు ఫుల్ మారథాన్‌లలో పాల్గొంది. న్యూయార్క్ మారథాన్‌లో పాల్గొనడం తనకు మరచిపోలేని అనుభవం. బ్రిడ్జీలు, జనసమూహాలను దాటుకుంటూ 4 గంటల 58 నిమిషాలు పరుగెత్తింది.

ప్రయాణాలు చేయడం, ప్రయాణంలో స్ఫూర్తిదాయకమై పుస్తకాలు చదవడం, తన భావాలను కవిత్వంగా రాయడం పుష్పకు ఇష్టం.

ఒకానొక సంవత్సరం ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి లడఖ్‌లోని ఖార్‌దుంగ్ లా పాస్‌కు వెళ్లింది. అప్పుడే 'ఖార్‌దుంగ్ లా ఛాలెంజ్'పై ఆసక్తి కలిగింది. 'ఇక్కడ శ్వాసించడానికే ఇబ్బందిగా ఉంది. అలాంటిది ఈ రఫ్ అండ్ టఫ్ మార్గంలో పరుగెత్తగలనా' అనుకుంది. శిక్షణ తీసుకున్న తరువాత బరిలోకి దిగింది. మసక మసకగా కనిపించేదారి, జారుతున్న కాళ్లు... చాలా కష్టపడాల్సి వచ్చింది.

తాను గతంలో పాల్గొన్న మారథాన్‌లకు, సముద్ర మట్టానికి 17,852 అడుగుల ఎత్తున ఉన్న ప్రదేశంలో జరిగే మారథాన్‌కు మధ్య ఉన్న భారీ తేడాను గమనించింది.

అమెరికన్ కాలేజి ఆఫ్ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్స్ పూర్తి చేసి 65 సంవత్సరాల వయసులో 'క్వాలిఫైడ్ న్యూట్రిషనిస్ట్' అనిపించుకుంది.

మరింత ఉత్సాహంతో రెండోసారి 'అల్ట్రా మారథాన్ ఖార్‌దుంగ్ లా ఛాలెంజ్'లో పాల్గొనబోతుంది.

పుష్పభట్ మరోసారి అద్భుత విజయాన్ని సాధించాలని కోరుకుందాం.

బ్యూటిప్స్

చాలామందికి ముఖం చూడడానికి చక్కని మెరుపుతో ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ మోచేతులు మాత్రం ముదురు నలుపు రంగులో మారి నల్లగా కనిపిస్తుంటాయి. వివిధ రకాల అలెర్జీల వల్ల, ఎండ తగలడం వల్ల మోచేతులు నల్లగా మారి ఇబ్బంది పెడుతుంటాయి. అయితే దీనికి చిన్నపాటి వంటింటి చిట్కాలతో సులభంగా చెక్ చెప్పవచ్చు. అదెలాగో చూద్దాం...



- బంగాళ దుంప, టొమాటో ముక్కలను కలిపి మెత్తగా రుబ్బి రసం తీసుకోవాలి. ఈ రసాన్ని మోచేతులపై పేరుకుపోయిన నలుపుపై రాసి పదినిమిషాలపాటు మర్దన చేసి ఆరనివ్వాలి. పూర్తిగా ఆరాక కడిగేయాలి. వారానికి మూడు నాలుగు సార్లు ఇలా చేయడం వల్ల నలుపు విరిగిపోతుంది.
- నలుపు మచ్చలను నివారించడంలో పసుపు బాగా పనిచేస్తుంది. స్పూను పసుపులో అరస్పూను తేనె, కొద్దిగా పచ్చిపాలను వేసి పేస్టులా కలపాలి.



ఈ మిశ్రమాన్ని మోచేతులపై రాసి అరగంట పాటు ఆరనిచ్చి తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఈ ప్యాక్ అప్లై చేయడం వల్ల మోచేతుల నలుపు తగ్గుతుంది.

- రెండు టీస్పూన్ల అలోవెరా జెల్‌లో టీస్పూను కొబ్బరి నూనె, టీస్పూను పంచదార వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నల్లగా ఉన్న మోచేతిపై రాసి ఐదు నిమిషాలపాటు రుద్దాలి. ఇలా రుద్దుతున్నప్పుడు మృతకణాలు తొలగిపోతాయి. మరోసారి ఇదే పేస్టుని అప్లై చేసి ఐదు నిమిషాలు ఆరనిచ్చి కడిగేయాలి. దీనివల్ల కూడా మోచేతి నలుపు త్వరగా తగ్గుతుంది.





- చిన్న బంగాళ దుంపను తొక్కతీసి నేరుగా మోచేతులపై పదినిమిషాల పాటు రుద్దాలి. తరువాత పదిహేను నిమిషాలు తరువాత చల్లటి నీటితో కడిగేయాలి.
- వీటిలో ఏ ఒక్క పద్ధతిని అనుసరించినా మోచేతులపై ఉన్న నలుపు మొత్తం పోయి మోచేతులు మృదువుగా, చక్కని నిగారింపుతో మెరిసిపోతాయి.

కిచెన్ టిప్స్

తులసి ఆకులను శుభ్రంగా కడిగి తడిలేకుండా తుడిచి టిష్యూ పేపర్ మీద ఆరబెట్టాలి. ఈ ఆకులను రెండు నిమిషాలపాటు అవెన్‌లో వేడిచేసి పొడిచేయాలి. ఈ పొడిని టీపొడిలో వేసి ఈ పొడితో టీ పెట్టుకుని తాగితే వర్షాకాలంలో ఎదురయ్యే జలుబు, దగ్గుల నుంచి వెంటనే ఉపశమనం లభిస్తుంది. తులసి ఆకులను పొడి చేసే సమయం లేనప్పుడు టీ డికాషన్‌లో ఆకులను నేరుగా వేసి మరిగించి తాగినా శరీరానికి మంచి ఔషధగుణాలు అందుతాయి.



బరువు తగ్గించుకుంది ఫిట్‌నెస్ కోచ్‌గా రాణిస్తోంది



అంతవరకు సన్నగా... నాజుగ్గా ఉన్న అమ్మాయిలలో చాలామంది పెళ్లి అయ్యాక శరీరంలో చోటు చేసుకునే మార్పులతో ఒక్కసారిగా బరువు పెరిగిపోతుంటారు. కొంతమంది వ్యాయామం, క్రమబద్ధమైన ఆహారం ద్వారా బరువుని నియంత్రణలో ఉంచుకుంటే, అవేమీ చేయకుండా ఆకృతి మారిన శరీరాన్ని చూసి నిరాశ నిస్పృహలకు లోనవుతుంటారు మరికొందరు. అధిక బరువుతో నిరాశకు గురైన వారు అంత త్వరగా ఆ నిరాశ నుంచి బయటకు రాలేరు. గుమ్మం దాటి బయటకొస్తే తనని చూసి అందరూ నవ్వుతారు అని భయపడిన తులికా సింగ్.. ఇంట్లో వాళ్ల ప్రోత్సాహంతో నలభై కేజీల బరువు తగ్గి, తనే ఫిట్‌నెస్ కోచ్‌గా రాణిస్తోంది.

వారణాసికి చెందిన తులికాసింగ్ ఇంటర్మీడియట్ వరకు చదువుకుని 2004లో జర్నలిజం చదివేందుకు నోయిడాకు వెళ్లింది. జర్నలిజం కోర్సు పూర్తయ్యాక వెంటనే ఉద్యోగం దొరకలేదు. తిరిగి ఇంటికి వెళ్లలేని పరిస్థితి. పొట్టకూటికోసం కొన్నాళ్లపాటు పరాటాలు విక్రయించింది. తరువాత ఓ ప్రొడక్షన్ హౌస్‌లో పని దొరకడంతో మూడు వేలరూపాయల జీతానికి చేరింది. ఇలా రెండేళ్లు కష్టపడ్డాక 2007లో ఓ న్యూస్ చానల్లో ఉద్యోగం దొరికింది. చక్కగా పనిచేస్తూ కెరీర్‌లో నిలదొక్కుకుంది. కొంతకాలానికి దిగ్విజయ్ సింగ్‌ను పెళ్లిచేసుకుంది.



తులికా సింగ్

> మనల్ని మనం ప్రేమించుకోవాలి. అప్పుడే సంతోషంగా ఉండగలుగుతాం. శరీరమే మనకు సర్వస్వం. దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. కెరీర్ మీద దృష్టి పెడుతూనే ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకుంటే ఎప్పుడూ ఫిట్‌గా ఉంటాము. మన రోజువారి పనుల్లో హెల్దీ లైఫ్‌స్టైల్ భాగం కావాలి. నా స్టూడెంట్స్‌కు ఇదే నేర్పిస్తున్నాను.
>
> – తులికా సింగ్



■ జోకులు వినలేక...

పెళ్లివరకు అనేక కష్టాలు పడినప్పటికీ ధైర్యంగా ముందుకు సాగిన తులికాకు పెళ్లి తరువాత కొత్త రకం కష్టాలు మొదలయ్యాయి. చిన్నప్పటి నుంచి ఆరోగ్యంగా ఉన్న ఆమె పెళ్లి, పిల్లలతో హార్మోన్లలో ఏర్పడిన అసమతుల్యత కారణంగా ఒక్కసారిగా బరువు పెరిగింది. అంత బరువున్నా, ఎప్పుడూ నీరసంగా ఉండేది. దీనికితోడు చుట్టుపక్కల వాళ్లు ఆమె శరీరం మీద రకరకాల జోకులు వేస్తూ, గేలిచేసేవారు. దీంతో తనకు తెలియకుండానే డిప్రెషన్‌లోకి వెళ్లింది. ఇంట్లో నాలుగు గోడల మధ్య కూర్చొని దిగులు పడుతుండేది. ముంబై నుంచి ఢిల్లీకి మారాక కూడా చానల్‌లో పనిచేసేది. కానీ అధిక బరువు కారణంగా ఏకాగ్రత పెట్టలేక ఆర్టికల్స్‌ను రాయలేకపోయేది. రోజురోజుకి పెరుగుతోన్న బరువుని నియంత్రించలేక, జనాల ఈసడింపు చూపులు తట్టుకోలేక పోయేది. మరోవైపు పీసీఓడీ సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంది.

■ తొమ్మిది నెలల్లో నలభై కేజీలు...

నాలుగో అంతస్థులో ఉండే తులికా, తాను కిందకి దిగితే చూసినవాళ్లు నవ్వుతారన్న భయంతో భర్త, కొడుకు, స్నేహితులు మోటివేట్ చేయడంతో దగ్గర్లో ఉన్న చిన్న పార్క్‌లోకి రాత్రి సమయాల్లో వెళ్లి రహస్యంగా వాకింగ్, రన్నింగ్ చేయడం మొదలు పెట్టింది. రెండు నెలలపాటు రన్నింగ్, వాకింగ్‌లతో పదమూడు కేజీలు బరువు తగ్గింది. ఈ ఉత్సాహంతో ఆహారంలో మార్పులు, జిమ్‌లో చేరి వర్క్ అవుట్‌లు, యోగా చేయడంతో తొమ్మిది నెలల్లోనే నలభై కేజీలు బరువు తగ్గింది.

■ జిమ్ ట్రైనర్‌ను చూసి...

ఒకపక్క డిప్రెషన్‌కు కౌన్సెలింగ్ తీసుకుంటూనే, జిమ్‌లో క్రమం తప్పని వ్యాయామంతో బరువు తగ్గిన తులికా.. తను కూడా జిమ్‌లోని ఫిట్‌నెస్ కోచ్ కావాలనుకుంది. దీంతో వ్యాయామాలన్ని చక్కగా నేర్చుకుని ఆన్‌లైన్ తరగతుల ద్వారా శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. ప్రస్తుతం చక్కని ఫిట్‌నెస్ కోచ్‌గా రాణించడమేగాక, నేషనల్ గేమ్స్ ఆస్పిరెంట్స్‌కు శిక్షణ ఇస్తోంది. ప్రతికూల పరిస్థితుల్లో నలుగురిలో కలవలేనప్పటికీ.. మనలో ధైర్యాన్ని కోల్పోకుండా ఉంటే ఎంతటి బరువునైనా దింపేసుకుని ముందుకు సాగవచ్చనడానికి తులికా జీవితం ఉదాహరణగా నిలుస్తోంది.

యూత్ పల్స్

యూ కెన్
నేర్చుకుంటూ... నేర్పుతూ

పర్యావరణం అనేది యూత్‌కు పట్టని మాట... అనేది తప్పని 'యూ కెన్'లో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న యువతరం నిరూపిస్తోంది. మహా పట్టణాల నుంచి మారుమూల పల్లెలకు తిరుగుతూ పర్యావరణ సందేశాన్ని మోసుకెళుతుంది...



మధ్యప్రదేశ్‌లోని పిపరియ అనే టౌన్‌లోని ప్రభుత్వ పాఠశాలకు ప్రతి శనివారం తప్పనిసరిగా వస్తుంది 27 సంవత్సరాల లహరి.

'అక్కయ్య వచ్చేసింది' అంటూ పిల్లలు చుట్టుముడతారు.

అందరిని పలకరించి తాను చెప్పదలుచుకున్న విషయాలను చెబుతుంది. పిల్లలందరూ నిశ్శబ్దంగా వింటారు. సందేహాలు అడిగి తీర్చుకుంటారు. ఆ తరువాత లహరితో కలిసి ప్రకృతిని పలకరించడానికి వెళతారు.

'ఈ చెట్టు పేరు మీకు తెలుసా?'

'అదిగో ఆ కీటకం పేరు ఏమిటి?'

... ఇలా ఎన్నో అడుగుతూ వాటికి సవివరమైన సమాధానాలు చెబుతుంది లహరి.

ముచ్చట్లు, కథలు, నవ్వుల రూపంలో పర్యావరణానికి సంబంధించిన ఎన్నో విలువైన విషయాలను లహరి ద్వారా నేర్చుకుంటారు పిల్లలు.

'మొదటిసారి ఇక్కడికి వచ్చినప్పుడు పిల్లలను కొన్ని ప్రశ్నలు అడిగాను. మౌనమే వారి సమాధానం అయింది. ఇప్పుడు వారిలో ఎంతో మార్పు వచ్చినందుకు సంతోషంగా ఉంది. తమ చుట్టూ ఉన్న మొక్కలు, చెట్ల పేర్లు చెప్పడంతో సహా వాటి ఉపయోగాలు కూడా చెప్పగలుగుతున్నారు' అంటుంది లహరి.

యూత్ కన్జర్వేషన్ యాక్షన్ నెట్‌వర్క్(యూ కెన్) వేదికగా మధ్యప్రదేశ్‌లోనే కాదు దేశంలోని పన్నెండు రాష్ట్రాల్లో లహరిలాంటి వారు పల్లెలు, పట్టణాలు, కొండలు, కోనలు అనే తేడా లేకుండా విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచుతున్నారు.

'పిల్లల్లో కలిసిపోయి వారిని నవ్విస్తూనే నాలుగు మంచి విషయాలు చెప్పగలిగే వారిని తయారు చేయాలనుకున్నాం' అంటున్న రామ్‌నాథ్ చంద్రశేఖర్, వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌మేకర్, ఫొటోగ్రాఫర్, కన్జర్వేషన్ ఎడ్యుకేటర్ రచిత సిన్హాతో కలిసి యూత్ కన్జర్వేషన్ యాక్షన్ నెట్‌వర్క్ (యూ కెన్) అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాడు.

దేశంలోని పన్నెండు రాష్ట్రాల నుంచి 20 మంది యువతీ యువకులను 'యూ కెన్' కోసం ఇంటర్వ్యూలు, వీడియో ఇంటరాక్షన్ ద్వారా ఎంపిక చేస్తారు.

ఝార్ఖండ్‌కు చెందిన రచిత సిన్హా పచ్చటి ప్రకృతితో చెలిమి చేస్తూ పెరిగింది. 'మా చిన్నప్పుడు ఎన్ని చెట్లు ఉండేవో తెలుసా, ఎన్ని పక్షులు ఉండేవో తెలుసా!' అంటూ తల్లిదండ్రులు చెప్పిన విషయాలను వింటూ పెరిగింది. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసిన రచిత ఆ తరువాత 'యూ కెన్'పై పూర్తిగా దృష్టి పెట్టింది.

'లాభాపేక్షతో సంబంధం లేకుండా ఒక మంచిపని కోసం సమయాన్ని వెచ్చించేవారు ఎంతోమంది ఉన్నారు. అలాంటి యువతరానికి యూ కెన్ మంచి వేదిక అవుతుంది. దీనికోసం పెద్ద డిగ్రీలు అక్కర్లేదు. పర్యావరణ ప్రేమ, నాలుగు మంచి విషయాలు పిల్లలకు చెప్పగలిగే నైపుణ్యం ఉంటే చాలు' అంటుంది రచిత సిన్హా.

'నేర్చుకుంటూ... నేర్పుతూ' అంటారు. 'యూ కెన్' ద్వారా యూత్ చేస్తున్న మంచి పని అదే.

విలువైన పాఠాలు

ప్రకృతి నుంచి విలువైన పాఠాలు నేర్చుకోవచ్చు. అలా నేర్చుకుంటూనే 'యూ కెన్' లాంటి వేదికల ద్వారా తాము నేర్చుకున్న విషయాలను పిల్లలతో పంచుకోవడంలో ముందుంటుంది యువతరం.



– రచిత సిన్హా
యూ కెన్, కో–ఫౌండర్



'ఎఫ్‌ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో...

భారత పురుషుల హాకీ జట్టు స్టార్ డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) 2021–2022 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు నామినేట్ అయ్యాడు. హర్మన్‌తోపాటు ఆర్థర్ డి స్లూవర్, టామ్ బూన్ (బెల్జియం), బ్రింక్‌మన్ (నెదర్లాండ్స్), నిక్లాస్ వెలెన్ (జర్మనీ) కూడా ఈ అవార్డు రేసులో ఉన్నారు. భారత్‌కే చెందిన పీఆర్ శ్రీజేష్, సవిత పూనియా 'బెస్ట్ గోల్‌కీపర్' అవార్డు బరిలో ఉన్నారు. ఈనెల 30 వరకు ఆన్‌లైన్ ఓటింగ్ కొనసాగుతుంది. వచ్చే నెలలో విజేతలను ప్రకటిస్తారు.

ఈసారి మెల్‌బోర్న్ స్టార్స్ తరఫున...



ఆస్ట్రేలియాలో అక్టోబర్ 13 నుంచి జరిగే మహిళల బిగ్‌బాష్ లీగ్ టి20 క్రికెట్ టోర్నీలో భారత స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ బరిలోకి దిగనుంది. 22 ఏళ్ల జెమీమా మెల్‌బోర్న్ స్టార్స్ జట్టు తరఫున ఆడనుంది. గత సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జెమీమా 333 పరుగులు సాధించింది. ఈ ఏడాది బిగ్‌బాష్ లీగ్‌లో జెమీమాతోపాటు హర్మన్‌ప్రీత్ కౌర్ (మెల్‌బోర్న్ రెనెగేడ్స్), పూజా వస్త్రకర్ (బ్రిస్బేన్ హీట్) కూడా ఆడనున్నారు.

స్పోర్ట్స్ రీల్



క్రికెట్‌కు రైనా వీడ్కోలు

న్యూఢిల్లీ: భారత మాజీ క్రికెటర్ సురేశ్ రైనా స్వదేశంలో జరిగే అన్ని రకాల క్రికెట్ ఫార్మాట్‌ల నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు మంగళవారం ప్రకటించాడు. దాంతో అతను విదేశాల్లో జరిగే టి20 లీగ్‌లలో పాల్గొనేందుకు అర్హుడవుతాడు. 2020 ఆగస్టు 15న అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన రైనా దేశవాళీ క్రికెట్‌లో ఉత్తరప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2021లో చివరిసారి చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరఫున ఐపీఎల్ టోర్నీలో ఆడిన రైనాను ఈ ఏడాది ఐపీఎల్ మెగా వేలంలో ఏ జట్టూ తీసుకోలేదు. 2008 నుంచి 2021 వరకు వరుసగా 13 ఐపీఎల్ సీజన్‌లు ఆడిన రైనా మొత్తం 205 మ్యాచ్‌లు ఆడి 5,528 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ, 39 అర్ధ సెంచరీలు ఉన్నాయి. బెట్టింగ్ ఆరోపణలపై చెన్నై సూపర్ కింగ్స్‌పై రెండేళ్ల నిషేధం విధించిన సమయంలో రైనా 2016, 2017 ఐపీఎల్ టోర్నీలలో గుజరాత్ లయన్స్ తరఫున ఆడాడు.

భారత జోడీకి స్వర్ణం



న్యూఢిల్లీ: ఆసియా జూనియర్, క్యాడెట్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలిసారి స్వర్ణ పతకం లభించింది. లావోస్‌లో మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో జూనియర్ మిక్స్‌డ్ డబుల్స్‌లో పాయస్ జైన్–యశస్విని జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో పాయస్–యశస్విని ద్వయం 11–9, 11–1, 10–12, 7–11, 11–8తో హాన్ జిన్‌యువాన్–కిన్ యుజువాన్ (చైనా) జోడీపై విజయం సాధించింది. అండర్–19 బాలుర డబుల్స్‌లో, అండర్–19 బాలికల సింగిల్స్‌లో, అండర్–19 బాలుర టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు కాంస్య పతకాలు లభించాయి.

భారత్ కథ ముగిసె!

- టీమిండియాకు రెండో ఓటమి
- తుదిపోరుకు చేరువైన శ్రీలంక
- రోహిత్ మెరుపులు వృథా



దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీలో భారత్‌కు ఊహించని షాక్! అభిమానుల గుండె పగిలే ఫలితం శ్రీలంక చేతిలోనూ ఎదురైంది. సూపర్–4లో వరుసగా రెండో ఓటమి. దీంతో ఫైనల్ ఆశలకు దాదాపు తెరపడింది. నేడు పాకిస్తాన్‌పై అఫ్గానిస్తాన్ అద్భుతం చేస్తే తప్ప మనకు దారే లేదు. మంగళవారం జరిగిన పోరులో 6 వికెట్లతో భారత్‌ను ఓడించిన శ్రీలంక ఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకుంది. మొదట టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (41 బంతుల్లో 72; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించాడు. మదుషంక 3 వికెట్లు తీశాడు. తర్వాత శ్రీలంక 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసి గెలిచింది. నిసాంక (37 బంతుల్లో 52; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (37 బంతుల్లో 57; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన షనకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

కెప్టెన్ ఒక్కడే!

గత మ్యాచ్‌కు భిన్నంగా ఆట మొదలైంది. పాక్‌పై ధాటిగా ఆరంభమైన ఓపెనింగ్ మెరుపులు... శ్రీలంకపై కరువయ్యాయి. ఓపెనర్ రాహుల్ (6) రెండో ఓవర్లోనే వికెట్ల ముందు దొరికిపోయాడు. మరుసటి ఓవర్లోనే కోహ్లి (0) డకౌటయ్యాడు. 13 పరుగులకే రెండు టాపార్డర్ వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ రోహిత్ బాధ్యతగా నడిపించాడు. అసిత ఫెర్నాండో వేసిన ఐదో ఓవర్లో 6, 4 కొట్టి రన్‌రేట్ పెంచాడు. మళ్లీ తనే వేసిన పదో ఓవర్లో మరో సిక్సర్, బౌండరీతో 32 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. 10 ఓవర్లలో భారత్ స్కోరు 79/2. సగం ఓవర్లు అయిపోవడంతో 'హిట్‌మ్యాన్' ధాటిని మరింత పెంచాడు. కానీ ఆ క్రమంలోనే వెనుదిరిగాడు. హసరంగ వేసిన 12వ ఓవర్లో 2 సిక్సర్లు, ఓ ఫోర్ బాదడంతో 18 పరుగులు వచ్చాయి. దీంతో జట్టు స్కోరు వంద పరుగులు దాటింది. మరుసటి ఓవర్లో కరుణరత్నే స్లో డెలివరీతో రోహిత్‌ను బోల్తా కొట్టించాడు. కాసేపటికి సూర్యకుమార్ (29 బంతుల్లో 34; 1 ఫోర్, 1 సిక్స్)ను స్లో బౌన్సర్‌తో షనక పెవిలియన్ చేర్చాడు. పాండ్యా (17), పంత్ (17) పెద్దగా మెరిపించలేదు. అశ్విన్ (7 బంతుల్లో 15 నాటౌట్; 1 సిక్స్) చేసిన ఆ కాస్త పరుగులతోనే కష్టంగా 170 పైచిలుకు స్కోరు చేయగలిగింది.

చెలరేగిన ఓపెనర్లు

లంక ఛేదన తొలి ఓవర్లో కేవలం పరుగుతో మొదలైంది. తర్వాత ఓవర్ నుంచి ఫోర్లతో, అటు నుంచి సిక్సర్లతో చకచకా సాగిపోయింది. ఓపెనర్లు నిసాంక, కుశాల్‌ల జోరుతో అర్ష్‌దీప్ తేలిపోయాడు. ఐదో ఓవర్లో అతను 18 పరుగులు సమర్పించుకున్నాడు. శ్రీలంక 5.2 ఓవర్లలోనే 50 పరుగులు చేసింది. మరో ఐదు ఓవర్లు... మొత్తంగా సగం ఓవర్లు ముగిసినా భారత బౌలర్లు వికెట్ తీయలేకపోయారు. అవతలివైపు ఓపెనర్లే లక్ష్యంలో సగం స్కోరును (10 ఓవర్లలో 89/0) దాటేశారు. 12వ ఓవర్ వేసిన చహల్ నిసాంకతో పాటు అసలంక (0)ను పెవిలియన్ చేర్చాడు. స్వల్ప వ్యవధిలో గుణతిలక (1)ను అశ్విన్, కుశాల్ మెండిస్‌ను చహల్ అవుట్ చేయడంతో 110 పరుగుల వద్ద 4 వికెట్లను కోల్పోవడంతో భారత శిబిరం ఆనందంలో తేలియాడింది. కానీ రాజపక్స వచ్చీ రాగానే స్పిన్నర్లిదరి ఓవర్లలో సిక్సర్లు కొట్టాడు. తర్వాత కెప్టెన్ షనక కూడా జాగ్రత్తగా ఆడటంతో లక్ష్యానికి చేరువైంది. ఆఖరి అవకాశాన్ని కూడా కీపర్ పంత్, బౌలర్ అర్ష్‌దీప్ చేజార్చడంతో లంక మరో బంతి ఉండగానే గెలిచింది. 2 బంతుల్లో 2 పరుగుల సమీకరణం వద్ద ఐదో బంతిని షనక బీట్ అయ్యాడు. పంత్ వికెట్లపై విసరగా తగలకుండా బంతి బౌలర్ అర్ష్‌దీప్ చేతుల్లో పడింది. తను పరుగెత్తుకుంటూ వికెట్లను కొట్టకుండా బలంగా విసరడంతో అవుట్ కావాల్సిన చోట ఓవర్‌త్రోతో 2 పరుగులు వచ్చాయి.

భారత్ ఫైనల్ చేరాలంటే...

నేడు జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై అఫ్గానిస్తాన్ తప్పనిసరిగా గెలవాలి. అనంతరం గురువారం జరిగే మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై భారత్ కూడా విజయం సాధించాలి. శుక్రవారం జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై కూడా శ్రీలంక తప్పనిసరిగా నెగ్గాలి. ఇలా జరిగితే శ్రీలంక ఫైనల్ చేరుతుంది. భారత్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ జట్లు రెండు పాయింట్లతో సమంగా నిలుస్తాయి. ఈ మూడు జట్లలో మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టు ఫైనల్‌కు వెళుతుంది. ఒకవేళ నేడు అఫ్గానిస్తాన్‌పై గెలిస్తే పాకిస్తాన్ ఫైనల్లోకి అడుగు పెడుతుంది. పాక్, భారత్‌లపై అఫ్గానిస్తాన్ గెలిచి... లంకపై పాకిస్తాన్ నెగ్గితే... పాక్, శ్రీలంక, అఫ్గానిస్తాన్ నాలుగు పాయింట్లతో సమంగా నిలుస్తాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్న రెండు జట్లు ఫైనల్ చేరుతాయి.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తీక్షణ 6; రోహిత్ (సి) నిసాంక (బి) కరుణరత్నే 72; కోహ్లి (బి) మదుషంక 0; సూర్యకుమార్ (సి) తీక్షణ (బి) షనక 34; పాండ్యా (సి) నిసాంక (బి) షనక 17; పంత్ (సి) నిసాంక (బి) మదుషంక 17; దీపక్ హుడా (బి) మదుషంక 3; అశ్విన్ (నాటౌట్) 15; భువనేశ్వర్ (బి) కరుణరత్నే 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1–11, 2–13, 3–110, 4–119, 5–149, 6–157, 7–158, 8–164. **బౌలింగ్:** మదుషంక 4–0–24–3, మహీశ్ తీక్షణ 4–0–29–1, చమిక 4–0–27–2, అసిత ఫెర్నాండో 2–0–28–0, హసరంగ 4–0–39–0, షనక 2–0–26–2.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) రోహిత్ (బి) చహల్ 52; కుశాల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 57; అసలంక (సి) సూర్యకుమార్ (బి) చహల్ 0; గుణతిలక (సి) రాహుల్ (బి) అశ్విన్ 1; రాజపక్స (నాటౌట్) 25; షనక (నాటౌట్) 33; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19.5 ఓవర్లలో 4 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1–97, 2–97, 3–110, 4–110. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–30–0, అర్ష్‌దీప్ 3.5–0–40–0, పాండ్యా 4–0–35–0, చహల్ 4–0–34–3, అశ్విన్ 4–0–32–1.

నాదల్‌కు షాక్



- అమెరికా ప్లేయర్ టియాఫో సంచలనం
- ప్రిక్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ స్టార్‌పై అద్భుత విజయం
- తొలిసారి యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి



టియాఫో

న్యూయార్క్: ఈ ఏడాది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలని ఆశించిన స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్‌కు నిరాశ ఎదురైంది. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో రాఫెల్ నాదల్ ప్రస్థానం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. అమెరికా ప్లేయర్ ఫ్రాన్సిస్కో టియాఫో తన కెరీర్‌లోనే గొప్ప ప్రదర్శనతో ప్రపంచ మూడో ర్యాంకర్ నాదల్‌ను ఓడించి యూఎస్ ఓపెన్ టోర్నీలో తొలిసారి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 22వ సీడ్ టియాఫో 6–4, 4–6, 6–4, 6–3తో రెండో సీడ్ నాదల్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు. క్వార్టర్ ఫైనల్లో ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా)తో టియాఫో ఆడతాడు. నాదల్‌తో 3 గంటల 34 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో టియాఫో 18 ఏస్‌లు సంధించి నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నాదల్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన టియాఫో 49 విన్నర్స్ కొట్టాడు. మరోవైపు నాదల్ తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు, 26 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. ఓవరాల్‌గా గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో నాదల్‌ను ఓడించిన మూడో అమెరికా ప్లేయర్‌గా టియాఫో ఘనత వహించాడు. గతంలో అమెరికా ప్లేయర్లు ఆండీ రాడిక్ (2004లో), జేమ్స్ బ్లేక్ (2005లో) నాదల్‌ను ఓడించారు. ఈ ఏడాది నాదల్ ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో టైటిల్స్ సాధించి, వింబుల్డన్ టోర్నీలో సెమీఫైనల్ చేరుకున్నాడు. గాయం కారణంగా అతను సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆడకుండా తన ప్రత్యర్థి కిరియోస్ (ఆస్ట్రేలియా)కు వాకోవర్ ఇచ్చాడు. యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), 11వ సీడ్ జానిక్ సినెర్ (ఇటలీ) తమ ప్రత్యర్థులను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరారు. 2014 చాంపియన్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)తో 3 గంటల 54 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6–4, 3–6, 6–4, 4–6, 6–3తో గెలుపొంది వరుసగా రెండో ఏడాది క్వార్టర్ ఫైనల్ చేరాడు. సినెర్ 6–1, 5–7, 6–2, 4–6, 6–3తో ఇవాష్క (రష్యా)పై గెలిచాడు.

క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), ఆరో సీడ్ సబలెంకా (బెలారస్), ఎనిమిదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో స్వియాటెక్ 2–6, 6–4, 6–0తో సీమియెర్ (జర్మనీ)పై, సబలెంకా 3–6, 6–3, 6–2తో డానియెలా కొలిన్స్ (అమెరికా)పై, పెగూలా 6–3, 6–2తో క్విటోవా (చెక్ రిపబ్లిక్)పై, ప్లిస్కోవా 7–5, 6–7 (5/7), 6–2తో మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్)పై గెలిచారు.

సినిమా



రష్మికా మందన్నా

జరిగేదే జరుగుతుంది!

''ఫలానా స్క్రిప్ట్‌ను ఎంచుకుంటే అది జరుగుతుందేమో! ఫలానా స్క్రిప్ట్‌ను ఎంచుకోకపోతే మరొకటి జరుగుతుందేమో అని హైరానా పడను. జరిగేదే జరుగుతుందనుకుని నా గట్ ఫీలింగ్‌తో స్క్రిప్ట్స్ ఎంచుకుంటాను'' అన్నారు రష్మికా మందన్నా. అమితాబ్ బచ్చన్, రష్మికా మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన హిందీ చిత్రం 'గుడ్ బై'. వికాశ్ బాల్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా అక్టోబరు 7న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. హిందీలో రష్మికా మందన్నాకు ఇదే తొలి చిత్రం. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న రష్మికా మందన్నాను 'మీరు ఏ విషయానికి గుడ్ బై చెప్పాలనుకుంటున్నారు' అని ఓ విలేకరి అడగ్గా.. ''నెగిటివిటీకి గుడ్ బై చెప్పాలనుకుంటున్నాను. నేను చాలా పాజిటివ్ పర్సన్‌ని. మనందరం నెగిటివిటీకి గుడ్ బై చెప్పాలని, ప్రపంచం అంతా పాజిటివ్‌నెస్‌తో నిండిపోవాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే అల్లు అర్జున్, రష్మిక జంటగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప: ది రైజ్' మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమా నెక్ట్స్ పార్ట్ 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇంకా రెండో భాగం చిత్రీకరణ ఆరంభం కాలేదు. అయితే ఈ సినిమా షూటింగ్‌లో మరో రెండు రోజుల్లో జాయిన్ అవుతున్నట్లుగా రష్మిక అప్‌డేట్ ఇచ్చారు.



రెజీనా, సునీత, నివేదా థామస్

ప్రతివారం ఓ బాహుబలి రాదు

– నిర్మాత సునీత తాటి

''నా దృష్టిలో కథ అనేది ఓ ప్రయాణం. కానీ కొన్ని పరిమితుల కారణంగా కథారచయితలకు మనం ఎక్కువగా ఫ్రీడమ్ ఇవ్వడం లేదని నాకనిపిస్తుంటుంది. అందుకే ఎక్కువగా కొరియన్ సినిమాలను రీమేక్ చేస్తున్నాం. అయినా కథలో సోల్‌ను తీసుకుని, మన నేటివిటీకీ తగ్గట్లుగా మార్పులు చేయడం అనేది సులువైన పనేం కాదు. 'శాకిని డాకిని' సినిమాకు అక్షయ్ అనే కుర్రాడు స్క్రీన్‌ప్లే అందించాడు'' అన్నారు సునీత తాటి. రెజీనా, నివేదా థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'శాకిని డాకిని'. సౌత్ కొరియన్ ఫిల్మ్ 'మిడ్‌నైట్ రన్నర్స్'కు రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రానికి సుధీర్ వర్మ దర్శకత్వం వహించారు. డి. సురేష్ బాబు, సునీత తాటి, హ్యూన్వు థామస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా సునీత తాటి మాట్లాడుతూ– ''ఇద్దరు మహిళా ట్రైనీ పోలీసులు ఓ క్రైమ్‌ను ఎలా డీల్ చేశారు? అన్నదే ఈ సినిమా కథ. 'మిడ్‌నైట్ రన్నర్స్' చిత్రంలో హీరోలు నటించారు. కానీ ఈ సినిమాలో హీరోయిన్స్‌ను పెట్టాం. ఇక మన దగ్గర కాస్త కథల కొరత ఉందని నా ఫీలింగ్. తెలుగు సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకుని వెళ్లిన రాజమౌళిగారు ఉన్నారు. కానీ ప్రతి వారం 'బాహుబలి' లాంటి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇచ్చే సినిమాలు థియేటర్స్‌కు రావు. 'ఆర్ఆర్ఆర్' సినిమా రీమేక్ రైట్స్ కావాలని కొందరు ఫిల్మ్‌మేకర్స్ నన్ను సంప్రదించారు. ఈ విషయాన్ని రాజమౌళిగారి దృష్టికి తీసుకుని వెళ్లాను'' అని అన్నారు. ''ఈ చిత్రంలో దామిని అనే పాత్ర పోషించాను. ఈ సినిమా నా కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు రెజీనా. ''ఈ చిత్రంలో షాలిని పాత్ర చేశాను. ఈ సినిమా చూసేందుకు థియేటర్‌కి వచ్చే ప్రేక్షకుల టికెట్ డబ్బులు వృథా కావనే నమ్మకం మాకుంది'' అన్నారు నివేదా థామస్.

అదే నిజమైన సక్సెస్ అని నా ఫీలింగ్

– ఆర్య



''ప్రేక్షకుల అభిరుచులు మారాయి. కొత్తదనం ఉంటేనే థియేటర్స్‌కు వస్తున్నారు. ఓటీటీ, శాటిలైట్ రైట్స్‌లతో నిర్మాతలకు కాస్త డబ్బులు వస్తున్నప్పటికీ, ఓ సినిమా థియేటర్స్‌లో విడుదలై హిట్ సాధించినప్పుడు లభించేదే నిజమైన సక్సెస్ అని నా ఫీలింగ్'' అన్నారు హీరో ఆర్య. 'టెడ్డీ' సినిమా తర్వాత హీరో ఆర్య, దర్శకుడు శక్తి సౌందర్ రాజన్ కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'కెప్టెన్'. ఆర్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది. శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా సుధాకర్ రెడ్డి ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆర్య చెప్పిన విశేషాలు...

- 'టెడ్డీ' తర్వాత శక్తి సౌందర్ రాజన్ నాకు 'కెప్టెన్' కథ చెప్పారు. మరో దర్శకుడు అయితే 'కెప్టెన్'కు నో చెప్పేవాడినేమో. కానీ శక్తి సౌందర్ రాజన్‌తో నాకు పని చేసిన అనుభవం ఉంది. ఆయనకు సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్)పై ఎంత పట్టు ఉందో నాకు అవగాహన ఉంది. అందుకే 'కెప్టెన్' సినిమాకు ఓకే చెప్పాను. ఈ సినిమా కోసం దాదాపు ఏడాది పాటు ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేశాం.
- ఈ సినిమాలో ఆర్మీ ఆఫీసర్ కెప్టెన్ విజయ్ కుమార్ పాత్ర చేశాను. ఓ వింత జీవితో పోరాటం చేయడమే 'కెప్టెన్' కథ. విజయ్ కుమార్, అతని బృందం ఈ వింత జీవితో ఎందుకు పోరాటం చేయాల్సి వచ్చింది? ఈ వింత జీవి వల్ల మానవాళికి ఎటువంటి ప్రమాదం పొంచి ఉంది? అనే అంశాల సమాహారమే ఈ సినిమా కథాంశం. ఈ సినిమాలో ఆర్మీ బ్యాక్‌డ్రాప్ ఉంది కాబట్టి ప్రతి అంశాన్ని చాలా జాగ్రత్తగా డీల్ చేశాం. మాకు తెలియకుండా ఏదైనా పొరపాటు జరిగితే అది ఆర్మీ వారిని తక్కువ చేసినట్లుగా ఉండకూడదనుకుని సెట్‌లో ఓ రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్‌ను నియమించుకున్నాం.
- ఈ సినిమాలోని క్లైమాక్స్ సన్నివేశాల చిత్రీకరణ నాకు చాలెంజింగ్‌గా అనిపించింది. భూమికి వంద అడుగుల ఎత్తులో, నీటిలో 20 అడుగుల లోతులో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించాం. ట్రైలర్, టీజర్స్‌లో కనిపించినట్లుగా వింత జీవి నా ముందు ఉండదు. ఉందని ఊహించుకుని యాక్ట్ చేయాలి. ఇది చాలా కష్టంగా అనిపించింది. ఇక వింత జీవి అనేది గ్రాఫిక్స్ వర్క్ మాత్రమే.
- 'టెడ్డీ', 'సారపట్టై'.. ఇప్పుడు 'కెప్టెన్'...ఇలా వరుసగా ప్రయోగాత్మక సినిమాలు చేస్తున్నాను అంటే కమర్షియల్ సినిమాలకు దూరంగా ఉంటానని కాదు. సాధారణంగా నేను ఎక్కువ రిస్క్ తీసుకుంటుంటాను. రిస్కీ స్క్రిప్ట్స్ ఉన్న దర్శకులు వేరే హీరోలు ఎవరూ చేయకపోతే నా దగ్గరకు వస్తారు. నేనైతే ప్రొడ్యూస్ కూడా చేస్తానని నాతో చాన్స్ కూడా తీసుకుంటుంటారు. 'కెప్టెన్' సినిమాకు సీక్వెల్ తీసే స్కోప్ ఉంది. అయితే ఈ సినిమా విజయంపై మాత్రమే అది ఆధారపడి ఉంది.
- నితిన్ నాకు మంచి స్నేహితుడు. కమల్‌హాసన్‌గారి 'విక్రమ్' సినిమా శ్రేష్ఠ్ మూవీస్ ద్వారానే విడుదలై మంచి విజయం సాధించింది. ఈ లిస్ట్‌లో ఇప్పుడు 'కెప్టెన్' సినిమా కూడా చేరుతుందనే నమ్మకం ఉంది. మంచి కథ కుదిరితే తెలుగులో స్ట్రయిట్ సినిమా చేస్తాను. అలాగే కథ నచ్చితే నా భార్య సాయేషాతో కలిసి సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను.

తార.. నా తార



నాగశౌర్య, షిర్లీ సేథియా

నాగశౌర్య, షిర్లీ సేథియా జంటగా అనీష్ ఆర్. కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కృష్ణ వ్రింద విహారి'. ఉషా ముల్పూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. మహతి స్వర సాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'తార నా తార..!' అంటూ సాగే పాటను మంగళవారం విడుదల చేశారు. ఈ పాటకి శ్రీమణి సాహిత్యం అందించగా, నకాష్ అజీజ్ పాడారు. ఈ చిత్రానికి సమర్పణ: శంకర్ ప్రసాద్ ముల్పూరి, కెమెరా: సాయి శ్రీరామ్, సహ నిర్మాత: బుజ్జి.

సస్పెన్స్ టీచర్

'నాయక్, ఇద్దరమ్మాయిలతో, జెండాపై కపిరాజు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు అమలా పాల్. 'పిట్టకథలు' తర్వాత ఆమె ఏ తెలుగు చిత్రంలో నటించలేదు. కానీ, మాతృభాష మలయాళంతో పాటు తమిళ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఉన్నికృష్ణన్ దర్శకత్వంలో మమ్ముట్టి లీడ్ రోల్‌లో నటిస్తున్న 'క్రిష్టోఫర్'లో నటిస్తున్న అమలా పాల్ తాజాగా 'ది టీచర్' అనే మలయాళ చిత్రంలో నటించేందుకు పచ్చజెండా ఊపారు. వివేక్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో టీచర్ పాత్ర చేయనున్నారు అమల. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ సినిమాకి షాజీ కుమార్‌తో కలిసి స్క్రిప్ట్ అందించారు వివేక్.



అమలా పాల్



అభిరామ్, గీతికా తివారీ, తేజ...

అహింస పూర్తి

నిర్మాత డి. సురేష్ బాబు తనయుడు, హీరో రానా తమ్ముడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. తేజ దర్శకత్వం వహిస్తున్నారు. గీతికా తివారీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సదా, కమల్ కామరాజు కీలక పాత్రలు పోషించారు. పి. కిరణ్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'అహింస'. అన్ని కమర్షియల్ హంగులు ఉన్న తేజ మార్క్ సినిమా ఇది. 'నువ్వు నేను' తర్వాత తేజ, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, ఆర్పీ పట్నాయక్ కలిసి 'అహింస'తో మరో మ్యూజికల్ బ్లాక్‌బస్టర్ ఇవ్వనున్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



వీర్తి, అజయ్, హనుమాన్, మారుతి

నన్నీ స్థాయికి తెచ్చింది చిన్న సినిమానే

– డైరెక్టర్ మారుతి

''చిన్న సినిమా సూపర్ హిట్టవ్వాలని కోరుకునే వ్యక్తుల్లో నేను ఒకణ్ణి. నన్ను ఈ స్థాయికి తెచ్చింది చిన్న సినిమానే'' అని డైరెక్టర్ మారుతి అన్నారు. అజయ్, వీర్తి వఘాని జంటగా హనుమాన్ వాసంశెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కొత్త కొత్తగా'. బీజీ గోవింద రాజు సమర్పణలో మురళీధర్ రెడ్డి ముక్కర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ– ''చిన్న సినిమా మధ్యతరగతి కుటుంబం లాంటిది.. మధ్య తరగతి బాగుంటేనే మిగతా తరగతులు బాగుంటాయి'' అన్నారు. ''అబ్బాయికి షేక్ హ్యాండ్ కూడా ఇవ్వడానికి ఇష్టపడని ఒక అమ్మాయి.. ఆ అమ్మాయిని ప్రాణంగా ప్రేమించే అబ్బాయి మధ్య జరిగే కథే ఈ సినిమా'' అన్నారు హనుమాన్ వాసంశెట్టి. ''భోజనం ఎంత పెట్టినా చివర్లో స్వీట్ ఇస్తారు.. మా సినిమా కూడా స్వీట్ లాంటిది'' అన్నారు గోవింద రాజు. ''మా సినిమాని థియేటర్‌లో చూసి మంచి విజయం అందించాలి'' అన్నారు అజయ్, వీర్తి వఘాని.

సాక్షి బిజినెస్

బుధవారం
7-9-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	49	59,197
నిఫ్టీ ▼	10	17,657

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,535	▼	96
డోజోన్స్	31,097	▼	221
ఎఫ్‌టీఎస్ఈ 100	7,300	▲	13
డాక్స్	12,871	▲	111
షాంఘై	3,243	▲	44
నికాయ్	27,619	▲	7

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఎల్ఐసీ నుంచి కొత్త పెన్షన్ ప్లాన్

LIC's New Pension Plus
Plan No.: 867 UIN: 512L347V01

న్యూఢిల్లీ: జీవిత బీమాలో అగ్రస్థాయి కంపెనీ అయిన ఎల్ఐసీ.. కొత్త పెన్షన్ ప్లాన్‌ను (ప్లాన్ నంబర్ 867) విడుదల చేసింది. ఇది నాన్ పార్టిసిపేటింగ్, యూనిట్ లింక్డ్ ప్లాన్. రెగ్యులర్‌గా ఈ ప్లాన్‌లో పొదుపు చేసుకుంటూ.. కాల వ్యవధి తర్వాత యాన్యుటీ ప్లాన్ తీసుకుని పెన్షన్ పొందొచ్చని ఎల్ఐసీ తెలిపింది. ఒకేసారి చెల్లించే సింగిల్ ప్రీమియం ప్లాన్ లేదంటే రెగ్యులర్‌గా పాలసీ కాల వ్యవధి వరకు ప్రీమియం చెల్లించే ఆప్షన్లలో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చు. కనిష్ట, గరిష్ట ప్రీమియం పరిమితుల మధ్య పాలసీదారు తనకు అనుకూలమైన మొత్తాన్ని ప్రీమియంగా ఎంపిక చేసుకోవచ్చు. ప్రీమియం రూపంలో చేసిన చెల్లింపులను నాలుగు ఫండ్స్‌లో ఎందులో ఇన్వెస్ట్ చేయాలన్నది పాలసీదారు అభీష్టంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రీమియం అలోకేషన్ తదితర చార్జీలను ప్రీమియం నుంచి మినహాయించి మిగిలిన మొత్తాన్ని ఆయా ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తారు. ఈ పాలసీలో 5–15 శాతం మధ్య గ్యారంటీడ్ అడిషన్ కూడా చెల్లిస్తారు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	50,761	▲	9
బంగారం (99.5 స్వచ్ఛత)	50,558	▲	9
వెండి (కిలో)	53,696	▲	333

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-9-2022	
విశాఖ	475–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	66.00
6-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

ఇక బడ్జెట్ 5జీ ఫోన్లకు డిమాండ్

- కంపెనీల మధ్య 5జీ ఫోన్ల పోటీ
- ఈ ఏడాది రెట్టింపైన ఆవిష్కరణలు
- రూ.10,000–15,000 ధరల శ్రేణి లక్ష్యం
- నాలుగు రెట్లు పెరిగిన డిమాండ్



న్యూఢిల్లీ: 5జీ టెక్నాలజీతో కూడిన బడ్జెట్ ఫోన్ల (రూ.10,000–15,000) విభాగంలో కంపెనీల మధ్య పోరు మొదలైంది. మరో ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 5జీ సేవలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో వినియోగదారులు తమ ఫోన్లను కొత్త టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకునేందుకు ఆసక్తి చూపించనున్నారు. దీంతో ఈ విభాగం కంపెనీలకు ఆకర్షణీయంగా మారనుంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 5జీ స్మార్ట్ ఫోన్ల ఆవిష్కరణలు ఇప్పటికే రెట్టింపు స్థాయిలో ఉన్నాయి. అంటే పోటీ ఇప్పటికే మొదలైనట్టు కనిపిస్తోంది. రానున్న పండుగల నేపథ్యంలో మరిన్ని 5జీ ఫోన్ల ఆవిష్కరణలు చోటు చేసుకుంటాయని.. కంపెనీల మధ్య పోటీ మరింత వేడెక్కుతుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తయారీ వ్యయాలు (ముడి పదార్థాల వల్ల) పెరిగిపోవడం, బలహీన రూపాయి రూపంలో కంపెనీలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ అంశాల వల్ల కంపెనీలు బ్యాటరీ, డిస్‌ప్లే, మెమొరీ విషయంలో రాజీపడి, రూ.15,000లోపు ధరకే 5జీ ఫోన్లను విక్రయించే ప్రయత్నం చేస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

బడ్జెట్ విభాగమే టార్గెట్..

రూ.10,000–15,000 విభాగాన్ని 5జీ ఫోన్లు శాసిస్తాయని అంచనా వేస్తున్నట్టు రియల్‌మీ ఇండియా సీఈవో మాధవ్ సేత్ పేర్కొనడం గమనార్హం. ఈ ఏడాది చివరికి ఈ విభాగంలో 5జీ ఫోన్లదే హవా ఉంటుందన్నారు. దీపావళికి చాలా బ్రాండ్లు ఈ విభాగాన్నే లక్ష్యం చేసుకుని ఉత్పత్తులు తీసుకురానున్నట్టు అంచనా వేశారు. ఇదే ధరల శ్రేణిలో ఏకంగా ఆరు 5జీ ఫోన్లు ఒక్క ఆగస్ట్ నెలలోనే విడుదలయ్యాయి. కానీ, క్రితం ఏడాది ఇదే సమయానికి ఈ ధరల శ్రేణిలో ఉన్న 5జీ ఫోన్లు కేవలం మూడే. ''2022 మొదటి ఆరు నెలల్లో రూ.10,000–15,000 ధరల్లోని 5జీ స్మార్ట్‌ఫోన్ల డిమాండ్, క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూస్తే నాలుగు రెట్లు అధికంగా ఉంది''అని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. అయితే ఈ ధరల శ్రేణికి సంబంధించి 5జీ ఫోన్ల మార్కెట్ వాటా మొత్తం స్మార్ట్‌ఫోన్లలో చాలా తక్కువే ఉందని చెప్పుకోవాలి. 2022 ద్వితీయ మూడు నెలల్లో 6 శాతంగా ఉంది. 2021 చివరి నుంచి చూస్తే మార్కెట్ వాటా రెట్టింపైందని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ తెలిపింది. ఈ ఏడాది చివరికి 5జీ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ వాటా 10 శాతానికి చేరుకోవచ్చని అంచనాలున్నాయి. తక్కువ ధరల్లో అందించేందుకు కంపెనీలు డిస్‌ప్లే, ఫాస్ట్ చార్జింగ్‌లో రాజీపడటం ఒక్కటే ఆందోళన కలిగిస్తోంది.

మార్కెట్ వాటా..

కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ డేటా ప్రకారం.. 5జీ ఫోన్లలో షావోమీ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. పోకో బ్రాండ్‌తో కలిపి ఈ విభాగంలో 70 శాతం మార్కెట్ వాటా షావోమీ చేతుల్లోనే ఉంది. రియల్‌మీ మార్కెట్ వాటా 25 శాతంగా ఉంది. ఇక మోటరోలా 5 శాతం వాటా కలిగి ఉంది.

రిలయన్స్ ఎనర్జీ చేతికి సెన్స్‌హాక్

డీల్ విలువ రూ. 256 కోట్లు

న్యూఢిల్లీ: సోలార్ ఎనర్జీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సంస్థ సెన్స్‌హాక్‌ను కొనుగోలు చేయనున్నట్లు రిలయన్స్ ఎనర్జీ తాజాగా పేర్కొంది. కాలిఫోర్నియాకు చెందిన ఈ సంస్థలో మెజారిటీ వాటా కోసం 3.2 కోట్ల డాలర్లు(రూ. 256 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. 2018లో ఏర్పాటైన సెన్స్‌హాక్‌లో 79.4% వాటాను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. తద్వారా పునరుత్పాదక ఇంధన విభాగంవైపు మరిన్ని అడుగులు వేయనుంది. సౌర విద్యుత్ పరిశ్రమ(సోలార్ ఇండస్ట్రీ)లో కంపెనీలకు విధానాల క్రమబద్ధీకరణ, ఆటోమేషన్‌కు సహకరించే అవసరమైన టూల్స్‌ను సెన్స్‌హాక్ అభివృద్ధి చేస్తోంది.

కెనరా బ్యాంక్ రుణ రేటు పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను 0.15 శాతం వరకూ పెంచింది. పెంచిన రేట్లు బుధవారం నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్ పేర్కొంది. తాజా పెంపుతో ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమైన గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు భారం కానున్నాయి. తాజా పెంపుతో ఏడాది రుణ రేటు 7.65 శాతం నుంచి 7.75 శాతానికి పెరిగింది. ఓవర్‌నైట్, నెల వ్యవధుల ఎంసీఎల్ఆర్ 0.10% మేర పెరిగింది.

ఐపీవోకు వైభవ్ జ్యువెల్లర్స్

- సెబీకి తాజాగా ప్రాస్పెక్టస్ దాఖలు
- గతేడాది ఆదాయం రూ. 1,694 కోట్లు



న్యూఢిల్లీ: సుప్రసిద్ధ ప్రాంతీయ ఆభరణాల బ్రాండ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యువెల్లర్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 210 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్ సంస్థ గ్రంధి భారత మల్లికా రత్న కుమారి(హెచ్‌యూఎఫ్) మరో 43 లక్షల షేర్లను ఆఫర్ చేయనుంది. యాంకర్ సంస్థలకు రూ. 40 కోట్ల విలువైన షేర్లను జారీ చేసే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులను రూ. 12 కోట్ల వ్యయంతో 8 కొత్త షోరూముల ఏర్పాటుకు, రెండేళ్లలో రూ. 160 కోట్ల విలువైన నిల్వల కొనుగోలుకీ వినియోగించనుంది. సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం నిధులు వెచ్చించనుంది.

వైజాగ్ కంపెనీ..: విశాఖపట్టణం కేంద్రంగా కార్యకలాపాలు విస్తరించిన వైభవ్ జ్యువెలర్స్ ప్రధానంగా పసిడి, డైమండ్స్, జెమ్స్, ప్లాటినమ్, వెండి ప్రొడక్టులను విక్రయిస్తోంది. విశేష బ్రాండుతో ప్రీమియం ధరల గోల్డ్, డైమండ్ జ్యువెలరీని సైతం ఆఫర్ చేస్తోంది. 1994లో ఏర్పాటైన కంపెనీ గత ఆర్థిక సంవత్సరం(2021–22)లో రూ. 1,694 కోట్ల ఆదాయం సాధించింది. ఆర్గనైజ్‌డ్ విభాగంలో 2020–21కల్లా సుమారు 14 శాతం మార్కెట్ వాటాను ఆక్రమిస్తున్నట్లు టెక్నోప్యాక్ నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం గ్రంధి భారత మల్లికా రత్న కుమారి, గ్రంధి సాయి కీర్తన నిర్వహణలో కంపెనీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ గోల్డ్ జ్యువెలరీ విభాగంలో తనిష్క్, కల్యాణ్, మలబార్ గోల్డ్, జీఆర్‌టీ, జోయాలుక్కాస్ తదితర పలు సంస్థలు పోటీ పడుతున్న సంగతి తెలిసిందే.

ఎన్ఎస్ఈ మాజీ చీఫ్ రవి నారాయణ్ అరెస్టు



న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) మాజీ ఎండీ, సీఈవో రవి నారాయణ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. స్టాక్ ఎక్స్ఛేంజీకి సంబంధించిన కో–లొకేషన్ స్కామ్‌లోనూ, ఉద్యోగుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసిన కేసులోనూ ఆయన పాత్రపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ప్రస్తుతం ట్యాపింగ్ కేసులో ఆయన్ను అరెస్ట్ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇదే ఆరోపణలపై ఎన్ఎస్ఈ మరో మాజీ సీఈవో చిత్రా రామకృష్ణను ఈడీ ఇప్పటికే అరెస్ట్ చేసింది. అటు సీబీఐ ఆమెను కో–లొకేషన్ కేసులో అరెస్ట్ చేసింది. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ముంబై మాజీ పోలీస్ కమిషనర్ సంజయ్ పాండేను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది.

స్వల్ప నష్టాల ముగింపు

- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- ప్రతికూల అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- 592 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్
- నిఫ్టీ నష్టం పది పాయింట్లు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు మంగళవారం చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. చివరి గంటలో ఎఫ్ఎంసీజీ, ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్ 49 పాయింట్లు నష్టపోయి 59,197 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పది పాయింట్లు పతనమై 17,657 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. మెటల్, ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంక్స్, ఇంధన షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఉదయం సెన్సెక్స్ 39 పాయింట్లు లాభంతో 59,285 వద్ద, నిఫ్టీ 30 పాయింట్లు పెరిగి 17,696 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 592 పాయింట్ల పరిధిలో 58,974 వద్ద కనిష్టాన్ని, 59,567 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 177 పాయింట్ల రేంజ్‌లో 17,588–17,765 శ్రేణిలో కదలాడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1144 కోట్ల షేర్లను, దేశీయ ఇన్వెస్టర్లు రూ.633 కోట్ల షేర్లను కొన్నారు.

డ్రీమ్‌ఫోక్స్ సర్వీసెస్ లిస్టింగ్ సక్సెస్

ఎయిర్‌పోర్ట్ అగ్రిగేటర్ డ్రీమ్‌ఫోక్స్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ లిస్టింగ్ విజయవంతమైంది. ఇష్యూ ధర రూ.326తో పోలిస్తే ఈ షేరు బీఎస్ఈలో 54.90% లాభంతో రూ.505 వద్ద లిస్టయ్యింది. 69% ర్యాలీ చేసి రూ.550 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 42% బలపడి రూ.463 వద్ద స్థిరపడింది.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్, సికింద్రాబాద్‌లో 3068 పోస్టులు

సికింద్రాబాద్‌లోని సెంట్రల్ రిక్రూట్‌మెంట్ సెల్–ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ సెంటర్..దేశవ్యాప్తంగా ఉన్న ఏవోసీ రీజియన్లలో ట్రేడ్స్‌మ్యాన్ మేట్,ఫైర్‌మ్యాన్,జేఏవో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3068
» **పోస్టుల వివరాలు:** ట్రేడ్స్‌మ్యాన్ మేట్–2313, ఫైర్‌మ్యాన్–656,జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్–99
» **అర్హత:** పోస్టును అనుసరించి పదోతరగతి, 10+2/ఇంటర్మీడియెట్,ఐటీఐ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** ఏడో పే కమిషన్ ప్రకారం –ఫైర్‌మ్యాన్, జేవోఏ పోస్టులకు రూ.19,900 నుంచి రూ.63,200, ట్రేడ్స్‌మ్యాన్ పోస్టులకు రూ.18,000 నుంచి రూ.56,900 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఫిజికల్/ప్రాక్టికల్/స్కిల్ పరీక్షలు, రాతపరీక్ష, మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.
» **వెబ్‌సైట్:** www.aocrecruitment.gov.in

తెలంగాణలో 1540 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)..వివిధ ఇంజనీరింగ్ సర్వీసుల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1540
» **పోస్టుల వివరాలు:** ఏఈఈ(సివిల్)–పీఆర్–ఆర్‌డీ డిపార్ట్‌మెంట్(మిషన్ భగీరథ)–302, ఏఈఈ(సివిల్)–పీఆర్–ఆర్‌డీ డిపార్ట్‌మెంట్–211, ఏఈఈ(సివిల్)ఎంఏ–యూడీ–పీహెచ్–147,ఏ ఈఈ(సివిల్)టీడబ్ల్యూ డిపార్ట్‌మెంట్–15, ఏఈఈఐ–సీఏడీ డిపార్ట్‌మెంట్–704, ఏఈఈ(మెకానికల్)ఐ–సీఏడీ(జీడబ్ల్యూడీ)–3,ఏఈఈ(సివిల్)టీఆర్–బి–145,ఏఈఈ(ఎలక్ట్రికల్)టీఆర్–బి13.
» **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ(సివిల్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/అగ్రికల్చర్ ఇంజనీరింగ్) తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 22.09.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.10.2022
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

ఎఫ్‌సీఐలో 113 మేనేజ్‌మెంట్ ట్రైనీ

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న న్యూఢిల్లీలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ).. దేశవ్యాప్తంగా ఉన్న ఎఫ్‌సీఐ డిపోలు, కార్యాలయాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 29వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 113
» **విభాగాలు:** జనరల్, డిపో, మూవ్‌మెంట్, అకౌంట్స్, టెక్నికల్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్, హిందీ

అర్హతలు

» పోస్టులను అనుసరించి ఏదైనా గ్రాడ్యుయేషన్, బీకాం, బీఎస్సీ,బీటెక్/బీఈ, సీఏ,సీఎస్, ఐసీడబ్ల్యూఏ,ఎంఏ,ఎంబీఏ,పీజీడీఎం,పీజీ డిప్లొమా, ఐసీఏఐ తదితర విద్యార్హతలను కలిగి ఉండాలి.
» **వయసు:** పోస్టులను అనుసరించి 01.08.2022 నాటికి 35ఏళ్లకు మించకుండా ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది. **వేతనాలు:** ఈ పోస్టులకు ఎంపికైన వారికి ప్రతి నెల రూ.40,000–రూ.1,40,000వేతన శ్రేణి లభిస్తుంది.

ఎంపిక ఇలా

ఫేజ్–1,2 ఆన్‌లైన్ పరీక్ష,ఇంటర్వ్యూ,శిక్షణ ఆధారంగా అభ్యర్థులను ఆయా పోస్టులకు ఎంపిక చేస్తారు.

పరీక్ష విధానం

» **ఫేజ్–1:** ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో 100 ప్రశ్నలకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి నాల్గో వంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. ఇంగ్లిష్ , హిందీ మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.
» ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–25 మార్కులు; రీజనింగ్ ఎబిలిటీ 25 ప్రశ్నలు–25 మార్కులు; న్యూమరికల్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–25 మార్కులు; జనరల్ స్టడీస్ (ఇండియన్ హిస్టరీ, ఇండియన్ ఎకానమీ, జాగ్రఫీ అండ్ జనరల్ సైన్స్‌ల నుంచి 20 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్ నుంచి 5 ప్రశ్నలు) విభాగాల నుంచి 25 ప్రశ్నలు–25 మార్కులకు పరీక్ష ఉంటుంది.
» **ఫేజ్–2:** ఈ పరీక్ష మొత్తం నాలుగు పేపర్లుగా నిర్వహిస్తారు. ఎంపిక చేసుకునే పోస్ట్ కోడ్‌ను అనుసరించి ప్రశ్నపత్రం ఉంటుంది. పేపర్1.. 120 మార్కులకు జరుగుతుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు. పేపర్–2.. 120 మార్కులకు 60 నిమిషాల వ్యవధిలో ఉంటుంది. అలాగే పేపర్–3.. 120 మార్కులకు 90 నిమిషాల వ్యవధిలో జరుగుతుంది. పేపర్–4.. 120 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు.

ముఖ్యమైన సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 26.09.2022
» **పరీక్ష తేదీ:** డిసెంబర్, 2022
» **వెబ్‌సైట్:** https://fci.gov.in

యూకే.. స్కేల్ అప్‌కు ఓకే!

విదేశాల్లో విద్య, ఉద్యోగం.. నేటి యువతలో ఎక్కువ మంది స్వప్నం! తమ కల సాకారం కోసం ముందుగా విదేశీ వర్సిటీలో ప్రవేశం.. ఆ తర్వాత అక్కడి విద్యార్హతతో ఉద్యోగాన్వేషణ కొనసాగించడం!! నేరుగా ఉద్యోగం పొందాలంటే..ఆయా దేశాల నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయి! ఇలాంటి పరిస్థితుల్లో జాబ్స్ అబ్రాడ్ అభ్యర్థులకు మేలు చేసేలా.. యూకే నూతన వీసా పథకాన్ని ప్రకటించింది. ఆ పథకమే.. స్కేల్ అప్ వీసా స్కీమ్! ఈ నేపథ్యంలో.. యూకే స్కేల్ అప్ వీసా స్కీమ్ ఉద్దేశం, నిబంధనలు, అర్హతలు తదితర అంశాలపై విశ్లేషణ...

» యూకేలో ఉద్యోగాలకు కొత్తగా స్కేల్ అప్ వీసా పథకం
» వృత్తి నిపుణులు, ఉన్నత విద్యావంతులకు సరికొత్త మార్గం
» స్పాన్సర్‌షిప్‌తో 6 నెలల నుంచి 5ఏళ్ల వరకు బ్రిటన్‌లో కొలువు
» భారత యువతకు చక్కటి అవకాశం అంటున్న నిపుణులు



యూకేలోని సంస్థలకు నిపుణులైన మానవ వనరుల కొరత సమస్య నెలకొంది. ఈ విషయాన్ని అక్కడి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఆ క్రమంలోనే ఆయా రంగాల్లోని సంస్థలు స్పాన్సర్‌షిప్ ద్వారా విదేశీ నిపుణులను నియమించుకునేందుకు కొత్తగా అమల్లోకి తెచ్చిన పథకమే.. స్కేల్ అప్ వీసా స్కీమ్. ఇటీవల ఈ కొత్త వీసా పథకాన్ని యూకే ప్రభుత్వం ప్రకటించింది.

వ్యాపారాభివృద్ధి దిశగా

స్కేల్ అప్ వీసా పథకం ప్రధాన ఉద్దేశం..ఆయా రంగాల్లోని సంస్థల వృద్ధికి తోడ్పాటును అందించడం. ఇందుకోసం కీలకమైన మానవ వనరుల నియామకాల పరంగా విదేశీ టాలెంట్‌కు స్వాగతం పలకాలని బ్రిటన్ ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం దాదాపు 35 వేలకు పైగా వ్యాపార సంస్థలు స్కేల్ అప్ వీసా పథకం ద్వారా విదేశీ నిపుణులను నియమించుకునే అర్హత పొందాయి. దీని ద్వారా ఆయా సంస్థలు స్పాన్సర్‌షిప్ లెటర్‌తో విదేశీయులను నియమించుకునే అవకాశం ఉంది.

ఈ ప్రమాణాలుంటేనే

స్కేల్ అప్ వీసా పథకం ద్వారా విదేశీ నిపుణులను నియమించుకోవాలనుకునే సంస్థలకు అర్హత నిబంధనలు పేర్కొంది. అవి..

- స్పాన్సర్ లైసెన్స్ పొందే తేదీ నాటికి కనీసం మూడేళ్ల ముందు సదరు సంస్థను, లేదా వ్యాపారాన్ని ప్రారంభించి ఉండాలి.
- ప్రతి ఏటా సంస్థ ఉత్పత్తుల అమ్మకాల టర్నోవర్ లేదా ఉపాధి కల్పనలో 20 శాతం వృద్ధి నమోదు చేసుకుని ఉండాలి.
- గడిచిన మూడేళ్ల వ్యవధిలో కనీసం పది మంది ఉద్యోగులతో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తుండాలి.
- ఈ నిబంధనలు పాటించే సంస్థలన్నీ స్కేల్ అప్ వీసా ద్వారా.. విదేశీ నిపుణులను నియమించుకోవడానికి, స్పాన్సర్‌షిప్ లెటర్ ఇచ్చేందుకు అర్హత పొందుతాయి.

స్పాన్సర్‌షిప్ లెటర్

స్కేల్ అప్ వీసా ద్వారా విదేశీయులను నియమించుకునే సంస్థలు.. సదరు వ్యక్తులకు స్పాన్సర్‌షిప్ లెటర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆయా సంస్థ సదరు వ్యక్తిని తాము నియమించుకుంటున్నట్లు తెలిపే లేఖ ఇది. దీని ఆధారంగానే ఉద్యోగం పొందిన వారికి యూకేలో పనిచేసేందుకు వీసా లభిస్తుంది.

తొలుత ఆరు నెలలు

కొత్త పథకం ద్వారా స్పాన్సర్‌షిప్ లెటర్‌తో దరఖాస్తు చేసుకున్న వారికి తొలుత ఆరు నెలల వ్యవధికి స్కేల్ అప్ వీసా మంజూరు చేస్తారు. దీనినే స్పాన్సర్‌షిప్ రూట్ అని కూడా పిలుస్తున్నారు. ఆరు నెలల వ్యవధి తర్వాత కూడా యూకేలోనే మరో ఉద్యోగంలో కొనసాగే అవకాశం ఉంది. స్కేల్ అప్ వీసా కనీస వ్యవధి ఆరు నెలలు ముగిసిన తర్వాత మరో సంస్థ లేదా యజమాని ద్వారా స్పాన్సర్‌షిప్ లెటర్ పొంది.. దాని ఆధారంగా రెండేళ్ల వరకు ఉండొచ్చు. ఆ తర్వాత మరో స్పాన్సరర్ లెటర్ ఆధారంగా మరో మూడేళ్లు యూకేలోనే ఉద్యోగం చేసుకోవచ్చు. అంటే.. ఒకసారి స్కేల్ అప్ వీసా ద్వారా ఆరు నెలల ప్రాథమిక గడువుతో అడుగు పెట్టిన వారు.. గరిష్టంగా అయిదేళ్లపాటు పాటు యూకేలో పని చేసే అవకాశం ఉంటుంది. అయిదేళ్లు పూర్తయిన తర్వాత కూడా అక్కడే ఉద్యోగం పొందితే శాశ్వతంగా యూకేలోనే ఉద్యోగం చేసే వీలుంది. ఉద్యోగం మారిన ప్రతిసారి స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా వీసా పొడిగింపునకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

కనీస వేతనం తప్పనిసరి

యూకే స్కేల్ అప్ వీసా పథకం ద్వారా ఉద్యోగంలో చేరాలంటే..కనీస వేతనం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఏడాదికి కనీసం 33వేల పౌండ్ల వేతనం లేదా గంటకు పది పౌండ్ల వేతనం ఇచ్చే ఉద్యోగాలకే స్కేల్ అప్ వీసా మంజూరు చేస్తారు.

విద్యార్హతలు

- స్కేల్ అప్ వీసా ద్వారా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే వారికి విద్యార్హతలను కూడా నిర్దేశించారు. అవి..
- బ్యాచిలర్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- సెక్యూర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్. అంటే.. నిర్దేశిత ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

సెక్యూర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్(సెల్ట్)

ఈ టెస్ట్ కోసం యూకే ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు సంస్థలు నిర్వహించే టెస్ట్‌లలో ఏదో ఒక టెస్ట్‌లో బి1 లెవల్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఐఈఎల్‌టీఎస్–ఎస్ఈఎల్‌టీ కన్సార్షియం నిర్వహించే టెస్ట్ లేదా, పియర్సన్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్, లేదా పీఎస్ఐ సర్వీసెస్(యూకే) నిర్వహించే స్కిల్స్ ఫర్ ఇంగ్లిష్ యూకేవీఐ లేదా లాంగ్వేజ్‌సెర్ట్ నిర్వహించే ఇంటర్నేషనల్ ఈఎస్ఓఎల్ సెల్ట్ పరీక్షల్లో ఏదో ఒక పరీక్షకు హాజరయ్యే వెసులుబాటు ఉంది.

పాయింట్ల ఆధారంగా

- స్కేల్ అప్ వీసా మంజూరు విషయంలో పాయింట్ల విధానం ద్వారా నిర్ణయం తీసుకునేలా నిబంధనలు రూపొందించారు. గరిష్టంగా 70 పాయింట్లు ఉంటాయి.
- స్పాన్సర్‌షిప్ అప్లికేషన్‌కు 50 పాయింట్లు; బి1 లెవల్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యానికి 10 పాయింట్లు, స్వీయ ఆర్థిక నిధులకు సంబంధించి 10 పాయింట్లు.. ఇలా మొత్తం 70 పాయింట్ల విధానాన్ని అమలు చేస్తారు.

డిపెండెంట్ వీసా కూడా

స్కేల్ అప్ వీసా స్కీమ్‌లో.. సదరు ఉద్యోగం పొందిన వ్యక్తులు డిపెండెంట్ వీసా ద్వారా తమ జీవిత భాగస్వామిని, పిల్లలను కూడా తీసుకువెళ్లే అవకాశం ఉంది. ఇందుకోసం సదరు వ్యక్తులు డిపెండెంట్ పార్ట్‌నర్ వీసా, డిపెండెంట్ చిల్డ్రన్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీరు వీసా అప్లికేషన్ దరఖాస్తు ఫీజుతోపాటు హెల్త్‌కేర్ సర్‌ఛార్జ్ మొత్తాలను చెల్లించాలి.

మూడు నెలల ముందుగా

స్కేల్ అప్ వీసా విధానంలో..స్పాన్సర్‌షిప్ విధానంలో వీసాకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే.. సదరు సంస్థలో పని తేదీ ప్రారంభానికి కనీసం మూడు నెలల ముందుగా యూకే ఇమిగ్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అదే విధంగా డిపెండెంట్ల విషయంలో కనీసం ఏడాదికి సరిపడే రీతిలో ఆర్థిక నిధుల రుజువులను చూపించాల్సి ఉంటుంది.

అవసరమైన పత్రాలు

- స్కేల్ అప్ వీసాకు దరఖాస్తు చేసుకునే వారు పలు డాక్యుమెంట్స్ సమర్పించాల్సి ఉంటుంది.. అవి.. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ రిఫరెన్స్ నెంబర్; ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్‌ను ధ్రువపరిచే సర్టిఫికెట్; సిటిజన్‌షిప్ పాస్‌పోర్ట్; ఉద్యోగ హోదా పేరు, వార్షిక వేతనం; ఉద్యోగ వృత్తి కోడ్; యజమాని స్పాన్సర్ లైసెన్స్ నెంబర్; కనీసం 1,270 పౌండ్లకు సమానమైన మొత్తం ఉన్నట్లు రుజువు; విద్యార్హతల ధ్రువ పత్రాలు.

భారతీయులకు ప్రయోజనం

యూకే అమల్లోకి తెచ్చిన స్కేల్ అప్ వీసా పథకం ద్వారా భారతీయులకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల యూకే హై కమిషన్ ప్రకటించిన వివరాల ప్రకారం– 2022 జూన్ నాటికి 1,02,981 మంది భారతీయులకు వర్క్ వీసా లభించింది. 2019తో పోల్చితే దాదాపు 80 శాతం వృద్ధి కనిపించింది. అదే విధంగా యూకే జారీ చేసిన వీసాల్లో అత్యధిక వీసాలతో భారత్ అగ్ర స్థానంలో నిలిచింది. అంతే కాకుండా స్కిల్డ్ వర్కర్స్ వీసా విషయంలోనూ భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్య 46 శాతం పెరిగింది. దీనికి ప్రధాన కారణం.. భారత్‌లో ఉన్న నిపుణులు, ఉన్నత విద్యా వంతులే. దీంతో స్కేల్ అప్ వీసా విషయంలోనూ భారత్‌కు ఎక్కువగా ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

యూకే.. స్కేల్ అప్ వీసా.. ముఖ్యాంశాలు

- ఈ విధానం ద్వారా యూకేలోని దాదాపు 35 వేల సంస్థల్లో ఉద్యోగావకాశాలు
- కనీస వేతనం ఏడాదికి 33 వేల పౌండ్లు లేదా గంటకు పది పౌండ్లు.
- ముందుగా ఆరు నెలలకు స్కేల్ అప్ వీసా మంజూరు. తర్వాత గరిష్టంగా అయిదేళ్ల వరకు పొడిగించుకునే అవకాశం.
- భారతీయులకు ప్రయోజనంగా మారనున్న విధానం. ఇప్పటికే స్కిల్డ్ వర్కర్స్ వీసాలో ముందంజలో ఉంటున్న భారతీయులు.

సీట్ల కేటాయింపు 6 రౌండ్లకు పరిమితం

సాక్షి, అమరావతి: ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు సీట్ల కేటాయింపు ప్రక్రియను ఈసారి ఆరు రౌండ్లలో పూర్తి చేయాలని జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా)-2022 నిర్ణయించింది. ఈసారి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి ఆలస్యం కావడంతో సీట్ల కేటాయింపును ఆరు విడతలకే పరిమితం చేసింది. గతంలో ఏడు రౌండ్ల మేర సీట్ల కేటాయింపు చేయడంతోపాటు ప్రత్యేక రౌండ్లను కూడా నిర్వహించింది. 2015, 2016ల్లో నాలుగేసి రౌండ్లలో సీట్ల కేటాయింపును పూర్తి చేయగా 2017, 2018, 2019ల్లో ఏడేసి రౌండ్లలో సీట్ల కేటాయింపు చేశారు. 2020, 2021ల్లో ఆరు రౌండ్లలో ముగించారు. ఈసారి సీట్ల కేటాయింపును త్వరగా పూర్తి చేసి తరగతులు ప్రారంభమయ్యేలా జోసా షెడ్యూల్‌ను రూపొందించింది.

12 నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ..

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల ఫలితాలను ఈ నెల 11న విడుదల చేయనుండడంతో మరుసటి రోజు అంటే 12 నుంచి సీట్ల కేటాయింపునకు కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ఆ రోజు నుంచి మెరిట్ విద్యార్థులు జోసా కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు చాయిస్‌లు నమోదు చేయాల్సి ఉంటుంది. ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ) ఫలితాలు ఈ నెల 17న వెలువడనున్నందున ఆర్కిటెక్చర్ కోర్సు ఔత్సాహికులు ఆ రోజున చాయిస్‌లను నమోదు చేయాలి. ఇలా చాయిస్‌లను నమోదు చేసిన వారికి 18న మాక్ సీట్ కేటాయిస్తారు. ఆ తర్వాత మళ్లీ చాయిస్‌ల నమోదుకు అవకాశమిచ్చి 20న మాక్ సీట్ కేటాయింపు చేస్తారు. తమ ర్యాంకుకు ఏ కోర్సులో, ఏ సంస్థలో సీటు వస్తుందో ఒక అవగాహనకు వచ్చిన విద్యార్థులు చివరగా సెప్టెంబర్ 20న చాయిస్‌లను లాక్ చేయాల్సి ఉంటుంది. అనంతరం సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 17 వరకు ఆరు రౌండ్లలో సీట్ల కేటాయింపును చేపడతారు. ఇక ఎన్ఐటీలు, తదితర సంస్థల్లో మిగిలి ఉండే సీట్లకు ప్రత్యేక రౌండ్ ద్వారా నిర్వహిస్తారు.



ఎన్ని సంస్థలు, ఎన్ని సీట్లు..

దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, 26 ఐఐఐటీలు, 36 ఇతర సంస్థల్లో విద్యార్థులకు జోసా సీట్లను కేటాయిస్తుంది. కాగా అందరూ సీట్లు ఆశించే 23 ఐఐటీల్లో 16 వేలకుపైగా సీట్లు ఉన్నాయి. మరోవైపు ఐఐటీల్లో అమ్మాయిల చేరికలను 20 శాతం మేర పెంచేందుకు కేంద్రం2018 నుంచి 2020 వరకు వారికి ఆయా సంస్థల్లో సూపర్ న్యూమరరీ కోటాను ప్రకటించింది. 2021 నుంచి ఈ కేటాయింపును ఆయా జాతీయ విద్యా సంస్థలే నిర్ణయానికే వదిలేసింది.

ఆయా విద్యా సంస్థల్లో మొత్తం సీట్లు, మహిళలకు సూపర్ న్యూమరరీ కింద కేటాయించిన సీట్లు ఇలా..

సంస్థ	మొత్తం సీట్లు	సూపర్ న్యూమరరీ సీట్లు
ఐఐటీలు	16,232	1,534
ఎన్ఐటీలు	23,997	598
ఐఐఐటీలు	6,146	305
జీఎఫ్‌టీఐలు	6,078	0

జోసా షెడ్యూల్ ఇలా..

సెప్టెంబర్ 11	జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల ప్రకటన
12	జోసా రిజిస్ట్రేషన్లు, చాయిస్ ఫిల్లింగ్
18	మొదటి విడత మాక్ సీట్ల కేటాయింపు
20	రెండో విడత మాక్ సీట్ల కేటాయింపు, చాయిస్ లాక్
21	రిజిస్ట్రేషన్, చాయిస్ ఫిల్లింగ్ ఆటోలాకింగ్ సిస్టమ్ ముగింపు
23- 27 వరకు	మొదటి విడత సీట్ల కేటాయింపు, విద్యార్థుల స్పందన
28- అక్టోబర్ 2 వరకు	రెండో విడత సీట్ల కేటాయింపు, విద్యార్థుల స్పందన
అక్టోబర్ 3 - 7 వరకు	మూడో విడత సీట్ల కేటాయింపు, విద్యార్థుల స్పందన
అక్టోబర్ 8 - 11 వరకు	నాలుగో విడత సీట్ల కేటాయింపు, విద్యార్థుల స్పందన
అక్టోబర్ 12 - 15 వరకు	ఐదో విడత సీట్ల కేటాయింపు, విద్యార్థుల స్పందన
అక్టోబర్ 16 - 17 వరకు	ఆరో విడత సీట్ల కేటాయింపు, విద్యార్థుల స్పందన
అక్టోబర్ 16 - 21 వరకు	ఎన్ఐటీ, తదితర సంస్థల్లో మిగిలిపోయిన సీట్లకు స్పెషల్ రౌండ్

రూ.2 కోట్ల కరెన్సీతో గణపతి అలంకారం



మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణం మెయిన్‌బజార్‌లోని మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.రెండు కోట్ల కరెన్సీ నోట్లతో మంగళవారం అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గణనాథుడికి పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు.

రాష్ట్ర స్థాయి హిందీ పోటీలు

రిజిస్ట్రేషన్‌కు 10 వరకూ గడువు

సాక్షి, అమరావతి: ఈ నెల 14న జరిగే హిందీ దినోత్సవం సందర్భంగా విజయవాడకు చెందిన హిందీ ప్రేమీదళ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాష్ట్ర స్థాయి హిందీ పోటీలు నిర్వహిస్తున్నట్టు హిందీ ప్రేమీదళ్ వ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా చిత్రలేఖనం, కవితా పఠనం, వక్తృత్వం, కథలు వంటి అంశాల్లో జూనియర్, సీనియర్ స్థాయిల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు వాట్సాప్ నంబర్ 8328331831ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

అభ్యంతరాల స్వీకరణకు నేటితో గడువు ముగింపు

సాక్షి, అమరావతి: వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరతను అధిగమించడంపై వైద్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో వివిధ స్పెషాలిటీల్లో పీజీ/డిప్లమాల్లో అర్హత ఉండి డీహెచ్, డీఎంఈ పరిధిలో జనరల్ పోస్టుల్లో పనిచేస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్/ట్యూటర్‌లను వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లోకి ఫారిన్ సర్వీస్‌పై బదిలీ చేస్తున్నారు. ఇందులో భాగంగా గైనిక్, పీడియాట్రిక్స్, అనస్తీషియా వంటి 13 స్పెషాలిటీల వారీగా రీపోస్టింగ్ కోసం వైద్యుల ప్రాథమిక సీనియారిటీ జాబితాను ఇటీవల విడుదల చేశారు. ఈ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ బుధవారంతో ముగియనుంది. వైద్యులు అభ్యంతరాలు, వినతులు బుధవారం సాయంత్రంలోగా welcometoapvvp@gmail. com కు మెయిల్ చేయాల్సి ఉంటుంది. గడువు అనంతరం పంపిన అభ్యంతరాలు, వినతులు పరిగణలోకి తీసుకోరని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: ఇటీవల వచ్చిన వరదల కారణంగా పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత గ్రామాల ప్రజలు ఇప్పటికీ నానా అవస్థలు పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎం నేతలు పి.మధు, మంతెన సీతారాం విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన వినతిపత్రాన్ని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ(సీసీఎల్ఏ) సాయిప్రసాద్‌కు మంగళవారం వారు అందజేశారు.

రాహుల్ యాత్ర హాస్యాస్పదం : సాయిరెడ్డి



సాక్షి, అమరావతి: కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో' పేరిట యాత్ర నిర్వహించటం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి విమర్శించారు. రాహుల్ యాత్ర గురించి తెలిసి జనం నివ్వెరపోతున్నారని అన్నారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించాక కాంగ్రెస్‌లో చిచ్చుపెట్టి తల్లీకొడుకులు ఆ పార్టీ ఊపిరి తీశారని దుయ్యబట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంటించిన మంటలు కాంగ్రెస్ పతనానికి దారితీశాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ కలలో కూడా గెలవలేని పరిస్థితులను పార్టీ హైకమాండ్ సృష్టించిందని తెలిపారు. విభజిత ఏపీలో కాంగ్రెస్ చచ్చిపోయిందన్నారు. తెలంగాణలో కొన ఊపిరితో కొట్టుకుంటోందని పేర్కొన్నారు. మరెప్పటికీ కాంగ్రెస్ కనీసం వంద పార్లమెంట్ సీట్లను గెలిచే అవకాశాలు లేకుండా సోనియా, రాహుల్ గాంధీ చేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్‌ను ముక్కలు చెక్కలు చేసి దేశాన్ని కలుపుతామంటూ భారత్ జోడో పేరుతో రాహుల్ బయలుదేరటం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరిని ఉద్ధరించడానికి ఈ యాత్ర చేపట్టారో అర్థంకావడం లేదన్నారు. సోనియా, రాహుల్ చేసిన తప్పులపై ప్రజలకు వివరణ ఇచ్చి యాత్రకు బయలు దేరితే బాగుంటుందని ఆయన హితవు పలికారు.

23 బార్లకు లైసెన్సులు

సాక్షి, అమరావతి: ఎక్సైజ్ శాఖ రాష్ట్రంలో మరో 23 బార్లకు లైసెన్సులు కేటాయించింది. తద్వారా మొత్తం 838 బార్లకు లైసెన్సుల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్రంలో 840 బార్లకు లైసెన్సుల కేటాయింపు కోసం ఎక్సైజ్ శాఖ కొన్ని రోజుల కిందట నోటిఫికేషన్ జారీ చేసింది. మొదటి విడతలో 815 బార్లకు లైసెన్సులిచ్చింది. మిగిలిన 25 బార్లకు శుక్రవారం ఈ-వేలం నిర్వహించింది. వాటిలో 23 బార్లను అత్యధికంగా కోట్ చేసిన వారికి మంగళవారం కేటాయించింది. దీని వల్ల ప్రభుత్వానికి నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజుల రూపంలో రూ.3.02 కోట్లు, లైసెన్సు ఫీజు కింద రూ.11.82 కోట్లు వచ్చాయి. బిడ్డర్లు ఆసక్తి చూపించకపోవడంతో జగ్గయ్యపేట, కడియపులంకలోని బార్లకు లైసెన్సులు కేటాయించలేదు.

ఏపీకి మరో రూ. 879 కోట్లు విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ సహా 14 రాష్ట్రాలకు కేంద్ర ఆర్థిక శాఖ రూ. 7,183.42 కోట్ల రెవెన్యూ లోటు గ్రాంట్ విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల మొత్తం రెవెన్యూ లోటు గ్రాంట్ రూ. 86,201 కోట్లు ఉంది. అయితే అందులో 14 రాష్ట్రాలకు పోస్ట్ డెవల్యూషన్ రెవెన్యూ లోటు గ్రాంట్ ఆరవ నెల వాయిదాను మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన రెవెన్యూ లోటు గ్రాంట్ రూ.43,100.50 కోట్లకు చేరింది. కాగా 2022-23లో ఏపీకి సిఫార్సు చేసిన పోస్ట్ డెవల్యూషన్ రెవెన్యూ లోటు గ్రాంట్ రూ. 10,549 కోట్లు కాగా, ఆరో విడతగా రూ. 879.08 కోట్లు కేంద్ర ఆర్థిక శాఖలోని వ్యయ విభాగం అందించింది.

ఫిష్ ఆంధ్రాతో ఆక్వాకల్చర్ రాజధానిగా ఏపీ

- రాష్ట్రవ్యాప్తంగా 100 ఆక్వాహబ్‌లు, 14 వేలకుపైగా రిటైల్ ఔట్‌లెట్లు
- వీటిలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు పేటీఎంతో ఒప్పందం
- ప్రతి రిటైల్ ఔట్‌లెట్‌కు రూ.22 వేల విలువైన పరికరాలు
- మత్స్యశాఖ మంత్రి అప్పలరాజు



రిటైల్ అవుట్ లెట్ నిర్వాహకురాలికి పేటీఎం పోస్ మిషన్, క్యూఆర్ కోడ్ అందిస్తున్న మంత్రి సీదిరి

సాక్షి, అమరావతి: ఫిష్ ఆంధ్రాతో ఆక్వాకల్చర్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందుతుందని మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. సాగు, దిగుబడులు, ఎగుమతుల్లోనే కాకుండా స్థానికంగా వినియోగంలో సైతం రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఔత్సాహికులతో కలిసి ఆక్వా హబ్‌లు, రిటైల్ ఔట్‌లెట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తోందని చెప్పారు. వీటిలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి పేటీఎంతో కలిసి పనిచేస్తున్నామన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం మంత్రి సమక్షంలో పేటీఎం, రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య (ఆప్కాఫ్) మధ్య ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఆప్కాఫ్ చైర్మన్ కె.అనిల్ బాబు, పేటీఎం చీఫ్ బిజినెస్ మేనేజర్ అభయ శర్మ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. అనంతరం రిటైల్ ఔట్‌లెట్ నిర్వాహకులకు రూ.22 వేల విలువైన పాయింట్ ఆఫ్ సేల్ (పోస్), క్యూఆర్ కోడ్, తదితరాలను పేటీఎం సంస్థ ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 100 ఆక్వా హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటికి అనుబంధంగా 14 వేలకుపైగా రిటైల్ ఔట్‌లెట్లను తీసుకొస్తున్నామని చెప్పారు. మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ.. ఫిష్ ఆంధ్రా ద్వారా పోషక విలువలు ఉన్న తాజా చేపలు, సముద్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతామన్నారు. వీటి ద్వారా ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. పేటీఎం చీఫ్ బిజినెస్ మేనేజర్ అభయ్ శర్మ మాట్లాడుతూ.. ఫిష్ ఆంధ్రా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న కృషిలో పేటీఎంను భాగస్వామిని చేయడం గర్వకారణంగా ఉందన్నారు.

టీడీపీ, వైఎస్సార్‌సీపీకి బీజేపీ వ్యతిరేకం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు



మదనపల్లె: టీడీపీ, వైఎస్సార్ సీపీ వంటి కుటుంబపార్టీలకు బీజేపీ వ్యతిరేకమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. కుటుంబ పార్టీల వల్ల ఏపీ అభివృద్ధి చెందదన్నారు. మంగళవారం మదనపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాన్ని దత్తపుత్రికగా భావిస్తున్నారని చెప్పారు. రూ.8.16 లక్షల కోట్లతో ఏపీని ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.6 లక్షల కోట్లతో రాజధాని నిర్మాణమంటూ చంద్రబాబు రూ.7 వేల కోట్లు ఖర్చు చేసి ఐదు మొండి బిల్డింగ్‌లు కట్టారని విమర్శించారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 5,000 చోట్ల బహిరంగసభలు, రాజంపేట పార్లమెంట్ స్థానం పరిధిలో 300 సభలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బీజేపీ పోటీ చేస్తుందని చెప్పారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సాయిలోకేశ్, నాగరెడ్డెమ్మ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసింది మేనత్త కొడుకే

- బాలికపై యాసిడ్ దాడి కేసులో నెల్లూరు రూరల్ డీఎస్పీ హరినాథరెడ్డి వెల్లడి
- బాలికపై నిందితుడు ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడలేదు
- వైద్యం ఖర్చు ప్రభుత్వానిదే: పద్మ

నెల్లూరు (క్రైమ్)/సాక్షి, అమరావతి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో సోమవారం సాయంత్రం బాలికపై యాసిడ్ పోసి గొంతు కోసిన వ్యక్తి బాధితురాలి స్వయాన మేనత్త కొడుకేనని నెల్లూరు రూరల్ డీఎస్పీ వై.హరినాథరెడ్డి వెల్లడించారు. దాడి అనంతరం ఇంట్లోని నగదును అపహరించుకుని వెళ్లాడన్నారు. వివరాలను మంగళవారం మీడియాకు వివరించారు. చెముడుగుంట నక్కలకాలనీలో నివాసముంటున్న దంపతుల కుమార్తె(14) తొమ్మిదో తరగతి చదువుతోంది. బాలిక మేనత్త కొడుకు నాగరాజు భార్య వినాయక చవితి వేడుకల కోసం కసుమూరులోని పుట్టింటికి వెళ్లింది. మరోవైపు.. ఈనెల 5న బాలిక తల్లిదండ్రులు పనికి వెళ్లారు. బాలిక ఇంట్లో ఒంటరిగా ఉంది. నాగరాజు మద్యం తాగొచ్చి ఆమె ఇంట్లోకి ప్రవేశించాడు. భోజనం చేసేందుకు కూర కావాలని కోరాడు. బాలిక కూర ఇవ్వగా నిందితుడు దానిని తీసుకువెళ్లి భోజనం చేశాడు. అనంతరం కూర గిన్నెలో యాసిడ్ పోసుకుని మళ్లీ బాలిక దగ్గరకు



వచ్చాడు. బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా ఆమె వెంటనే పారిపోయేందుకు యత్నించింది. ఇంతలో నిందితుడు యాసిడ్‌లో ఓ వస్త్రాన్ని ముంచి దానిని ఆమె ముఖంపై గట్టిగా అద్ది కత్తితో ఆమె గొంతుకోశాడు. దీంతో బాలిక స్పృహ కోల్పోవడంతో మృతిచెందిందని భావించి బీరువా నుంచి రూ.4 వేలు, ఆమె చెవికున్న కమ్మలను తీసుకుని పరారయ్యాడు. స్పృహ నుంచి కోలుకున్న బాధితురాలు చుట్టుపక్కల వారికి విషయాన్ని తెలియజేసింది. వారు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ కె.చక్రధర్‌బాబు, ఎస్పీ సీహెచ్ విజయారావు తదితరులు మెరుగైన వైద్యం కోసం బాలికను అపోలో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నై అపోలోకు తరలించారు. బాలికపై ఎలాంటి అఘాయిత్యం జరగలేదని.. పూర్తిగా దర్యాప్తుచేసి నిందితునిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.

బాలిక త్వరగా కోలుకోవాలి : వాసిరెడ్డి పద్మ

దాడి ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ స్పందించారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని, వైద్యానికి అయ్యే ఖర్చంతా ప్రభుత్వం భరిస్తుందన్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలి

ఔషధ నియంత్రణ విభాగం అధికారులకు మంత్రి రజిని ఆదేశం

సాక్షి, అమరావతి/తాడేపల్లిరూరల్: ప్రజల శ్రేయస్సే ఉమ్మడి లక్ష్యంగా ఔషధ నియంత్రణ విభాగం అధికారులు, సిబ్బంది పని చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. సచివాలయం ఐదో బ్లాక్‌లోని కలెక్టర్ల కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం మంత్రి.. ఔషధ నియంత్రణ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ఔషధ నియంత్రణ విభాగానిది ముఖ్య పాత్ర అని కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా నకిలీ మందుల ఊసే ఉండకూడదని, ఈ విషయంలో ఇప్పటికే పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. మందుల దుకాణాలకు లైసెన్సుల జారీ, రెన్యువల్ విషయంలో అప్రమత్తతతో ఉండాలన్నారు. ఔషధ తయారీ కంపెనీలు గుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్(జీఎంపీ) ప్రకారం అన్ని నిబంధనలు పాటిస్తున్నారో, లేదో పర్యవేక్షించాలన్నారు. ఔషధ నియంత్రణ



విభాగానికి గతంలో జిల్లాల్లో ఎక్కడా కనీసం కార్యాలయాలు కూడా ఉండేవి కావని, సీఎం వైఎస్ జగన్ ప్రతి జిల్లాకు ఒక కార్యాలయం ఉండేలా కృషి చేశారని పేర్కొన్నారు. కాగా, న్యూఢిల్లీలోని ఎన్‌సీడీసీ(నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్) ప్రధాన కార్యాలయం ద్వారా దేశ వ్యాప్తంగా ఆరు ఎన్‌సీడీసీ సెంటర్ల నిర్మాణానికి మంగళవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయ వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. ఏపీ నుంచి మంత్రి రజిని పాల్గొని మాట్లాడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో రీజినల్ ఎన్‌సీడీసీ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. స్వైన్ ఫ్లూ, డెంగీ, మలేరియా, హెచ్ ఐవీ.. ఇలా అన్ని రోగాలకు ఈ సెంటర్లో ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేస్తారని వివరించారు.

అధికారం లేనప్పుడే బ్రాహ్మణులు గుర్తొస్తారా?

- ఎల్లో మీడియాపై ఎమ్మెల్యే మల్లాది విష్ణు ధ్వజం
- మూడేళ్లలోనే బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.398.88 కోట్లు



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎల్లో మీడియాకు చంద్రబాబు అధికారంలో లేనప్పుడే బ్రాహ్మణులు గుర్తుకొస్తారా? అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రశ్నించారు. బ్రాహ్మణ సంక్షేమంపై కొన్ని పత్రికల్లో వెలువడ్డ అసత్య కథనాలను ఆయన మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. టీడీపీకి కొమ్ము కాస్తూ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు విష ప్రచారం సాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. బ్రాహ్మణుల సాంఘిక, ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి సీఎం జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పచ్చ మీడియా నిస్సిగ్గుగా అబద్ధాలను ప్రచారం చేస్తోందన్నారు.

బాబు పాలన బ్రాహ్మణులకు చీకటి యుగం

బాబు పాలన బ్రాహ్మణ సామాజిక వర్గానికి చీకటి యుగమన్నారు. వైఎస్ జగన్ సీఎంగా వచ్చాకే బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పటిష్టం చేసి కొత్త వెలుగులు నింపారని గుర్తు చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు చంద్రబాబు హయాంలో కేటాయించిన మొత్తం రూ.285 కోట్లు కాగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిక మూడేళ్లలోనే రూ.398.88 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. నవరత్నాల ద్వారా బ్రాహ్మణ సామాజిక వర్గానికి రెట్టింపు సంక్షేమాన్ని అందించారని పేర్కొన్నారు. అర్చకులకు వంశ పారంపర్య హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తే గొంతెమ్మ కోర్కెలంటూ అవమానించిన వ్యక్తి చంద్రబాబుని గుర్తుచేశారు. ఆలయాలపై చంద్రబాబు హయాంలో నియమించిన పాలక మండళ్ల వేధింపులు తట్టుకోలేక పలువురు అర్చకులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఐఏఎస్ అధికారి ఐవైఆర్ కృష్ణారావును ఏ విధంగా అవమానించారో ఎల్లో మీడియాకు గుర్తు లేదా? అని ప్రశ్నించారు. సదావర్తి భూములు సహా రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల భూములను టీడీపీ హయాంలో మింగేశారని మండిపడ్డారు. బ్రాహ్మణులకు మూడు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

చరిత్రను బీజేపీ పక్కదారి పట్టిస్తోంది: కేవీపీ

సాక్షి, న్యూఢిల్లీ: క్విట్ ఇండియా ఉద్యమం, తెలంగాణ విలీనం.. ఇలా ప్రతి విషయంలోనూ చరిత్రను బీజేపీ పక్కదారి పట్టిస్తోందని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు మండిపడ్డారు. దేశ చరిత్రను ఇష్టానుసారం వక్రీకరిస్తోందని, చరిత్ర పేజీల నుంచి కాంగ్రెస్‌ను తొలగించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. భావోద్వేగాలను, సెంటిమెంట్లను రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆరెస్సెస్, హిందూ మహాసభ వేర్పాటువాద, అతివాద విధానాలను ప్రజలు ఆమోదించలేదని, అయినా ఆ విధానాలు నేటికీ కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. నెహ్రూ త్యాగాలను విస్మరిస్తూ, చరిత్ర నుంచి తుడిచిపెట్టేలా కర్ణాటక పాఠ్యపుస్తకాల్లో క్విట్ ఇండియా అంశాలను తొలగించడం శోచనీయమని అన్నారు. అసలు క్విట్ ఇండియా ఉద్యమంలో ఆరెస్సెస్ పాత్ర ఏమిటో చెప్పాలన్నారు.

అది 'ఐ-టీడీపీ' పనే

- మార్ఫింగ్ వీడియోలతో దుష్ప్రచారం
- ఐటీ, ఫోర్జరీ చట్టాల కింద సీఐడీ కేసు నమోదు

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష టీడీపీ సోషల్ మీడియా విభాగం 'ఐ-టీడీపీ'పై ఏపీ సీఐడీ విభాగం కేసు నమోదు చేసింది. మార్ఫింగ్ వీడియోల ద్వారా హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రతిష్టకు భంగం కలిగించిందన్న ఫిర్యాదుపై టీడీపీ సోషల్ మీడియా విభాగంపై కేసు నమోదు చేశారు. కుట్రపూరితంగా వ్యవహరించడం, దుష్ప్రచారానికి ఒడిగట్టి గౌరవానికి భంగం కలిగించడం, ఫోర్జరీకి పాల్పడిన అభియోగాలపై ఐటీ, ఐపీసీలోని ఫోర్జరీ చట్టాల కింద కేసు నమోదు చేసినట్టు మంగళవారం ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు 'ఐ-టీడీపీ', మరికొందరిపై ఐటీ(66టి), ఐపీసీ 465, 469, 471, 153(ఎ), 505(2), 120(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎంపీ గోరంట్ల మాధవ్ పేరుతో ఇటీవల ఓ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. దీనిపై ఎంపీ మాధవ్ పోలీసులు, సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మార్ఫింగ్ వీడియోను వైరల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దాంతో అనంతపురం పోలీసులు విచారించగా, అది ఫేక్ వీడియో అని నిర్ధారణ అయ్యింది. ఆ మార్ఫింగ్ వీడియోను ఐ-టీడీపీ సోషల్ మీడియా గ్రూప్ తొలుత సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసినట్టు కూడా వెలుగు చూసింది.

అది ఒరిజినల్ కానేకాదు..

ఆ వీడియో అసలైనదేనని అమెరికాకు చెందిన 'ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ' నిర్ధారించినట్టుగా టీడీపీ నేతలు విలేకరుల సమావేశంలో చెప్పారు. ఆ మేరకు ఎక్లిప్స్ ల్యాబరేటరీ జారీ చేసినట్టుగా ఓ సర్టిఫికెట్‌ను కూడా విడుదల చేశారు. కాగా, ఫోరెన్సిక్ సర్టిఫికెట్ అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వం సీఐడీ విభాగాన్ని ఆదేశించింది. దాంతో సీఐడీ అధికారులు అమెరికాలోని ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీని సంప్రదించగా అసలు విషయం వెలుగు చూసింది. ఆ వీడియో అసలైందేనని తాము ఎలాంటి సర్టిఫికెట్ జారీ చేయలేదని ఆ ల్యాబొరేటరీ స్పష్టం చేసింది. ఓ సెల్‌ఫోన్‌లో ప్లే చేస్తున్న వీడియోను మరో సెల్ ఫోన్ ద్వారా రికార్డు చేసిన క్లిప్‌ను మాత్రమే ప్రసాద్ పోతిని అనే వ్యక్తి తమకు పంపినట్టుగా తెలిపింది. వీడియో కాల్ మాట్లాడుతుండగా మొదట రికార్డు చేసిన వీడియో క్లిప్‌ను పంపిస్తే ఆ వీడియోను మార్ఫింగ్ చేశారో లేదో నిర్ధారించగలం తప్ప.. ఇలా ఒక క్లిప్‌ను మూడో వ్యక్తి సెల్‌ఫోన్ నుంచి రికార్డు చేసిన వీడియోను పరిశీలించి నిర్ధారించలేమని కూడా సీఐడీ విభాగానికి పంపిన ఈ మెయిల్‌లో స్పష్టం చేసింది. దాంతో ఎంపీ మాధవ్ పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో మార్ఫింగేనన్నది స్పష్టమైంది. వాస్తవానికి ఓ ల్యాబరేటరీ ఇచ్చిన సర్టిఫికెట్‌ను యథాతథంగా విడుదల చేయాలి. సర్టిఫికెట్‌లో మార్పులు చేయడం అన్నది చట్ట వ్యతిరేకం. కానీ టీడీపీ నేతలు ఎక్లిప్స్ ల్యాబొరేటరీ సర్టిఫికెట్‌ను ట్యాంపర్ చేసి మీడియాకు విడుదల చేయడం గమనార్హం. దీనిపై ఎంపీ మాధవ్ ఫిర్యాదుతో సీఐడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

గ్రామ గ్రామానా అదే ఆదరణ



పార్వతీపురం మన్యం జిల్లా పెదకోటిపల్లిలో జోరువానలో సంక్షేమ పథకాల లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని దీవిస్తున్నారు. అన్ని జిల్లాల్లో మంగళవారం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.



వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లెలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.